


జిల్లాలో సహకారశాఖ అధికారుల తీరు మారడం లేదు. మా శాఖ.. మా ఇష్టం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. వారి పర్యవేక్షణలోని సహకార సంస్థలపై ఉన్నతస్థాయి విచారణలు జరుగుతున్నా కొందరు ఆ శాఖ జిల్లా అధికారులు మాత్రం ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. తాజాగా జిల్లా సహకార ఆడిట్ అధికారి (డీసీఏవో) కార్యాలయం కేంద్రంగా వెలుగుచూసిన బోగస్ పిటిషన్ల వ్యవహారం, అందులో అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులే కీలకంగా ఉండటం ఆ శాఖ పనితీరుకు దర్పణం పడుతోంది. తన దృష్టికి విషయం రావడంతో డీసీఏవో రాజశేఖర్‌పై మంత్రి స్వామి తీవ్రస్థాయిలో ఆగ్రహించడమే కాక మొత్తం వ్యవహారంపై విచారణ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో అటెండర్ నవాజ్ కలెక్టర్‌ను కలిసి డీసీఏవోపై ఫిర్యాదు చేశారు. తనను సస్పెండ్ చేసేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రస్తుతం ఆశాఖలో విస్తృత చర్చకు దారితీసింది.

మోసం రాజా



డీసీఏవో కార్యాలయం నుంచి పొన్నలూరు సొసైటీ సీఈవోపై బోగస్ పిటిషన్లు

- అటెండర్ ద్వారా రిజిస్టర్ పోస్టు
- గుర్తించి పోలీసులకు సీఈవో ఫిర్యాదు
- మంత్రి స్వామి దృష్టికి వ్యవహారం
- డీసీఏవోపై ఆయన ఆగ్రహం
- విచారణ చేయాలని కలెక్టర్‌కు ఆదేశం
- అధికారుల సూచన మేరకే పోస్టు చేశానంటున్న అటెండర్
- తనను బెదిరించి సస్పెండ్ చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు

ఒంగోలు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సహకారశాఖలో అడ్డగోలు వ్యవహారాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఉన్నతాధికారులు తమది స్వయం ప్రతిపత్తి గల శాఖ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. తాము చెప్పినట్లు నడుచుకోని ఉద్యోగులను వేధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సహకార రంగంలో ప్రాథమిక స్థాయిలో ఉండే పీఏసీఎస్‌లలో వార్షిక ఆడిట్ అధికారం డీసీఏవోది. అలా పొన్నలూరు సొసైటీని ఆడిట్ చేయించిన డీసీఏవో పోలిశెట్టి రాజశేఖర్ అందులో భారీగా అవకతవకలు జరిగినట్లు తేలిందని, విచారణకు రావాలని గత ఫిబ్రవరిలో అక్కడి సీఈవో మనోజ్‌కుమార్‌కు నోటీసు ఇచ్చారు. అయితే తనపై ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి ఆరోపణలు చేయడంతోపాటు భారీగా అక్రమాలు జరిగాయంటూ సహకార ఆడిట్ అధికారులు నివేదిక రూపొందించి ఇబ్బందులు పెడుతున్నారని

మిగతా 6వ పేజీలో

ఒంగోలుకు మరో బైపాస్

పశ్చిమం వైపు ఏర్పాటుపై దృష్టి » ఎంపీ మాగుంట



పశ్చిమ బైపాస్‌రోడ్డు నిర్మాణంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను చూస్తున్నఎంపీ మాగుంట, కలెక్టర్ అన్సారియా తదితరులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా పశ్చిమం వైపు బైపాస్ రోడ్డు నిర్మాణంపై దృష్టిపెట్టినట్లు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి వెల్లడించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలను తగ్గించడంతోపాటు గ్రానైట్ రవాణా చేసే వాహనాలను వెలుపల నుంచి మళ్లించేలా త్రోవగుంట నుంచి పెళ్లూరు వరకు పశ్చిమ వైపున బైపాస్ రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలతోపాటు భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకొని ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అందుకోసమే ప్రాథమికంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాదే పనులు ప్రారంభించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సంబంధిత శాసనసభ్యులతో సంప్రదించి తుది నిర్ణయం తీసుకుంటామని మాగుంట తెలిపారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ మాట్లాడుతూ ఎస్ఎన్‌పాడులో ట్రాఫిక్ రద్దీని, గ్రానైట్ రవాణా చేసే పెద్ద వాహనాల రాకపోకలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను రూపొందించేటప్పుడు ఆయా అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా.. నిర్మాణ వ్యయం, సామాజిక, పర్యావరణ, ఇంజనీరింగ్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదనలు రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, మేయర్ గంగాడ సుజాత, అధికారులు చిరంజీవి, వెంకటనాయుడు, దేవానంద్, బాలశంకరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఒంగోలు కేశవస్వామిపేటలోని శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. చందూ డాన్స్ అకాడమీకి చెందిన బాలికలు పలు భక్తి గీతాలకు చక్కటి అభినయాన్ని ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా హాజరై తిలకించిన ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచి కళలను నేర్చుకోవడం ద్వారా సంస్కారం అలవడుతుందన్నారు. తొలుత ఆయనకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆర్.శివశంకర్, అర్చక బృందం ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ ప్రత్యేక పూజలు చేశారు.

- ఒంగోలు కల్చరల్

డెయిరీకి ఎసరు

పాలకేంద్రం భూముల్లో ప్లాట్లు

- పట్టించుకునే వారే లేకపోవడంతో బరితెగిస్తున్న రియల్టర్లు
- రూ.100 కోట్ల విలువైన స్థలాలు కైవసానికి కొందరి యత్నం
- ఆ ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్ఎన్‌పాడు తహసీల్దార్

ఒంగోలుక్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాపు కాసేవారు లేకపోవడంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. కోట్ల విలువ చేసే డెయిరీ భూములను కొల్లగొట్టేందుకు సిద్ధమయ్యారు. పాలకేంద్రానికి చెందిన భూముల్లో పాగా వేసి అవన్నీ తమవి అని ప్రైవేటు వ్యక్తులు చెబుతున్నారు. కంచె దాటుకుని వచ్చి ఆయా భూములలో ఉన్న చెట్లను తొలగించడంతోపాటు ప్లాట్లు వేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. విషయం తెలిసి అధికారులు స్పందించడంతో తాత్కాలికంగా పనులను నిలిపివేశారు. విజయ డెయిరీ పేరుతో ఉమ్మడి రాష్ట్రంలో ఓ వెలుగు వెలిగిన ఒంగోలు పాలకేంద్రం ప్రస్తుతం పట్టించుకునేవారు లేక కునారిల్లుతోంది. కోట్లాది విలువైన ఆస్తులు, భూములు ఉన్నాయి. అయితే వాటిని కాజేసేందుకు అనేకమంది పొంచి ఉన్నారు. పాలకేంద్రం కోసం అప్పట్లో 78.10 ఎకరాలు భూమిని సేకరించి డెయిరీని, ఉద్యోగుల క్వార్టర్లు నిర్మించారు. అందులోనే పాలపొడి ఫ్యాక్టరీని స్థాపించారు. జిల్లాలో

- మిగతా 6వ పేజీలో



చదును చేసి ఉన్న డెయిరీ భూమి

వైసీపీ హయాంలో మూసివేత

వైసీపీ వచ్చిన తర్వాత డెయిరీని ప్రైవేటు సంస్థ అయిన అమూల్‌కు అప్పగించారు. అక్కడ ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులను బలవంతంగా ఉద్యోగ విరమణ చేయించారు. కొద్దిరోజుల తర్వాత నడపలేక డెయిరీని మూసి వేయించారు. కర్నూల్ రోడ్డు పక్కనే ఉండటం, నగరానికి అత్యంత దగ్గర కావడంతో అక్కడ భూముల ధరలు నింగిని అంటుతున్నాయి. మొత్తం 78.10 ఎకరాల భూమి డెయిరీకి ఉంది. 2011లో సర్వే చేసి హద్దులు వేశారు. అలాగే అప్పటి కమిటీ చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేయించింది. ప్రస్తుతం పట్టించుకునే వారు లేకపోవడంతో ఇదే అదనుగా పాలకేంద్రం భూములను కబ్జా చేసేందుకు కొందరు సిద్ధమయ్యారు.

పాలకేంద్రం భూముల వివరాలు

ఒంగోలు సహకార డెయిరీ కోసం అప్పట్లో పేర్నమిట్ట సమీపంలో కర్నూల్ రోడ్డు పక్కన 78.10 ఎకరాల భూమిని సేకరించారు. రోడ్డు పక్కనే ఉన్న ఏడు ఎకరాలలో డెయిరీ కోసం భవనాలు నిర్మించారు. ఉద్యోగుల నివాసాలు, ఇతర అవసరాల కోసం 12.10 ఎకరాలు కేటాయించారు. మిగిలిన భూమిలో 20 ఎకరాలు జామాయిల్ తోట వేశారు. డెయిరీ వెనుక భాగం 19 ఎకరాలు, ముందుభాగం 20 ఎకరాలు ఇతర అవసరాల కోసం మిగులుగా ఉంది.

సీబీజీ ప్లాంటు పనులు పునఃప్రారంభం

పరిశీలించిన కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

కురిచేడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగదొనకొండ వద్ద రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌కు ప్రభుత్వం కేటాయించిన భూముల్లో పనులు పునఃప్రారంభమయ్యాయి. కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి అక్కడికి చేరుకొని పరిశీలించారు. గంగదొనకొండ గ్రామ సర్వే నంబర్‌లు 88, 90లో 799.40 ఎకరాల భూమిని రిలయన్స్ సంస్థకు రెవెన్యూ అధికారులు కేటాయించారు. దీంతో పదుల సంఖ్యలో యంత్రాలతో గత శుక్రవారం నుంచే పెద్దఎత్తున పనులు ప్రారంభించింది. శనివారం అటవీ శాఖాధికారులు వచ్చి ఆభూమి తమదంటూ పనులు నిలిపివేయించారు. రెవెన్యూ అధికారులు మాత్రం ఎఫ్ఎల్ఆర్ దాఖలాలో ఆ భూమి గయాలు అని ఉందని అటవీ శాఖకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారం ఉన్నతాధికారులకు చేరింది. వారు మాట్లాడటంతో అటవీశాఖ అధికారులు వెనక్కి తగ్గినట్లు సమాచారం. దీంతో రిలయన్స్ సంస్థ తిరిగి మంగళవారం నుంచి పనులను ప్రారంభించింది. బుధవారం కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి తహసీల్దార్ రజనీకుమారి, రెవెన్యూ సిబ్బందితో కలసి వెళ్లి భూమి అభివృద్ధి పనులను చూశారు. రికార్డులను పరిశీలించారు. ఎక్కడా ఎటువంటి సమస్యలు లేకుండా పనులు జాగ్రత్తగా జరిగేలా చూడాలని తహసీల్దార్‌కు సూచించారు.



సీబీజీ ప్లాంటు పనులు జరుగుతున్న భూముల వద్ద రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి

వల్లాయపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న వంతెన



గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు పరుగు

- మర్రిపూడి మండలంలో 75శాతం పూర్తి
- రూపురేఖలు మారనున్న పల్లె సీమలు

7

రాళ్లవాగు ఆక్రమణలపై

విచారణ

ఫిర్యాదుదారులతో కలిసి పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్, ఒడా అధికారులు

7

రాములోరు వచ్చినాడురో..

- రూ.2 కోట్లతో విఠలాపురం కాలనీలో రామాలయ నిర్మాణం
- ఆలయ ప్రహరీపై రామాయణ కథ తెలిపేలా బొమ్మల చిత్రీకరణ
- 13న ఆలయ, కలశ ప్రతిష్ఠాపన

7



విఠలాపురంలో నిర్మాణం పూర్తయిన రాములవారి ఆలయం



బాలుడు షాకీర్ మృతదేహం

మద్యం మత్తులో దారుణం

- భార్యపై భర్త కత్తితో దాడి
- అడ్డొచ్చిన కొడుక్కి పోట్లు
- చికిత్స పొందుతూ మృతిచెందిన బాలుడు
- అర్ధవీడులో దుర్ఘటన

వివరాలు మెయిన్‌లో..

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

మార్కాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పరిష్కరించదగిన కేసులను గుర్తించి మే 10వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని మార్కాపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ చెప్పారు. స్థానిక కోర్టు ఆవరణలో బుధవారం 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు పోలీసు, ఎక్సైజ్‌శాఖలకు చెందిన అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా న్యాయాధికారి ఎం.బాలాజీ మాట్లాడుతూ రాజీపడదగ్గ ప్రతి కేసును పరిష్కరించే విధంగా అధికారులు పనిచేయాలన్నారు.

ఆలయాల్లో లిడ్ క్యాప్ చైర్మన్ పూజలు



పూజల్లో పాల్గొన్న మాణిక్యాలరావు

త్రిపురాంతకం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలత్రిపుర సుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో రాష్ట్ర లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం స్వామికి మహాన్యాసపూర్వక అభిషేకం, చినమస్తాదేవికి పూజలు, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి అర్చనలు చేశారు. అనంతరం మాణిక్యాలరావుకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

నిందితుడు పరారీకి యత్నం

- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు
- నిందితుడికి గతంలో హత్య కేసుతో సంబంధం

చీరాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : దొంగతనం కేసులో పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి పరారీకి యత్నించాడు. దీంతో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పొదిలి సర్కిల్ పరిధిలోని మర్రిపూడికి చెందిన బాలకోటిరెడ్డి బుధవారం రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తి వద్ద ఫోన్ అపహరించాడు. దీంతో వెంటనే విధుల్లో ఉన్న పోలీసులు గ్రహించి అతడిని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. ఈక్రమంలో కొద్దిసేపు పోలీసులు వారి పనుల్లో నిమగ్నమైన సమయంలో పోలీసులు కళ్లు గప్పి పారిపోయేందుకు నిందితుడు స్టేషన్ నుంచి బయటకు పరుగులంకించాడు. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు అతడిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం అపహరించిన సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని కౌన్సెలింగ్ నిర్వహించి పంపేశారు. బాలకోటిరెడ్డి గతంలో అతని అక్క ఊరు ముండ్లమూరులో క్రికెట్ ఆడుతూ నెల కొన్న వివాదంలో ఒక వ్యక్తిని ఆవేశంతో బ్యాట్‌తో దాడి చేసిన కేసులో బాలకోటిరెడ్డి నిందితుడు.

లారీ ఢీకొని బిచ్చగాడు మృతి

మేదరమెట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రప్రదేశ్) : నార్కెట్‌పల్లి - మేదరమెట్ల రాష్ట్రీయ రహదారిలో వెళ్తున్న లారీ మేదరమెట్ల ఫైలాన్ ఫ్లైఓవర్ సెంటర్‌లో భిచ్చగాడిని ఢీకొంది. బుధవారం హైదరాబాద్ నుంచి చెన్నై వైపు వెళ్తున్న లారీ ఫ్లైఓవర్ వద్ద అకస్మాత్తుగా అడ్డం వచ్చి గుర్తుతెలియని భిచ్చగాడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని 108లో ఒంగోలు తరలించారు. అప్పటికే అతను చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఎస్ఐ మహ్మద్ రఫీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోసం రాజా!

(5వ పేజీ తరువాయి)

ఆరోపించారు. అందులో డీసీఏవోతోపాటు కొందరు ఉద్యోగుల పాత్ర కూడా ఉన్నట్లు ఆ ప్రాంత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తదుపరి చర్యలను తాత్కాలికంగా ఆపేయాలని అధికార పార్టీ నేతలు సదరు అధికారికి చెప్పినట్లు సమాచారం.

కార్యాలయం నుంచే పిటిషన్లు

తాము అనుకున్న విధంగా పొన్నలూరు సొసైటీపై విచారణ కొనసాగించడానికి వీలుపడకపోవడంతో డీసీఏవో కార్యాలయ ఉద్యోగులు కొందరు బోగస్ పేర్లతో ఉన్నతాధికారులకు పిటిషన్లు పెట్టారు. వాటిని తమ కార్యాలయ అటెండర్ ద్వారా రైల్వే మెయిల్ సర్వీసు నుంచి రిజిస్టర్ చేయించారు. ఆ బోగస్ పిటిషన్ల ఆధారంగా విచారణకు హాజరుకావాలని డీసీఏవో నుంచి నోటీసు అందుకున్న సీఈవో మనోజ్‌కుమార్ ఇందులో ఏదో కుట్ర ఉందని అనుమానించి కూపీ లాగారు. అది ఆ శాఖ జిల్లా అధికారి ప్రమేయంతో కార్యాలయ సిబ్బంది ద్వారా జరిగిందని గుర్తించారు. అంతేకాక మార్చి 4వతేదీ సాయంత్రం ఆర్ఎంఎస్‌లో ఆ పిటిషన్లను డీసీఏవో కార్యాలయ అటెండర్ పోస్టు చేస్తున్న సీసీ ఫుటేజీలను గుర్తించిన సీఈవో మనోజ్ దానిపై పోలీసులకు ఫిర్యాదుచేయడంతోపాటు మంత్రి స్వామి దృష్టికి తీసుకెళ్లారు. అప్పటికే డీసీవో, డీసీఏవో కార్యాలయాలు, ఆ శాఖల జిల్లా అధికారులపై తీవ్రఆరోపణలు నిత్యం వస్తుండటంతో డీసీఏవో రాజశేఖర్‌ను మంత్రి పిలిపించుకున్నారు. ఏమి జరిగిందన్న విషయం విచారించి ఆయనపై తీవ్రస్థాయిలో మండిపడినట్లు సమాచారం. ఆ సమయంలో డీసీఏవోతోపాటు కార్యాలయ అటెండర్ నవాజ్ కూడా ఉండగా బోగస్ పిటిషన్‌గా నిర్ధారించుకున్న మంత్రి ఆ వ్యవహారంపై విచారణ చేయాలని కలెక్టర్ అన్సారియాను ఆదేశించారు. అనంతరం సీఈవో మనోజ్‌కుమార్ కూడా కలెక్టర్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు.

బెడిసిన దిద్దుబాటు చర్య

మొత్తం వ్యవహారం బహిర్గతంకావడంతో డీసీఏవో కార్యాలయం నుంచి దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈ క్రమంలో కార్యాలయ ఉద్యోగులు, మరికొందరు కలిసి పొన్నలూరు సీఈవోపై బోగస్ పిటిషన్లను తన ద్వారా రిజిస్టర్ పోస్టు చేయించి ఇప్పుడు మొత్తం నేరం తనపైనే మోపి సస్పెండ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అదేమని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని అటెండర్ నవాజ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మరోసారి సహకారశాఖలో జరుగుతున్న ఘోరం వెలుగులోకి వచ్చింది. అటెండర్ నవాజ్ చేసిన ఫిర్యాదు మేరకు.. డీసీఏవో కార్యాలయ ఉద్యోగి ఉదయ్‌నాగభూషణం మార్చి 4వతేదీ సాయంత్రం ఐదు కవర్లు, డబ్బులు ఇచ్చి ఆర్ఎంఎస్‌లో రిజిస్టర్ పోస్టు చేయాలని చెప్పగా తాను వెళ్లి అలా చేశానని పేర్కొన్నారు. ఆ సమయంలో రెండు, మూడు సార్లు ఆయన ఫోన్ చేసి పనిపూర్తి అయిందా లేదా అని కూడా అడిగారని తెలిపారు. పని అయ్యాక స్లిప్‌లను నాగభూషణం వాట్సాప్‌కు పంపి తాను వెళ్లిపోయానని చెప్పారు. ఆ కవర్లలో ఉన్నవి ఏమిటన్నది తనకు తెలియదన్నారు. ఈ విషయంపై పొన్నలూరు సీఈవో పోలీసులకు ఫిర్యాదు చేశాక తన ద్వారా బోగస్ పిటిషన్లు పోస్టుచేయించిన విషయం గుర్తించానన్నారు. విషయం వెలుగులోకి వచ్చాక తన ఫోన్‌ను నాగభూషణం తీసుకొన్నారని ఆరోపించారు. వాట్సాప్‌లో ఉన్నవి డెలిట్ చేయడమే కాక సదరు కవర్లు డీసీఏవో ఇవ్వమంటే నేను ఇచ్చాను తప్ప నా ప్రమేయం లేదని, విచారణలో తన పేరు చెప్పవద్దని కోరినట్లు అటెండర్ పేర్కొన్నారు.

బెదిరించి స్టేట్‌మెంట్

మరోవైపు తన పైఅధికారి ఈ విషయంపై తానే విచారణాధికారినని... కలెక్టరేట్ వద్ద డేవిడ్ అనే వ్యక్తి కవర్లు ఇస్తే రిజిస్టర్ పోస్టు చేశానని తన చేత బెదిరించి స్టేట్‌మెంట్ తీసుకొని తనను సస్పెండ్ చేసేందుకు చూస్తున్నారని ఆరోపించారు. డేవిడ్ అనే వ్యక్తి తనకు తెలియదు, నాగభూషణం అనే కార్యాలయ ఇనస్పెక్టర్ చెప్తేనే అందులో ఏమి ఉందనేది పట్టించుకోకుండా పోస్టు చేశానని పేర్కొన్నారు. ఉదయ్ నాగభూషణం, డీసీఏవో రాజశేఖర్‌లు అత్యంత సన్నిహితులని పేర్కొన్న నవాజ్ ఈ వ్యవహారంపై తన పైఅధికారి అయిన డీసీఏవో తప్పుడు స్టేట్‌మెంట్‌ను బెదిరించి తీసుకొని సస్పెండ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఈ విషయంపై సమగ్ర విచారణ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు అందిన ఫిర్యాదును పరిశీలించాలని జేసీ గోపాలకృష్ణను పురమాయించినట్లు సమాచారం. కాగా మొత్తం వ్యవహారాన్ని సహకారశాఖ కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లే ప్రయత్నంలో బాధితుడు నవాజ్ ఉన్నట్లు తెలిసింది.

రామతీర్థం నిధికి తరలిన తడిక ప్రభలు



రామతీర్థం నిధిలో ఏర్పాటు చేస్తున్న కంభంపాడు టీడీపీ ప్రభ

చీమకుర్తి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రామతీర్థం తిరునాళ్లను పురస్కరించుకొని ముందస్తు సందడి మొదలైంది. గత పదిరోజులుగా నిర్మించిన ప్రభల తడికెలను భారీ ఊరేగింపుగా బుధవారం చీమకుర్తి, కంభంపాడుల నుంచి రామతీర్థం గంగమ్మ సన్నిధికి తరలించారు. చీమకుర్తి నుంచి వైసీపీ ప్రభ, కంభంపాడు నుంచి టీడీపీ ప్రభల తడికెలను నిధిలో నిలబెట్టారు. గురువారం చీమకుర్తి నుంచి టీడీపీ ప్రభ, శుక్రవారం జనసేన ప్రభలను ఊరేగింపుగా నిధికి తరలించనున్నారు. కాగా చీమకుర్తి నుంచి వైసీపీ ప్రభ తడికెను భారీగా హాజరైన శ్రేణుల మధ్య ఊరేగింపుగా ఉత్సాహభరితమైన వాతావరణంలో తరలించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు ఎండ్లబండిపై, గుర్రం ఎక్కి శ్రేణులను ఉత్సాహపరిచారు. తొలుత వారు కొబ్బరికాయలను కొట్టి ప్రభను సంప్రదాయబద్ధంగా నిధికి తరలింపునకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మన్నం శ్రీధర్,పమిడి వెంకటేశ్వర్లు, క్రిస్టిపాటి శేఖరరెడ్డి, కౌన్సిలర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అదేవిధంగా కంభంపాడు నుంచి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్మించిన ప్రభ తడికెను ఊరేగింపు మధ్య రామతీర్థం నిధికి తరలించి క్రేన్ల సహాయంతో నిలబెట్టారు. టీడీపీ నాయకులు పమిడి రవితేజ, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కాగా తిరునాళ్ల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ సుబ్బారావు, ఎస్ఐ కృష్ణయ్య పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. డ్రోన్ల సహాయంతో గట్టి నిఘా నిర్వహించారు.

● డ్రోన్లతో పోలీసుల పటిష్ట నిఘా



పట్టణంలో ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

డెయిరీకి ఎసరు

(5వ పేజీ తరువాయి)

విజయ డెయిరీ పేరుతో సుమారు 50వేల మంది పాడిరైతులు సభ్యులుగా అర్థశతాబ్దానికిపైగా విల్లిసిల్లింది. గత వైసీపీ హయాంలో మూతపడింది.

కంచే దాటి కబ్జాకు యత్నం

నాలుగు రోజుల క్రితం కొందరు వ్యక్తులు డెయిరీ కంచెను దాటి లోపలికి ప్రవేశించారు. సంస్థకు చెందిన భూముల్లోని చెట్లను తొలగించారు. ట్రాక్టర్లతో రాత్రుళ్లు చదునుచేసే పనులను ప్రారంభించారు. సర్వే నంబరు 140/1లో పాలకేంద్రం కోసం 5.27 ఎకరాలు భూమిని సేకరించినట్లు రికార్డులు ఉన్నాయి. అందులో 2.37 ఎకరాల్లో గతంలో ప్లాట్లు వేశారని, 48 ప్లాట్లు వేయగా తాము కొనుగోలు చేసినట్లు సదరు వ్యక్తులు చెబుతున్నట్లు తెలిసింది. వారు తమ పేర్లు బయట పడకుండా ఆ భూమలు తమవే అంటూ వ్యవహారం నడుపుతున్నారు. వారే భూమిని చదును చేసినట్లు అధికారులు గుర్తించారు. మరో సర్వే నంబరులో కూడా సుమారు 5 ఎకరాలు చదును చేయడానికి చెట్లు పీకించారు. ఇలా పాలకేంద్రం భూములు కబ్జా చేసేందుకు దర్జాగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కబ్జాదారులు కైవసం చేసుకోవాలనుకునే భూముల విలువ సుమారు రూ.100 కోట్ల వరకు ఉంటుదని అంచనా. అయితే విషయం తెలిసి మంగళవారం సంతనూతలపాడు తహసీల్దార్ ఆదిలక్ష్మి రెవెన్యూ సిబ్బందితో కలిసి వెళ్లి భూములను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను నిలిపివేయించారు. ఆ భూములకు సంబంధించి హక్కుపత్రాలు ఉంటే తనకు వచ్చి చూపాలని ఆదేశించారు. అయితే ఇంతవరకు ఎవరు తహసీల్దార్ ముందుకు రాకపోవడం గమనార్హం.

భూమిని పరిశీలించాం

డెయిరీ భూమిని కొందరు చదును చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. మంగళవారం వెళ్లి పరిశీలించా. వారు సర్వే నంబరు 140/1లో హక్కులు ఉన్నాయని చెప్పారు. ఇంతవరకూ హక్కు పత్రాలు తీసుకు రాలేదు. భూమిని చదును చేస్తున్న విషయాన్ని డెయిరీ సీఈవో జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం అక్కడ చదును చేసే పనులను నిలిపివేయించాం. ఎవరైనా హక్కులు ఉంటే మాకు చూపాలి, లేకుండా భూమిలోకి ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటాం.

- ఆదిలక్ష్మి, సంతనూతలపాడు తహసీల్దార్

అసంపూర్తిగా ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులు

- పొడి కంకరపై ప్రయాణం చేయలేక అవస్థలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- ఇదీ పంగులూరు, తూర్పు కొప్పెరపాడు మధ్య రహదారి పరిస్థితి

పంగులూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పంగులూరు, తూర్పు కొప్పెరపాడు గ్రామాల మధ్య ఆర్ అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులు అర్థంతరంగా నిలిపి వేశారు. ఈ రెండు గ్రామాల మధ్య రోడ్డుకు ఏర్పడిన గుంతలు పూడ్చేందుకు మూడు నెలల కిందట చేపట్టిన మరమ్మతు పనులు అసంపూర్తిగా నిలిచి పోవడంతో ప్రజలు రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. బీటీ, రోడ్డుకు ఏర్పడిన గుంటలు సరి చేసేందుకు ఎక్స్‌కవేటర్‌తో పైభాగం మొత్తం లేపేసి తారు వేసేందుకు కంకర పరిచారు. ఈకంకరపై డస్ట్‌వేసి నీటితో తడిపి చదు ను చేయకుండా పనులు నిలిపేశారు. పొలం పనులకోసం నిత్యం రాకపోకలు సాగించే తూర్పు కొప్పెరపాడు, పంగులూరు గ్రామాల రైతులు, వ్యవసాయ కూలీలు మండల కేంద్రానికి పలు పనుల నిమిత్తం వెళ్లే వారి బాధలు వర్ణణాతీతం. నెలల తరబడి పనులు నిలిచి పోవడం, పొడి బారిన కంకరపై వేగంగా నడిచే వాహనాల తాకిడికి రోడ్డును కమ్మేస్తున్న దుమ్ముతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల వేగానికి చెదిరిన కంకర రాళ్లు చెదిరి పడి గాయాలపాలవుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు వాహనాలు పట్టీ కొట్టి ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు అనేకం రోజూ జరుగుతు న్నాయి. ప్రజలు తాము పడుతున్న ఇబ్బందులను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు విన్నవించగా, నిలిచిన మరమ్మతు పనులు తక్షణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించి నెలలు గడుస్తున్నా పురోగతి లేని పరిస్థితి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు సాగించలేక ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని నిలిచిన రోడ్డు మరమ్మతు పనులను తక్షణమే పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఈ ప్రాంత ప్రజలు వేడుకుంటున్నారు.



పంగులూరు, తూర్పు కొప్పెరపాడు మధ్య తారు వేయకుండా వదిలేసిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

శింగరకొండలో ధ్వజ స్తంభం తొలగింపు



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద తొలగించిన ధ్వజస్తంభాన్ని బయటకు తెస్తున్న ఎక్స్‌కవేటర్

అద్దంకి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద ధ్వజస్తంభాన్ని బుధవారం తొలగించారు. సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభం తొలగింపు పనులు ప్రారంభించారు. బుధవారం ధ్వజస్తంభాన్ని తొలగించి బయటకు మార్చారు. ధ్వజ స్తంభం 4 దశాబ్దాల కిందట ఏర్పాటు చేయగా, ఆ సమయంలో భక్తులు ధ్వజ స్తంభ ప్రతిష్ఠ సమయంలో వేసిన 5 పైసలు, 10 పైసలు తదితర చిల్లర నాణేలు బయట పడ్డాయి. ఈవో తిమ్మానాయుడు, రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారుల పర్యవేక్షణలో ధ్వజ స్తంభం తొలగింపు పనులను పూర్తి చేశారు. మే 19న జరిగే మహాకుంభాభిషేకం నాటికి కొత్త ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరిగేలా పనులు ప్రారంభించారు.

స్కూలు బస్సు డ్రైవర్‌పై దాడి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కక్షతో పాఠశాల బస్సు డ్రైవర్‌పై కొందరు యువకులు దాడికి పాల్పడిన సంఘటన బుధవారం నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి గ్రామ శివార్లలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పామూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సులో డ్రైవర్ పఠాన్ అంజాద్ రోజూ తోటలచెరువుపల్లి నుంచి విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్లి తిరిగి తీసుకువస్తుంటాడు. బుధవారం కూడా అలాగే విద్యార్థులను ఎక్కించుకుని పామూరు వైపు వెళ్తుండగా పెద్దిరెడ్డిపల్లి గ్రామ శివార్లలో కనిగిరికి చెందిన హసన్, మరో ముగ్గురు యువకులు బస్సును నిలిపి డ్రైవర్‌పై దాడి చేశారు. కాగా, అంజాద్ సోదరిని కనిగిరికి చెందిన హసన్‌కు ఇచ్చి వివాహం చేయగా అతను తరచూ భార్యను వేధింపులకు గురిచేస్తుండేవాడు. ఈ నేపథ్యంలో ఇటీవల అంజాద్‌తోపాటు మరికొంతమంది వెళ్లి అతన్ని మందలించి వచ్చారు. దీంతో కక్ష పెంచుకున్న హసన్ సుభానీ, సోను, పవన్‌కుమార్‌తో కలిసి అంజాద్‌పై దాడికి పాల్పడి గాయపరిచాడు. అంజాద్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రఘునాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



డ్రైవర్‌పై దాడికి పాల్పడుతున్న యువకులు

తూతూమంత్రంగా కౌన్సిల్ సమావేశం

- మూడు నిమిషాల్లో ముగిసిన వైనం

చీరాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై అవిశ్వాసం నేపథ్యంలో ఇటు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ వర్గం కౌన్సిలర్‌లు, అటు టీడీపీ కూటమి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య వర్గం కౌన్సిలర్‌లు కారాలు మిరియాలు నూరుకున్నారు. ఈక్రమంలో బుధవారం నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అసలు ఎవరు ఏయే అంశాలపై మాట్లాడతారో...వాటిపై ఏవిధంగా మిగిలిన వారు స్పందిస్తారోనని అందరిలోనూ ఒకింత సందిగ్ధత నెలకొంది. అయితే బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశం అందరినీ నివ్వెర పోయేలా చేసింది. సభ ప్రారంభమైన మూడు నిమిషాలకే అజెండాలో ప్రవేశపెట్టిన 41 అంశాలను ఆల్‌పాస్‌గా ప్రకటిస్తూ మమ అంటూ ముగించారు. దీంతో అందరూ అవాక్కయ్యారు. అయితే సమావేశం అనంతరం యథారాజా తథా ప్రజా అన్నట్లుగా వైసీపీ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు వారి కౌన్సిలర్‌లతో కలిసి అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్‌ను కలిసి కమిషనర్‌పై ఫిర్యాదు చేశారు. ఇది ఎటువైపు మలుపు తిరుగుతుందో వేచి చూడాల్సిందే.

13న పూర్వ విద్యార్థుల సమావేశం

బల్లికురవ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ ఉన్నత పాఠశాలలో 1980లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం ఈ నెల 13వ తేదీన జరుగుతుందని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈసందర్భంగా అప్పట్లో తమకు చదువులు చెప్పిన గురువులను ఆహ్వానించి వారిని ఘనంగా సత్కరిస్తామని వారు తెలిపారు. 1980లో బల్లికురవ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎక్కడ ఉన్నా హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.



ఏర్పాట్లపై మాట్లాడుతున్న దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ

గుంటిగంగ తిరునాళ్ల ఏర్పాట్ల పరిశీలన

తాళ్లూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గుంటిగంగ అమ్మవారిని భక్తులు సుహృద్భావ వాతావరణంలో తిలకించేలా ప్రజలు సహకరించాలని దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ తెలిపారు. గుంటిగంగలో 14వతేదీ జరగనున్న గుంటితిరునాళ్ల సందర్భంగా దేవదాయ శాఖ, గ్రామ పంచాయతీ అధికారులు చేస్తున్న ఏర్పాట్లను బుధవారం రాత్రి పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ సుదూర ప్రాంతాలనుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా,ఆలయకమిటీ సభ్యులు, గ్రామపంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. తిరునాళ్లలో ట్రాఫిక్‌కు అవరోధం కలగకుండా ఉండేందుకు పోలీస్ శాఖ విధించిన నిబంధనలు పాటించాలని తెలిపారు. తిరునాళ్ల ప్రాంగణంలో భక్తులకు అ సౌకర్యం కలుగకుండా తూర్పుగంగవరం, చీమకుర్తి వెళ్లే మార్గాల్లో తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎస్.మల్లిఖార్జునరావు, ఆలయకమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (చందన), సానె సురేష్, ఎం.ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రేపు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య ఒంగోలుకు రాక

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈనెల 11న ఒంగోలు విచ్చేయనున్నారు. శుక్రవారం మంగళగిరిలో బయలుదేరి, ఉదయం 9-30 గంటలకు ఒంగోలుకు చేరుకుంటారు. 9-30 నుంచి 10 గంటల వరకు రామనగర్‌లోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో జరిగే జ్యోతిబా పూలే జయంతి వేడుకలో పాల్గొని అనంతరం 10-30 గంటలకు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో గుండెపరీక్షల వైద్య పరికరం కాథ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తారు. అనంతరం 11-30 గంటల నుంచి 2గంటల వరకు జీజీహెచ్‌ను తనిఖీ చేసి వైద్యాధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. తిరిగి 3-15 గంటలకు దేవుడుచెరువు రోడ్‌లోని బీజేపీ కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ పార్టీ శ్రేణులతో కొద్దిసేపు మాట్లాడతారు. 4 గంటలకు ఎన్టీఆర్ కళాక్షేత్రానికి చేరుకుని వన్ నేషన్ వన్ ఎలక్షన్ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు.

డీఐఈపీసీ సమావేశానికి పారిశ్రామికవేత్తలు హాజరుకావాలి

ఒంగోలు నగరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పారిశ్రామికవేత్తలు ఈనెల 11వ తేదీన జరిగే డీఐఈపీసీ సమావేశానికి సమస్యలను విన్నవించేందుకు హాజరుకావాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పరిశ్రమలు ఏర్పాటు చేయటంలో సమస్యలు ఎదుర్కొంటున్న పారిశ్రామికవేత్తలు ఈ సమావేశానికి హాజరుకావాలని తెలిపారు. గత ఫిబ్రవరి మాసంలో జరిగిన డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారని, అందువల్ల సమావేశానికి హాజరయ్యే పారిశ్రామికవేత్తలు ముందుగా ఒంగోలులోని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

కేవీపాలెం పంచాయతీ సెక్రటరీపై దాడి



చికిత్స పొందుతున్న శ్యామ్‌కుమార్

చీమకుర్తి, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలం కూనంనేనివారిపాలెం గ్రామానికి చెందిన పంచాయతీ సెక్రటరీ ఎం.శ్యామ్‌కుమార్‌పై బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో దాడి జరగటంతో వైద్యసేవల నిమిత్తం ఒంగోలు రిమ్స్‌లో చేరారు. ఈ సంఘటన గురించి సీఐ సుబ్బారావు తెలిపిన వివరాలు మేరకు.. స్థానిక పంచాయతీ పరిధిలో నిర్వహించిన పనులపై ఆడిట్ అభ్యంతరాలు తెలిపిన పుస్తకం తనకు ఇవ్వాలని సర్పంచ్ కోరగా, తాను సమ్మతించకపోవటంతో దాడి జరిపారని సెక్రటరీ ఎం.శ్యామ్‌కుమార్ సచివాలయంలోని మహిళా పోలీసు ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు పంచాయతీ కార్యాలయానికి వెళ్లారు. ఘటన సమయంలో కార్యాలయంలో వారిద్దరే ఉండటంతో అక్కడ ఏమి జరిగిందో అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదన్నారు. ఇరువురిని పూర్తిస్థాయిలో విచారిస్తే వాస్తవాలు వెల్లడవుతాయని సీఐ తెలిపారు. ఈ సంఘటనపై తనకు రాతపూర్వకంగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ముగిసిన టెన్త్ మూల్యాంకనం

ఒంగోలు (విద్య), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూల్‌లో ఈనెల 3వ తేదీ నుంచి జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం బుధవారంతో ముగిసింది. అన్ని సబ్జెక్ట్‌లకు సంబంధించి వివిధ జిల్లాల నుంచి మొత్తం 1.72లక్షల జవాబుపత్రాలు మూల్యాంకనానికి వచ్చాయి. మొత్తం 1300మంది సిబ్బంది మూల్యాంకన విధులలో పాల్గొన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా విద్యాశాఖ అదనపు డైరెక్టర్ పరీక్షల రాష్ట్ర పరిశీలకులు ఏతఃఈ సుబ్బారెడ్డి, మూల్యాంకన కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఏర్పాట్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మూల్యాంకన కేంద్రం క్యాంప్ అధికారిగా డీఈవో కిరణ్‌కుమార్, ఉపక్యాంప్ అధికారులుగా ఏసీ కె.శివకుమార్, ఒంగోలు ఎంఈవో టి.కిషోర్‌బాబు వ్యవహరించారు. ఈ నెల మూడోవారంలో పరీక్షా ఫలితాలు వెలువడతాయని బోర్డు అధికారులు తెలిపారు.


ఉపాధ్యాయుల డిప్యుటేషన్లు రద్దు

ఒంగోలు (విద్య), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయుల డిప్యుటేషన్లను రద్దు చేస్తూ పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు బుధవారం ఉత్తర్వులు జారిచేశారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయుల డిప్యుటేషన్లు, పనిసర్దుబాటు కింద చేసిన తాత్కాలిక బదిలీలు అన్నింటిని రద్దు చేశారు. ఈ విధంగా ఇతర పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అందరూ ఈనెల 22సాయంత్రం ఆయా పాఠశాలల విధుల నుంచి రిలీవ్ అయి 23వ తేదీ ఉదయం తమ మాతృ పాఠశాల విధుల్లో చేరాలని ఆదేశించారు. ఈనెల 25నాటికి డిప్యుటేషన్ల రద్దు ఉత్తర్వులు అమలుపై సమగ్ర నివేదిక సమర్పించాలని పాఠశాల విద్యా ఆర్జేడీలు, డీఈవోలను కమిషనర్ ఆదేశించారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు పరుగు

- రూపురేఖలు మారనున్న పల్లె సీమలు
- మద్దిపూడి మండలంలో 75శాతం పూర్తి

బెంగళూరు-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మొత్తం 344 కిలో మీటర్ల మేర ఆరు వరుసల్లో దీన్ని నిర్మిస్తున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భారత్ మాల పరియోజన కింద కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టింది. మద్దిపూడి మండలంలో ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయి. దీంతో ఇక్కడి పల్లెల రూపురేఖలు మారిపోనున్నాయి.


శరవేగంగా జరుగుతున్న బెంగళూరు హైవే నిర్మాణ పనులు

మద్దిపూడి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్టుకు మొత్తం 13 ప్యాకేజీల్లో టెండర్లు ఖరారు అయ్యాయి. అందులో భాగంగా మద్దిపూడి మండలం గార్లపేట నుంచి పన్నూరు, గోగినేనిపాలెం వరకు 20 కిలోమీటర్ల మేర పనులు జరుగుతున్నాయి. రహదారి నిర్మాణానికి గార్లపేట, కూచిపూడి, తిప్పలదేవిపల్లె, మద్దిపూడి, కాకర్ల, పన్నూరు రెవెన్యూ గ్రామాలకు చెందిన 244.65 ఎకరాల పట్టా, 57.70 ఎకరాల ప్రభుత్వ, అసైన్మెంట్ భూములను సేకరించారు. మండలంలో జరిగే 20 కిలోమీటర్ల రహదారికి రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు.

రవాణా సులభతరం

అనంతపురం జిల్లా కొడికొండ వద్ద ప్రస్తుతం ఉన్న బెంగళూరు జాతీయ రహదారికి, బాపట్ల జిల్లా పంగులూరు మండలం ముప్పవరం వద్ద ఉన్న కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారికి అనుసంధానంగా గ్రీన్‌ఫీల్డ్ హైవేను నిర్మిస్తున్నారు. ఇది పూర్తయితే రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి బెంగళూరుకు దూరం తగ్గి తక్కువ సమయంలో చేరుకునే అవకాశం ఉంటుంది. బెంగళూరులో స్థిరపడిన మన రాష్ట్ర ప్రజలకు, వివిధ ఉద్యోగాల కోసం వెళ్లిన యువతకు రవాణా సులభతరమవుతుంది. మద్దిపూడి మండలంలోని ప్రధాన రహదారులు మరింత అభివృద్ధి చెందడంతోపాటు పలు గ్రామాల రూపురేఖలు మారనున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యాపార లావాదేవీలు పెరగడంతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగవనున్నాయి. మొత్తంమీద గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంతో మద్దిపూడి మండలం నూతన శోభను సంతరించుకొంటోంది.

ఏం పనులు జరుగుతున్నాయంటే..

- 15 కి.మీపైగా 30 మీటర్ల వెడల్పుతో ఆరులైన్‌ల రహదారికి తారు వేయడం పూర్తి చేశారు.
- మధ్యలో 4 మీటర్ల డివైడర్‌ను ఏర్పాటు చేయనున్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే కావడంతో ఇతర వాహనాలు, పశువులు చొరబడకుండా రహదారికి ఇరువైపులా పటిష్టమైన రక్షణ గోడలు ఏర్పాటు చేయనున్నారు.
- ప్రధాన రహదారుల వద్ద ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు. పొలాలకు వెళ్లే బాటల వద్ద అండర్ పాస్‌లు ఏర్పాటు చేస్తున్నారు.
- ఇప్పటికే పన్నూరు, తలమల్ల రహదారిపై అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు తుది దశకు చేరాయి.
- మద్దిపూడి, వల్లాయపాలెం రహదారిలో ఏర్పాటు చేయనున్న హైలెవల్ వంతెన నిర్మాణానికి హైటెన్షన్ విద్యుత్ తీగలు అవరోధంగా మారాయి. దీంతో టవర్లను పక్కకు మార్చాల్సిన అవసరం ఉంది.
- మద్దిపూడి సమీపంలో కిలోమీటర్ మేర రహదారి నిర్మాణ పనుల్లో హైటెన్షన్ వైర్లు ఉండటం వల్ల జాప్యం జరుగుతోంది.

సర్వీసు రోడ్ల నిర్మాణం ఇలా...

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా అద్దంకి, గోగినేనిపాలెం, కనిగిరి వద్ద సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేయనున్నారు. అయితే కొండపి నియోజకవర్గంలో అతి ప్రధానమైన టంగుటూరు, పొదిలి ఆర్‌అండ్‌బీ రహదారిని అనుసంధానిస్తు మద్దిపూడి వద్ద సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇటీవల మద్దిపూడిలో జరిగిన ప్రత్యేక గ్రామసభలో మండల ప్రజలు రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియాకు సర్వీస్ రోడ్డు ఏర్పాటు విషయమై వినతి పత్రాలను సమర్పించారు. రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య దృష్టికి కూడా ఇదే విషయాన్ని తీసుకెళ్లారు. సర్వీస్ రోడ్డు నిర్మాణంతో కొండపి నియోజకవర్గ ప్రజలు బెంగళూరు వెళ్లేందుకు రహదారి సౌకర్యం ఏర్పడుతుంది. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

చల్లని మనసు.. చక్కని సేవ

- కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా రాగిజావ, రస్నా, మజ్జిగ పంపిణీ
- పదేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మహిళ



చీరాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పేరాలకు చెందిన వెంకట అశ్విని వెటర్నరీ ఉద్యోగి. సేవా కార్యక్రమాలు చేయడనం ఆమె అభిరుచి. కృతి ఫౌండేషన్‌ను స్థాపించి సాధారణ రోజుల్లో అన్నదానాలు, వస్త్రాల పంపిణీ చేస్తూ ఆమె దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. పదేళ్లుగా ఫౌండేషన్ ద్వారా వేసవిలో చలివేంద్రాలను నిర్వహిస్తున్నారు. వీటిలో చల్లని రాగి జావ, చిక్కని మజ్జిగ, రస్నా, తాగునీరు వంటివి రోజూ అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. రాగి జావ రోజుకు 200 మందికి, రస్నా 500 మందికి, మజ్జిగ, చల్లని తాగునీరు మరో 300 మందికిపైగా పంపిణీ చేస్తున్నారు. జీవన మనుగడలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ, మరోపక్క సేవా కార్యక్రమాలను ఆమె ఔదార్యాన్ని అందరూ కొనియాడుతున్నారు. ప్రస్తుతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీరాల గడియార స్తంభం కూడలి, కొత్తపేట, ఈపూరుపాలెం, జాండ్రపేట, బాపట్ల ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.


సిద్ధమైన రాగిజావ, రస్నా కుండలు

సేవతోనే సంతృప్తి



'మొదటి నుంచీ సేవా కార్యక్రమాలపై ఆసక్తి అధికం. అందుకోసం కృతి ఫౌండేషన్‌ను స్థాపించి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నాను. సేవా కార్యక్రమాల్లో డాక్టరేట్ అందుకున్నాను. కొంత మంది వలంటీర్లుగా ముందుకు వచ్చి నాతో పాటు అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం పది మందితో సేవలందిస్తున్నాను. చలివేంద్రాల ద్వారా నిత్యం సుమారు వెయ్యి మందికి దాహార్తి తీరుస్తున్నాం. దాతల నుంచి నగదు తీసుకోవడం లేదు'

\- ఆకురాతి వెంకట అశ్విని, ఫౌండేషన్ చైర్మన్ పేరాల

అద్దంకిలో మున్సిపల్ చలివేంద్రాలు

- రోజూ 3,500 మంది దాహార్తి తీరుస్తున్న పురపాలక సంస్థ
- రెండున్నర నెలల పాటు నిర్వహణ


అద్దంకి బస్టాండ్‌లోని చలివేంద్రం వద్ద నీటిని తాగుతున్న ప్రయాణికులు

అద్దంకి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అద్దంకిలో కూల్‌కూల్‌గా చలివేంద్రాల్లో ప్రజల దాహార్తి తీర్చుతున్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడలి ప్రాంతాల్లో 9 చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో పలువురు టీడీపీ కౌన్సిలర్ల విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది నుంచి కూలింగ్ మినరల్ వాటర్‌ను ఏర్పాటు చేశారు. గురువారం నుంచి ప్రారంభమైన చలివేంద్రాలు 76 రోజుల పాటు (సుమారు రెండున్నర నెలలు) నిర్వహించనున్నారు.

అద్దంకిలోని మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, అన్నా క్యాంటిన్, రిజిస్ట్రార్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, భవానిసెంటర్‌లోని వినాయకస్వామి గుడి, కలవకూరు రోడ్డు, కమలేశ్వరస్వామి గుడి, నాగులపాడు రోడ్డులలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో చలివేంద్రం వద్ద సరాసరిన 10 కూలింగ్ వాటర్ బబుల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4-30 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో మనుషులను ఏర్పాటు చేసి నీటిని పోయిస్తున్నారు.

జిల్లాలో దాహార్తి లేకుండా చూడాలి

- కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వేసవి కాలంలో పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు తాగునీటికి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని దిశ కమిటీ చైర్మన్, ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో బుధవారం జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి మాగుంట అధ్యక్షత వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి పథకం, జలజీవన్ మిషన్, పీఎం సూర్యఘర్ పథకం, పీఎం గ్రామీణ సడక్ యోజన, పీఎం అవాస్ యోజన పథకాల కింద మంజూరు చేసిన గృహ నిర్మాణాలు, అమృత్-1,2 పథకాల ద్వారా తాగునీటి పథకాల అమలు నిర్వహణలో ఆయా శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో అమలు జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై మూడు నెలలకు ఒకసారి సమీక్షించనున్నట్టు తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలతో పాటు మూగజీవాలకు కూడా తాగునీరు అందించే లక్ష్యంగా నిర్మించే నీటితొట్టెల నిర్మాణాలను నిర్దేశించిన లక్ష్యం మేరకు సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న మూడు నెలల కాలంలో ఉపాధి పథకం ద్వారా కూలీలకు 1.11కోట్ల పనిదినాల ద్వారా 2.95 లక్షల కుటుంబాలకు లబ్ధిచేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంట కాలువల పూడికతీత పనులు, సాగునీటి చెరువుల్లో పూడిక తీత పనులు, కూలీలకు కనీస వేతనం రూ.290 నుంచి రూ.300 వరకు ఉండాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకం జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో జలజీవన్ మిషన్ కిందచేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎంపీ ఆదేశించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 8 నుంచి 22వ తేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వామ్యులు కావాలని కోరారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. దిశా సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

కనిగిరి శాసనసభ్యుడు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి ప్రాంతం ఫ్లోరైడ్ పీడిత ప్రాంతమని, ఈ ప్రాంత ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పశ్చిమ ప్రకాశంలో ఉపాధి పథకం ద్వారా కొత్తవాటర్ షెడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలన్నారు.



సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ మాట్లాడుతూ అమృత పథకం కింద సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలో చేపట్టే పనుల వివరాలను తెలియజేయాలని కోరారు. సమావేశంలో పలు మండలాలకు చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీలు ఆయా మండలాల్లో నెలకొన్న సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. బంగారు బాల్యం కార్యక్రమానికి జాతీయ స్థాయిలో స్కోచ్ అవార్డును అందుకున్న కలెక్టర్‌తమీమ్ అన్సారియాను ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అభినందించారు. సమావేశంలో మేయర్ గంగాడ సుజాత, డిఆర్వో చిన ఓబులేషు, సీపీవో వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో చిరంజీవి, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాలశంకరరావు పాల్గొన్నారు.




రాళ్లవాగుపై నిర్మించిన నిర్మాణాలు, వెంచర్‌ను పరిశీలిస్తున్న డీసీసీ

రాళ్లవాగు ఆక్రమణలపై విచారణ

- ఫిర్యాదుదారులతో కలిసి పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్, ఒడా అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం పంచాయతీ పరిధి పుల్లలచెరువు రోడ్డులోని రాళ్లవాగు ఆక్రమణలపై అధికారులు బుధవారం విచారణ నిర్వహించారు. సర్వే నెంబరు 28లో ఆక్రమణలను తొలగించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కలెక్టర్ ఆదేశాలతో డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామకృష్ణ, ఒడా ప్లానింగ్ అధికారి బాబురావు బుధవారం తన సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వాగు పక్కనే ఉన్న వెంచర్‌కు సంబంధించిన సర్వే రిపోర్టు తయారు చేసి ఇవ్వాలని మండల సర్వేయర్‌ను ఆదేశించారు. అలాగే రాళ్లవాగు వద్ద పార్క్ ఏర్పాటుకు అనుమతులు ఉన్నాయా అంటూ పంచాయతీ కార్యదర్శి ఈదూల రాజశేఖర రెడ్డి, రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారు ఎటువంటి అనుమతులు లేవని తెలిపారు. అందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని డిప్యూటీ కలెక్టర్ చెప్పారు. అలాగే ఫిర్యాదుదారులకు సంబంధించి ఏమైనా ఆధారాలు(రికార్డులో నమోదై) ఉన్నాయా అని ఇన్‌చార్జి తహసీల్దారు శైలేంద్రకుమార్‌ను అడిగారు. రికార్డులు పరిశీలిస్తామని ఇన్‌చార్జి తెలియజేశారు. వాటికి సంబంధించి పత్రాలు ఉన్నాయా అని ఫిర్యాదుదారులను అడగడంతో అందుకు సంబంధించిన రికార్డులు మొత్తం గత రెవెన్యూ అధికారులు మాయం చేశారని, వాటి వివరాలు గత కొన్నేళ్లుగా అడిగిన ఇవ్వడం లేదని ఫిర్యాదుదారులు డిప్యూటీ కలెక్టరుకు తెలిపారు. రాళ్లవాగుకు సంబంధించి పూర్తి సర్వే చేసి గురువారం సాయంత్రంలోపు ఇవ్వాలని సర్వేయర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఒడా జూనియర్ ప్లానింగ్ అధికారిని శారద, కార్యదర్శి శశిధర్‌రెడ్డి, ఫిర్యాదుదారులు తుమాటి సాలెమ్మ, గుర్రం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బీపీసీఎల్ పైపులైన్‌కు తొలగిన అడ్డంకులు

- రైతుల డిమాండ్లను అంగీకరించిన కంపెనీ ప్రతినిధులు

సంతనూతలపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పేర్నమిట్ట గ్రామ చెరువు సమీపంలో నుంచి వేయనున్న బీపీసీఎల్ పైపులైన్‌కు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం బీపీసీఎల్ వారితో నిర్వహించిన చర్చల్లో అడ్డంకులు తొలగాయి. కృష్ణపట్నం నుంచి హైదరాబాద్ వరకు వేస్తున్న పైపులైన్‌ను పేర్నమిట్ట గ్రామంలో చెరువు నుంచి వ్యవసాయేతర భూముల మీదుగా వేయడాన్ని వ్యతిరేకిస్తూ పేర్నమిట్ట గ్రామ రైతులు గత నవంబరులో ఎమ్మెల్యే బిఎన్.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణను కలిసి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, చెరువు నుంచి కాకుండా చెరువు పక్క నుంచి పైపులైన్ వేయాలని, వ్యవసాయేతర భూములకు నష్టం వాటిల్లకుండా చూడాలని బీపీసీఎల్ ప్రతినిధులకు సూచించారు. కానీ నాడు యథావిధిగా బీపీసీఎల్ ప్రతినిధులు పైపులైన్‌ను చెరువు, వ్యవసాయేతర భూముల ద్వారా వేయడానికి సిద్ధమవుతుండటంతో రైతులు అడ్డుకుని, ఎమ్మెల్యే విజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. తదనంతర పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ జేసీని సంప్రదించి బుధవారం పేర్నమిట్ట గ్రామ రైతులతో సమావేశం ఏర్పాటుచేశారు. పైపులైన్ వేసే భూముల సర్వేనెంబర్లను వ్యవసాయేతర భూములుగా మార్చే విధంగా ఎన్‌వోసీ ఇవ్వాలన్నారు. కంపెనీ ప్రతినిధులు సేకరించే భూవైశాల్యాన్ని 18 నుంచి 12 మీటర్లకు తగ్గించాలన్నారు. 12 మీటర్లలో 2 మీటర్లు పైపులైన్ వేసి, మిగతా 10 మీటర్లు రోడ్డు వేయాలన్నారు. పేర్నమిట్టలో విలువైన భూములు కావున వాటికి అనుగుణంగా రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. పై డిమాండ్లను బీపీసీఎల్ కంపెనీ ప్రతినిధుల ముందుంచగా వారు అంగీకరించారు. ఈ డిమాండ్ల ప్రకారం కర్నూల్ రోడ్డులో నుంచి మంగమూరు రోడ్డుకు, పేర్నమిట్ట చెరువు పడమటివైపు నుంచి కొత్తరోడ్డు వేయబడుతుంది. ఈరోడ్డు ఖర్చు అంతా బీపీసీఎల్ కంపెనీవారి సీఎస్‌ఆర్ ఫండ్స్ ద్వారా జరగాలని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కంపెనీ ప్రతినిధులకు సూచించారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు పేర్నమిట్ట రైతులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

రాములోరు వచ్చినాడురో..

- రూ.2 కోట్లతో విఠలాపురం కాలనీలో రామాలయ నిర్మాణం
- ఆలయ ప్రహరీపై రామాయణ కథ తెలిపేలా బొమ్మల చిత్రీకరణ
- 13న రామాలయ, కలశ ప్రతిష్ఠాపన..


నిర్మాణం పూర్తయిన ఆలయం

తాళ్లూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విఠలాపురంలో రూ.2కోట్లు వెచ్చించి నిర్మించిన రామాలయ ప్రతిష్ఠ ఈనెల ఈనెల 13వ తేదీన నిర్వహించనున్నారు. విఠలాపురం కాలనీ ఏర్పాటు సమయంలో నాలుగు అడుగుల ఎత్తులో గుడి నిర్మించి రాములవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ చిన్న విగ్రహం స్థానే రామాలయం నిర్మించాలని తలంచి ఐదేళ్ల క్రితం భూమి పూజ చేశారు. ప్రభుత్వ సహకారంతో సీఎస్ఎఫ్ కింద రూ.16 లక్షలు మంజూరయ్యాయి. గ్రామస్థులు, దాతల సహకారంతో కలిపి మొత్తం రూ.2కోట్లు సమకూర్చి రామాలయ నిర్మాణ పనులు చేపట్టారు.

ఆలయనిర్మాణ నిర్వాహకులు వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆలయాలను పరిశీలించి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గర్భ గుడి, శిఖరం వరకు రాతితో నిర్మించారు. ప్రహరీ చుట్టూ భక్తులకు అర్థమయ్యే రీతిలో రాములవారి జీవిత విశేషాలు తెలిసేలా బొమ్మలు చిత్రీకరించారు. ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావటంతో ఈనెల 13వ తేదీ ప్రతిష్ఠ, దేవతామూర్తుల విగ్రహ, కలశ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు.

పెరిదేపి సర్పంచ్ రాజీనామా


డీపీవోకు రాజీనామాపత్రం సమర్పిస్తున్న సర్పంచ్ గిరి

కొండపి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరిదేపి పంచాయతీ సర్పంచ్ అంగలకుర్తి గిరి తన పదవికి రాజీనామా చేశారు. అందుకు సంబంధించిన పత్రాన్ని బుధవారం డీపీవో జి.వెంకటనాయుడికి అందజేశారు. దీంతో ఇటీవల ఉపసర్పంచ్‌గా ఎన్నికైన టీడీపీకి చెందిన గంటెనపల్లి మాచర్ల సర్పంచ్ బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. గడచిన ఎన్నికల సమయంలో గ్రామంలోని టీడీపీ, వైసీపీ మద్దతుదారులు చెరో రెండున్నర సంవత్సరాలు సర్పంచ్‌గా ఉండేలా ఒప్పందం కుదిరింది. ఆమేరకు ప్రస్తుతం గిరి రాజీనామా చేశారు.

ఒడా కరపత్రాలు, పోస్టర్ ఆవిష్కరణ


కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ మాగుంట, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యేలు ఉగ్ర, బీఎన్, మేయర్ సుజాత

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఒడా) అందించే సేవలు, అనుమతులు తదితర వివరాలతో రూపొందించిన కరపత్రాలు, పోస్టర్‌ను ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, బీఎన్.విజయకుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆవిష్కరించారు. బుధవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ఒడా వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఒడా పరిధి, ఈ విభాగం అందించే సేవలు, అనుమతులు, తదితర వివరాలతో పాటు స్థిరాస్తి కొనుగోలుదారులకు అవసరమైన సూచనలు చేసేలా కరపత్రాలను రూపొందించినట్లు తెలిపారు. అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు.

పవన్ తనయుడి కోసం ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేసేందుకు విచ్చేసిన రవిశంకర్, నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, జనసేనపార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఆ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మంగమ్మకళాశాల వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో పార్టీ నేత, రవిశంకర్ గ్రూప్స్ అధినేత కంది రవిశంకర్ హాజరై ఈసందర్భంగా 101 కొబ్బరికాయలతో పూజలు చేశారు. అనతరం ఆయన మాట్లాడుతూ సింగపూర్‌లోని ఓ పాఠశాలలో జరిగిన అగ్నిప్రమాదంలో పవన్‌కళ్యాణ్ తనయుడు మార్క్ శంకర్ గాయపడటం బాధాకరమని, త్వరగా కోలుకావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు చనపతి రాంబాబు, ముత్యాల కళ్యాణ్, బొందిల శ్రీదేవి, పిల్లి రాజేష్, పల్ల ప్రమీల, దండే అనిల్, గోవింద్, కోమలి, మనోజ్ రాయల్, ఆకుపాటి ఉష, మాల్యాద్రి, సుంకర కల్యాణి, షేక్ ముంతాజ్, ఆలా నారాయణ, నరసింహారావు, ఉంగరాల సాయి, బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక లాయర్‌పేటలోని శ్రీ చైతన్య స్కూలు విద్యార్థులు ఇటీవల ప్రకటించిన నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్-25లో జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక స్కూలులో జరిగిన సభలో విద్యార్థులు హాస్యశ్రీ, శివాని, అక్షర, సిద్ధార్థరుషి, నిరంజన్, మోక్షలక్ష్మి, హర్షినిపూర్ణ, సాజిత, పుష్కర బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ జోసెఫ్ తంబి తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ అనిల్‌కుమార్, కో ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, డీన్ బాలసుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపాల్ శివపార్వతి, నాసా ఇన్‌చార్జి మధుస్మిత తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫ్యాప్టో అభినందన


కలెక్టర్ అన్సారియాకు బొకేను అందజేస్తున్న సంఘ నాయకులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బంగారు బాల్యం కార్యక్రమం ద్వారా ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డును అందుకున్న కలెక్టర్ తమీమ్ అన్సారియాను స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం కలిసి బొకే అందజేసి అభినందించారు. బొకే అందజేసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ కె.ఎర్రయ్య, ప్రతినిధులు ఎస్ఎండీ.రఫీ, మాధవరావు, జయరావు, అబ్దుల్‌హై, జనార్దన్‌రెడ్డి, డి.శ్రీనివాసులు, బి.వెంకట్రావు, కె.శ్రీనివాసరావు, డి.వీరాంజనేయులు, పర్రె వెంకట్రావు, చల్లా శ్రీనివాసులు, ఉమామహేశ్వరి, జ్యోత్స్న, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

మద్దిపాడు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు తప్పకుండా పోషకారాన్ని ఇవ్వాలని సీడీపీవో ఇవాంజెలిన్ పేర్కొన్నారు. బుధవారం రాచవారిపాలెం సచివాలయంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. డాక్టర్ ఆనంద్‌మోహన్ మాట్లాడుతూ రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరగాలంటే ఆకుకూరలు, పండ్లు, తృణధాన్యాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పురాలశెట్టి నాగమల్లేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, వార్డు మెంబర్లు, మహిళలు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

ఒంగోలు(రూరల్), ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండల పరిషత్ కార్యాలయ వద్ద ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 2గంటల నుంచి ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో కె.రాజశేఖరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు


గాయపడిన రాకేష్

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని మోటార్‌సైక్లిస్టు గాయపడిన సంఘటన మద్దిరాలపాడు వద్ద జాతీయ రహదారిపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడు గ్రామానికి చెందిన చెల్లి రాకేష్ మోటార్‌సైకిల్‌పై ఆయన బుధవారం ఒంగోలు వెళుతున్న క్రమంలో మద్దిరాలపాడు దక్షిణం వైపు జంక్షన్‌వద్దకు రాగా ఒంగోలు నుంచి చీరాల వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో రాకేష్ రోడ్డుపై పడి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఒంగోలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

తిరునాళ్లను ప్రశాంతంగా జరుపుకోవాలి

డీఎస్పీ శ్రీనివాసరావు ● 42మందిపై బైండోవర్


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

చీమకుర్తి, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): ఉద్రిక్తతలకు తావివ్వకుండా, ప్రశాంతమైన వాతావరణంలో భక్తిపూర్వకంగా రామతీర్థం తిరునాళ్ల మహోత్సవాన్ని జరుపుకోవాలని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు కోరారు. బుధవారం చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ప్రభల నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సుబ్బారావులు నిర్వాహకులకు తగు సూచనలు చేశారు. ప్రభలపై రెచ్చగొట్టే ప్రసంగాలు, చర్యలు చేయకూడదన్నారు. అశ్లీల నృత్యాలు, అసభ్య ప్రదర్శనలు, మాటలు లేకుండా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఒక్కో ప్రభకు ఏడుగురు చొప్పున 42మంది ప్రభల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. సమస్యలు తలెత్తితే, బంధనలు మీరితే వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరంతరం డ్రోన్లతో నిఘా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ కృష్ణయ్య, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మెరిట్ కం రోస్టర్ విధానం పాటించాలి

● బీటీఏ నాయకుల డిమాండ్


మూల్యాంకనం కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీటీఏ నాయకులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని బీటీఏ నాయకులు డిమాండ్ చేశారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం మూల్యాంకనం జరుగుతున్న స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలు వద్ద అసోసియేషన్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు మాట్లాడుతూ మెరిట్ కం రోస్టర్ విధానం అమలు చేయకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అన్యాయం జరుగుతుందన్నారు. సమస్య పరిష్కరించకపోతే దశల వారీ ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని చెప్పారు. అందులో భాగంగా గురువారం నుంచి మూడు రోజుల పాటు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు, 17న కలెక్టరేట్ ఎదుట నిరసన, 25న కమిషనరేట్ ముట్టడి కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో పి.నాగేశ్వరరావు, పల్లె తిరుపతిస్వామి, నూకతోటి కుమార్‌స్వామి, జి.భాస్కరరావు, చెక్క కోటేశ్వరరావు, హనుమంతరావు, లకంతోటి డేవిడ్‌రాజు, ఆర్.మనోహర్‌రావు, పోలిపాగు వెంకట్రావు, బొంత కళ్యాణ్, ఎం.పాపారావు పాల్గొన్నారు.

డీఈవోకు ఫ్యాప్టో వినతి

ఒంగోలు విద్య: త్వరలో జరగనున్న ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల జాబితాలో మెరిట్ కం రోస్టర్ విధానంలో సీనియారిటీ జాబితా తయారు చేయాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. బుధవారం ఒంగోలులోని డీఆర్ఆర్ఎం స్కూలులో ఫ్యాప్టో నాయకులు డీఈవో కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జరిగిన ఉద్యోగోన్నతుల ప్రకారం సీనియారిటి జాబితాను తయారు చేయడం జీవో నెంబరు 64కు విరుద్ధమన్నారు. అందువల్ల మెరిట్‌కం రోస్టర్ విధానం పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ ఎర్రయ్య, సెక్రటరీ జనరల్ ఎస్ఎండీ.రఫీ, కో చైర్మన్లు మాధవరావు, డి.జయరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎస్‌కే.అబ్దుల్‌హై, వి.జనార్దన్‌రెడ్డి, బి.వెంకట్రావు, సెక్రటరీ వై.వెంకట్రావు, కార్యవర్గసభ్యులు డి.శ్రీనివాసులు, వీరాంజనేయులు, కె.శ్రీనివాసులు, చల్లా శ్రీనివాసులు, ఎస్.రవి, పర్రె వెంకట్రావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

● డీఈవో కిరణ్‌కుమార్ పిలుపు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా పనిచేయాలని డీఈవో కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను బుధవారం ఒంగోలులో డీఈవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ప్రజల వద్దకు వెళ్ళి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించాలన్నారు. తద్వారా స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కె.శ్రీనివాసరావు, షేక్ అబ్దుల్ హై, వీరాంజనేయులు, ఉమామహేశ్వరి, చిన్నస్వామి, పి.బాల వెంకటేశ్వర్లు, నల్లూరి వెంకటేశ్వరరావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి, సంధ్యారాణి, తాతా వెంకటేశ్వర్లు, ఎస్‌కే.జిలాని, సీహెచ్.ఉమామహేశ్వరరావు, లక్ష్మీనారాయణ, హనుమంతరావు, నారాయణ, రమణమూర్తి, చంద్రశేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా తయారు చేయాలి

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను పారదర్శకంగా తయారు చేసి ఉద్యోగోన్నతులు ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు డీఈవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత జాబితాలో అనేక అవకతవకలు జరిగాయని, వాటిని పరిశీలించి సరిచేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నిందితుడు పరారీకి యత్నం

చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్న పోలీసులు

గతంలో హత్య కేసుతో సంబంధం

చీరాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి పరారీకి యత్నించాడు. దీంతో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పొదిలి సర్కిల్ పరిధిలోని మర్రిపూడికి చెందిన బాలకోటిరెడ్డి బుధవారం రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తి వద్ద ఫోన్ అపహరించాడు. దీంతో వెంటనే విధుల్లో ఉన్న పోలీసులు గ్రహించి అతడిని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. ఈక్రమంలో కొద్దిసేపు పోలీసులు వారి పనుల్లో నిమగ్నమైన సమయంలో వారి కళ్లు గప్పి పారిపోయేందుకు నిందితుడు స్టేషన్ నుంచి బయటకు పరుగు తీశాడు. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు అతడిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం అపహరించిన సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కౌన్సెలింగ్ నిర్వహించి పంపేశారు. బాలకోటిరెడ్డి గతంలో అతని అక్క ఊరు ముండ్లమూరులో క్రికెట్ ఆడుతూ నెలకొన్న వివాదంలో ఒక వ్యక్తిని ఆవేశంతో బ్యాట్‌తో దాడి చేసిన కేసులో బాలకోటిరెడ్డి నిందితుడు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

అద్దంకిటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష ఈ నెల 13న జరుగుతుందని అద్దంకి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గాయత్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ విద్యార్థులకు పరీక్ష జరుగుతుందన్నారు. హాల్ టిక్కెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, పరీక్ష కేంద్రాలకి హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైన గుర్తింపు కార్డు, ఆధార్ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఘనంగా శ్రీప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

సంతనూతలపాడు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మళంపాడు గ్రామ పరిధిలోని నిధి వద్దనున్న శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయ 60వ వార్షికోత్సవ తిరునాళ్ల బుధవారం ఘనంగా జరిగింది. అర్చకులు అన్నావజ్జుల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చుట్టుపక్కల మండలాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి పొంగళ్లు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త బొడ్డపాటి రమణారావు వేడుకలను పర్యవేక్షించారు. తిరునాళ్ల సందర్భంగా వైసీపీ, టీడీపీ ఆధ్వర్యంలో చెరొక విద్యుత్ ప్రభను ఏర్పాటుచేశారు. ఎస్ఐ వి.అజయ్‌బాబు ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలతో బందోబస్తును ఏర్పాటుచేశారు. ఎటువంటి ట్రాఫిక్ తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

108 సూర్య నమస్కారాల్లో ఉప్పుగుండూరువాసులు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రికార్డు కోసం నిర్వహించిన సూర్యనమస్కారాల కార్యక్రమంలో ఉప్పుగుండూరువాసులు పాల్గొని తమ ప్రదర్శనివ్వడం పట్ల వారిని బుధవారం పలువురు అభినందించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన యోగా గురువులు,సాధకులతో నిర్వహించిన 108 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాల ప్రదర్శనలో ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన వివేకానంద యోగ శిక్షణా కేంద్రం వ్యవస్థాపకులు కామిశెట్టి శంకరరావు, యోగా సాధకుడు కామిశెట్టి మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ముండ్లమూరు ఎస్ఐ

ఒంగోలు క్రైం, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు ఎస్ఐ కమలాకర్ బుధవారం ఒంగోలులో ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ముండ్లమూరు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆయన ఎస్పీని కలిసి బొకే అందజేశారు.

పెట్రోల్ ధరలను తగ్గించాలి

చీమకుర్తి, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి) : పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం చీమకుర్తి బస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఒకవైపు క్రూడాయిల్ ధరలు తగ్గుతుంటే పెట్రోల్ ధరలు తగ్గించాల్సింది పోయి పెంచటం దారుణం అని నాయకులు పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకట్రావు విమర్శించారు. కేంద్రం స్పందించి ధరలను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో పల్లాపల్లి ఆంజనేయులు, బెజవాడ శ్రీను, తొట్టెంపూడి రామారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై రఘునాయకస్వామి విహారం

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చదలవాడలోని ప్రసిద్ధ శ్రీరఘునాయకస్వామి వారి కళ్యాణ మహోత్సవాలలో భాగంగా మూడవ రోజు బుధవారం ఉదయం స్వామి వార్లకు విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారికి బలిహరణ, తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. పెదచంద్రపాడుకు చెందిన నల్లూరి శ్రీరామమూర్తి ఉభయదాతలుగా వ్యవహరించారు. రాత్రి స్వామివార్లను ప్రత్యేక అలంకరించిన హంసవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఒంగోలు అచలానంద ఆశ్రమం ఆధ్వర్యంలో ప్రదర్శించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకొంది. చదలవాడ వారిచే సత్యహరిచంద్ర నాటకం ప్రదర్శించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈవో అనిల్ పర్యవేక్షించారు.

ఎమ్మెల్యేకు సమస్యల వినతి

సంతనూతలపాడు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ బుధవారం ఒంగోలులోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు అర్జీల రూపంలో అందజేశారు. అనంతరం పలు సమస్యలపై అధికారులతో మాట్లాడి త్వరలో పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే ప్రజలకు పలు హామీలు ఇచ్చారు. కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

19న శ్రీగిరిలో వసంతోత్సవం

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల19వ తేదీన వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరి ఝాన్సీరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 6 గంటలకు శ్రీవారికి సహస్ర నామార్చన, 8.30 నుంచి విశేష స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు వసంతోత్సవం, అనంతరం 7.30 గంటలకు ఊంజల్ సేవలో బొల్లాపల్లి వెంకట ఫణిదీప్తి బృందంచే గాత్ర కచేరి ఉంటాయని పేర్కొన్నారు. వసంతోత్సవం కార్యక్రమంలో పాల్గొనదలిచే భక్తులు తమ పేర్లను దేవస్థానం కార్యాలయంలో నమోదు చేసుకోవాలని, వివరాలకు 9246465282 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సాయికుమార్‌కు తెలుగు భాషోత్సవ ఆహ్వానం

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఒంగోలుకు చెందిన ఎర్రన పరిషత్ అధ్యక్షుడు, కవి మైనంపాటి సాయికుమార్‌కు హైదరాబాద్‌లో నిర్వహించే తెలుగు భాషోత్సవంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. మే 8వ తేదీన చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహించే భాషోత్సవంలో పాల్గొని కవితలు వినిపించేందుకు సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పి.బడేసాబ్, సమన్వయకర్త డాక్టర్ వి.జయప్రకాష్‌లు తనకు ఆహ్వానం పంపినట్లు సాయికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను నగరానికి చెందిన సాహితీవేత్తలు అభినందించారు.

డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఒంగోలులో సింహపురి స్టడీ సర్కిల్‌లో ఎస్సీఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ కోచింగ్‌ను 50శాతం రాయితీతో అందిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కేవలం సెకండరీ గ్రేడ్ పోస్టులకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకే మాత్రమేనని పేర్కొన్నారు. ఈ రాయితీ ఈనెల 12వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. వివరాలకు 9059464367 సెల్‌నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

పేస్‌లో ప్రత్యేక ఉపన్యాసం

ఒంగోలు విద్య, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ అండ్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థిని, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సుష్మా పోతురాజు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ ప్రాధాన్యత, రకాలు, బగ్ ట్రాకింగ్ టూల్స్ వినియోగం, ప్రాజెక్టు నిర్వహణలో అవసరమయ్యే నైపుణ్యాలను ఆమె వివరించారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కాగా కళాశాల సెక్రటరీ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఈ తరహా గెస్ట్ లెక్చర్లు విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహనను పెంచి వారి భవిష్యత్ కెరీర్‌కు మద్దతుగా నిలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డైరెక్టర్ మద్దిశెట్టి కళ్యాణ్, ఏఐడీఎస్ విభాగాధిపతి కె.సుధీర్‌చక్రవర్తి, ఎస్‌కే.హినాకౌసర్, కో కన్వీనర్ శ్రావణి, కోఆర్డినేటర్లు పవిత్ర, శ్రీదేవి పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ వాయిదా

సంతనూతలపాడు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరగాల్సిన సోషల్‌ఆడిట్ కార్యక్రమం వాయిదా పడినట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. త్వరలో సోషల్ ఆడిట్ తేదీని నిర్ణయించి తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

సమస్యలపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు

కొత్తపట్నం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు తగిన చొరవ చూపాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. కొత్తపట్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అల్లూరు ఎంపీటీసీ శాంతారావు మాట్లాడుతూ గ్రామంలో శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి వెంటనే స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి కూలీలకు ఈ-శ్రమ్ కార్డులు అందించే ప్రక్రియ నత్తనడకన సాగుతుందన్నారు. మండలంలో వందల సంఖ్యలో ఆక్వా రైతులు ఉన్నారని, వీరికి సబ్సిడీపై విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల నుంచి ధాన్యం ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. రాజుపాలెంలో నిర్మాణంలో ఉన్న రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌కు ఎలాంటి అనుమతులు లేవని, అయినా నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఎంపీటీసీ కోటేశ్వరావు అన్నారు. ఎంపీపీ అంజిరెడ్డి మాట్లాడుతూ అధికారులు తగిన సమాచారం ఎప్పటికప్పుడు తెలియజేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీకృష్ణ, తహసీల్దార్ మధుసూదనరావు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

మద్దిపాడు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రైతుల భూములను రీ సర్వే పారదర్శకంగా చేసి సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ సృజనకుమార్ ఆదేశించారు. బుధవారం అన్నంగి, మల్లవరం గ్రామాల్లో జరుగుతున్న రీసర్వేను ఆయన పరిశీలించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న భూ సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కరించాలని, కొలతల్లో ఎలాంటి తారతమ్యం లేకుండా వేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం చేసే మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం చేసే మంచిని కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చెప్పారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగకపోగా అరాచకాలు మాత్రం పెరిగాయని చెప్పారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందని గుర్తు చేశారు. గత వైసీపీ పాలనలో అనారోగ్యంతో బాధపడే పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఒక్క రూపాయి కూడా జగన్ అందించలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడే పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. గృహాలు లేనివారికి పక్కాగృహాలు మంజూరు చేస్తున్నామని, మాట ఇచ్చిన ప్రకారం ప్రతినెలా 1వ తేదీన ఇంటికి పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు శానేషావలి, మార్తాల సుబ్బారెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతులను తిప్పుకోవద్దు

నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

ప్రజాదర్బార్‌కు 200 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు, అధికారులు

పుల్లలచెరువు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : భూసమస్యలపై రైతులను తిప్పుకోకుండా అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చెప్పారు. బుధవారం పుల్లలచెరువులో ప్రజాదర్బార్ సభకు ఆయన హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం జిల్లాలోనే వెనుకబడి ఉందన్నారు. భూముల ఆన్‌లైన్ కోసం పేద రైతులను కార్యాలయాల చుట్టూ అధికారులు తిప్పుకోకుండా పనిచేయాలని చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించాలని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా అధికారులు ప్రణాళికలు తయారు చేసి సమర్థంగా అమలు చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. మండలంలో తహసీల్దార్ లేక రైతులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మొత్తం 200 అర్జీలు రాగా అందులో 70 అర్జీలు రెవెన్యూ సమస్యలపై అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో బండారు శ్రీనివాసరావు చెప్పారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు చిరంజీవీ, ఎంపీపీ వెంకటయ్య, ఏపీఎం నూనె వెంకటయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ నాయకులు కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణరెడ్డి, గజ్వేల్లి భాస్కర్, కె కుమార్ పాల్గొన్నారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

కంభం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్ష ఏప్రిల్ 13వ తేదీ జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ చాముండేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ విద్యార్థులకు ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హాల్‌టికెట్లను నెట్‌లో పొంది, ఆధార్‌తో హాజరుకావాలని సూచించారు.

12 నుంచి ఉరుసు మహోత్సవం

గిద్దలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు మండలం ఉయ్యాలవాడ గ్రామంలోని శ్రీహజరత్ ముస్తఫావలి స్వామి 83వ ఉరుసు మహోత్సవం ఈనెల 12, 13 తేదీలలో నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేదీ గంధం పూజ, 13వ తేదీ ఉరుసు మహోత్సవం, రాత్రికి అన్నదానం, కోలాట ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

23న ఎడ్ల బండలాగుడు పోటీలు

గిద్దలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మండలం బురుజుపల్లిలోని శ్రీగంగాభవాని దేవస్థానంలో శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా ఈనెల 23వ తేదీన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు సీనియర్ విభాగంలో నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలైన ఎడ్ల యజమానులకు బహుమతులు వరుసగా రూ.1లక్ష, రూ.80వేలు, రూ.60వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల నగదు ఇవ్వనున్నట్లు వివరించారు. వివరాలకు 9963291068, 9866203948 సంప్రదించి 1000 రూపాయల ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబవరంలో 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ముండ్లపాడు, తాళ్ళపల్లె, బురుజుపల్లె గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ శేషగిరిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పల్లెనిద్రలో అర్బన్ సీఐ

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉయ్యాలవాడలోని మండల ప్రాథమిక పరిషత్ పాఠశాల ఆవరణలో అర్బన్ సీఐ కె.సురేష్ పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులు, యువకులతో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు.

టీడీపీ నేత ఆదిశేషయ్య మృతికి నివాళి

కొమరోలు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కొమరోలు టీడీపీ మాజీ మండల ప్రధానకార్యదర్శి మానుకొండు ఆదిశేషయ్య(68) అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆదిశేషయ్య పిడతల సాయికల్పనా రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి హయాంలో పార్టీ ప్రధాన కార్యదర్శిగా పార్టీని బలోపేతం చేశారు. ఆదిశేషయ్య కొమరోలు ఆంజనేయస్వామి, గణపతి దేవాలయాల ధర్మకర్తగా పనిచేశారు. ఈ విషయం తెలుసుకున్న జడ్పీటీసీ సభ్యుడు వెంకటనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవ రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కందుల రామిరెడ్డి, రథోత్సవ కమిటీ

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 9 ఆంధ్రజ్యోతి :మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి చెప్పారు. స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆలయ మధ్యరంగ మండపంలో రామిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలు ఈనెల 11 నుంచి 29వ తేదీ వరకు జరగనున్నాయన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి, ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, రథసప్తమి సేవా సంఘం అధ్యక్షులు యక్కలి కాశీ విశ్వనాథం, గౌరవ సలహాదారులు వక్కలగడ్డ మల్లికార్జునరావు, తాళ్లపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శ ఎ.శ్రీనివాసరావు, కోశాధికారి వెంకట సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనే లక్ష్యంగా 'నవోదయం 2'


నవోదయం ర్యాలీలో పాల్గొన్న ఎక్సైజ్ పోలీసులు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నాటుసారా నిర్మూలనే ధ్యేయంగతా నవోదయం 2 కార్యక్రమం ప్రారంభించిందని ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు చెప్పారు. బుధవారం నవోదయం 2లో భాగంగా మండలంలోని ఓబులాపురం తాండా, బురుజుపల్లె తాండా, వెంకటాపురం తాండా, దిగువమెట్ట గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచార రథాన్ని ప్రారంభించారు. సీఐ జయరావు మాట్లాడుతూ నాటుసారా తయారీలో ప్రాణానికి హాని కలిగించే వస్తువులను ఉపయోగిస్తున్నారని చెప్పారు. నాటుసారా తయారు చేయడం, అమ్మడం, రవాణా, ముడి పదార్థాల అమ్మకాల గురించి సమాచారాన్ని 94409025072కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది యూసఫ్‌షరీఫ్, శ్రీపతి, హరిబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించాలి


శిశువు బరువును తూకం వేస్తున్న సీడీపీవో సుశీలాదేవి

కంభం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించాలని ఎంపీడీవో వీరభద్రాచారి చెప్పారు. కంభం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొదటి 1000 రోజుల సంరక్షణపై శ్రద్ధవహించడంపై సీఎంఎఎం కార్యక్రమం ద్వారా పిల్లల్లో పౌష్టికాహార లోపం నివారించడంతోపాటు ఊబకాయాన్ని తగ్గించవచ్చన్నారు. సీడీపీవో నీలోఫర్ మాట్లాడుతూ పిల్లల సమగ్ర ఎదుగుదలకు పౌష్టికాహారం ముఖ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి పాల్గొన్నారు.

చౌకగా లభించే పోషకాహారం తీసుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 9 ఆంధ్రజ్యోతి : ప్రతి ఒక్కరూ చౌకగా లభించే పోషకాహారాలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఐసీడీఎస్ మార్కాపురం సీడీపీవో సుశీలాదేవి చెప్పారు. పోషణ్ పక్వాడా మహోత్సవాలలో భాగంగా పట్టణంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లల బరువులు తూకం వేశారు. ఈ కార్యక్రమాలలో సూపర్‌వైజర్లు రవికుమారి, బుజ్జీబాయి, కార్యకర్తలు టి.మధుమతి, సరోజిని, వి.పార్వతీ పాల్గొన్నారు.

పోషకాహారంతో వ్యాధి నిరోధక శక్తి మెరుగు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మంచి పోషకాహారం తీసుకోవడం వలన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి మెరుగవుతుందని గజ్జలకొండ పీహెచ్‌సీ వైద్యులు సాయి చరణ్ చెప్పారు. మండలంలోని రాయవరం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ లలితస లోమి, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మమ్మ, ఎంపీహెచ్‌ఎస్ విమల, అంగన్‌వాడీ సిబ్బంది సంధ్యారాణి, విజయకుమారి, నాగలక్ష్మీ, ఎలీషమ్మ పాల్గొన్నారు.

పోషణ పక్వాడ కార్యక్రమం

గిద్దలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు మున్నా, రత్న, ధనమ్మ, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా పట్టివేత

ముగ్గురు అరెస్ట్

నిందితుల వద్ద 2 కేజీల స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కొన్నాళ్లగా మార్కాపురం పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు చేస్తున్న ముఠాను మార్కాపురం పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. స్థానిక ఎస్‌డీపీవో కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని జగదీశ్వరి థియేటర్ ప్రాంతానికి చెందిన సుంకర నాగరాజు బీటెక్ మధ్యలో ఆపేశాడు. చదువుకునేటప్పుడే గంజాయికి అలవాటుపడ్డాడు. విశాఖపట్నం ప్రాంతంలోని ఏజెన్సీ ఏరియాల్లో పరిచయాలు పెంచుకుని గంజాయి కొనుగోలు చేసి మార్కాపురం పరిసరాల్లో అమ్మకాలు చేయసాగాడు. ఇతని వద్ద పట్టణంలోని విజయాటాకీస్ ప్రాంతానికి చెందిన షేక్ ఇమ్రాన్, తాడి తిరుమలయ్యలు గంజాయి కొనుక్కుని వ్యసనపరులైన యువతకు అమ్మకాలు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో పట్టణ పోలీసులు బుధవారం స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో గంజాయితో కలిగి ఉన్న గోపీనాథ్, ఇమ్రాన్, తిరుమలయ్యలను అరెస్ట్ చేశారు. వారి వద్ద 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపర్చడంతో న్యాయాధికారి రిమాండ్ విధించారు. సమావేశంలో మార్కాపురం సీఐ పి.సుబ్బారావు, టౌన్, రూరల్ ఎస్సైలు ఎం.సైదుబాబు, రాజమోహన్‌రావు, అంకమ్మరావులు పాల్గొన్నారు.

గజేంద్ర వాహనంపై శ్రీసీతారామలక్ష్మణులు

తిమ్మాపురం, ఐనముక్కులలో అన్నసంతర్పణ

పెద్దదోర్నాల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మండలంలోని తిమ్మాపురం ఐనముక్కుల గ్రామాల్లో బుధవారం గణపతి పూజ, చండీ హోమం, తదితర క్రతువుల అనంతరం శ్రీసీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు భక్తులు జై శ్రీరాం అంటూ భక్తి గీతాలపనలు చేశారు. అనంతరం వడపప్పు, పానకం పంచిపెట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ గావించారు. సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గజేంద్ర వాహనంపె శ్రీసీతారామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం చేశారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు పెరుమాళ్ల సుబ్బారావు, బొగ్గరపు రమేష్, రావిక్రింది పుల్లారావు, వెంకట సుబ్బయ్య దొడ్డా వెంకటేశ్వర్లు, ఎర్రగుంట్ల మల్లయ్య, నారాయణ, మండ్ల వెంకట సుబ్బయ్య, రాములు, పీ రామిరెడ్డి, జంగిలి పిచ్చయ్య, చిట్యాల రామకృష్ణారెడ్డి, యక్కంటి లింగారెడ్డి, మల్లారెడ్డి, గొల్మారు శేఖర్ రెడ్డి, ఆదినారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

పెద్దదోర్నాల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు వృత్తి విద్యలో నైపుణ్యాలు మెరుగు పర్చుకునేందుకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు అనసూయ దేవి అధ్యక్షతన ఐటీ ఒకేషనల్ ట్రైనర్ సయ్యద్ నాయబ్‌రసూల్ విద్యార్థులకు కంప్యూటర్ పని విధానం, ఆటోమొబైల్స్ షోరూమ్‌లలో సేల్స్ సర్వీసింగ్, తదితర అంశాలపై మీసేవ కేంద్రాల్లో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది రామానాయక్, ప్రేమ్‌చంద్‌పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ స్థలాలు మంజూరు చేయాలి

మార్కాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం నివాసస్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య చెప్పారు. నివాసస్థలాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖాశిం, పొదిలి, కొనకనమిట్ల సీపీఐ కార్యదర్శులు వీరయ్య, కేవీ రత్నం, పట్ట కార్యదర్శి చిత్తారి పెద్దన్న, నాయకులు దుప్పట్ల కాశయ్య పాల్గొన్నారు.

ఆర్మీ సైనికుల దాతృత్వం

తర్లుపాడు, ఏప్రిల్ 9 ఆంధ్రజ్యోతి : మండలంలోని సీతానాగులవరంలో కొంతకాలంగా గుండె జబ్బుతో బాధపడుతూ ఇటీవలె ఆపరేషన్ చేయించుకున్న క్షీరా సాగరాచారికి గ్రామంలోని ఆర్మీ సైనికులు దాతృత్వాన్ని చాటుకున్నారు. అదే గ్రామానికి చెందిన ఆర్మీ సైనికులు రూ.25వేలను పోగు జేసి క్షీర సాగరాచారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ సైనికులు టి.ప్రసాద్, బి.వాసు, బి.శ్రీనివాసులు, బి.గోపి, పి.రమణయ్య, కె.చిన్నవెంకటేశ్వర్లు, ఎస్.సీతయ్య, ఆర్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు

అవీఇవీ


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న క్రిష్ణకిశోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తి తీర్చేందుకు దాతలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని టీడీపీ నేత ముత్తుముల క్రిష్ణకిశోర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో 11వ వార్డు కౌన్సిలర్ లొక్కు రమేష్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా క్రిష్ణకిశోర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆదామ్, నాయకులు భైలడుగు బాలయ్య, దమ్మాల జనార్దన్, బిల్లా రమేష్, కమతం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణకిశోర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు

ముత్తుముల క్రిష్ణకిశోర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను బుధవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యనాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను క్రిష్ణకిశోర్‌రెడ్డి కట్ చేశారు. అనంతరం అన్నా క్యాంటీన్‌లో పుట్టిన రోజు సందర్భంగా పార్టీ కార్యకర్తలు అన్నదానం నిర్వహించారు.

నూరు శాతం పనిదినాలను వినియోగించుకోవాలి

ఐటీడీఏ పీవో వెంకట శివప్రసాద్


గిరిజనులకు జాబ్ కార్డులు అందజేస్తున్న పీవో

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : చెంచు గిరిజనులు నూరు శాతం ఉపాధి పనులను వినియోగించుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వెంకట శివప్రసాద్ చెప్పారు. మండలంలోని చింతల గ్రామంలో ప్రాజెక్టు పరిధిలోని నంద్యాల, ప్రకాశం, పల్నాడు మూడు జిల్లాలకు చెందిన చెంచు గిరిజనులకు ఉపాధి పనులపై బుధవారం ఐటీడీఏ పీవో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చెంచు కుటుంబం ఉపాధి హామీ పథకం కార్డు కల్గి ఉండాలని, తద్వారా 150 రోజులు పని దినాలను ఉపయోగించు కోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మధుసూధన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

హజరత్‌గూడెం పాఠశాల పరిశీలన


మాట్లాడుతున్న సీడీపీవో నీలోఫర్

కంభం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హజరత్‌గూడెం ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నతీకరిస్తూ హైస్కూలుగా మారుస్తున్న ఏర్పాట్లను డీవైఈవో సామ్యూల్‌జాన్ పరిశీలించారు. బుధవారం పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, విద్యార్థుల సంఖ్య, ఆటస్థలం తదితర వసతులను పరిశీలించారు. డీవైఈవో మాట్లాడుతూ ఉన్నత పాఠశాలగా మార్పు చేసినందుకు విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. గ్రామసర్పంచ్ మహబూబ్‌పీరా, ఎస్ఎంసీ ఛైర్మన్ నాగేంద్ర, ఎంఈవో మాల్యాద్రి, శ్రీనివాసులు, హెచ్ఎం సరోజ పాల్గొన్నారు.

చలివేంద్రానికి విరాళం

గిద్దలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): యాదవ ప్రొటెక్షన్ ఫౌండేషన్ తరపున ఏర్పాటు చేస్తున్న చలివేంద్రానికి విరాళం ఇచ్చారు. ఫౌండేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లెబోయిన వినోద్‌కుమార్, బీజేపీ జిల్లా యువమోర్చ ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మీయాదవ్ దంపతులు 6వేల రూపాయల విరాళాన్ని అందచేసినట్లు ఫౌండేషన్ మండలశాఖ అధ్యక్షులు మల్లెబోయిన రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

'వైద్యం కోసం వస్తే బిళ్లలు ఇచ్చి బయటకు పంపారు'


వైద్యశాల బయట ఉన్న వృద్ధుడు ఖాజా

మార్కాపురం రూరల్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సర్వజన వైద్యశాలకు అనారోగ్యంతో వైద్యం కోసం వస్తే బయటకు పంపించారని ఓ వృద్ధుడు వైద్యశాల వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు ఎవరూ లేరని, వైద్యశాల బయట అరుగు పైనే పడుకున్నాడని తెలిపారు. ఆయన మాటల్లోనే... నాది బేస్తవారిపేట. పేరు దూదేకుల ఖాజా. బుధవారం ఉదయం పది గంటలకు సర్వజన వైద్యశాలకు వచ్చా. ఆరోగ్యం బాగాలేదని వైద్యులకు తెలిపా. రెండు మందు బిళ్లలు ఇచ్చి పంపించారు. జ్వరం, అనారోగ్యంతో బాధ పడుతున్నానని, వైద్యశాలలో చేర్పించుకుని వైద్యం అందించాలని కోరినా ఎవరూ పట్టించుకోలేదు. నాకు ఎవరూ లేరు. వైద్యశాలలో చేర్చుకుని వైద్యులు వైద్యం అందించాలి.

కాటంరాజు దేవస్థాన ఛైర్మన్‌గా గంగరాజు

మార్కాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం డివిజన్‌లో ప్రసిద్ధిగాంచిన వేనూతల కాటంరాజు దేవస్థానం పాలకమండలి ఛైర్మన్‌గా గుమ్మా గంగరాజు ఎన్నికయ్యారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం డివిజన్ యాదవ సంఘ సమావేశానికి యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యుల అందరి ఆమోదంతో గుమ్మా గంగరాజును దేవస్థానం ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఒంటేరు నాగేశ్వరరావు, గుమ్మా బాలనాగయ్య సుబ్బారావు, పిన్నిక చక్రపాణి పాల్గొన్నారు.

అవీ..ఇవీ



విద్యామిత్ర స్టాక్ పాయింట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్

విద్యామిత్ర స్టాక్ పాయింట్ తనిఖీ

తాళ్లూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యాసంవత్సరానికి విద్యార్థులకు శ్రీసర్వేపల్లిరాధాకృష్ణ విద్యామిత్ర సామగ్రిని నిల్వ చేసేందుకు గుర్తించిన తాళ్లూరులోని వీకేజీహెచ్‌ఎస్ స్టాక్ పాయింట్‌ను డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్ బుధవారం సందర్శించారు. గత ప్రభుత్వం అప్పటి సీఎం జగన్ ఫొటోలతో విద్యార్థులకు పాఠశాల సామగ్రిని అందజేసింది.ఈ ఏడాది ప్రభుత్వం విద్యాలయాల్లో రాజకీయాలు చొప్పించకుండా ఉండేందుకు నూతన ప్రణాళికతో సామగ్రిని తయారు చేసి రానున్నవిద్యాసంవత్సరంలో విద్యార్థులకు అందించేందుకు ఏర్పాట్లు చేసింది. అందులో భాగంగా స్టాక్ పాయింట్లను గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జి.సుబ్బయ్య, ఎంఈవో-2 ఎల్.సుధాకర్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

అర్జీదారుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు

ముండ్లమూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్‌లుగా పని చేస్తున్న వారిపై పలు ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రతి పనికీ డబ్బులు అడుగుతున్నట్టు ఐఆర్ఎస్ సర్వే కాల్స్ వస్తున్నట్టు తహసీల్దార్ ఎల్. లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యపై దరఖాస్తు చేసుకోవటానికి వచ్చే అర్జీదారుల వద్ద ఎవరైనా డబ్బులు తీసుకుంటే వారిపై తీవ్రమైన చర్యలు ఉంటాయన్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకు వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. త్వరలో ప్రతి గ్రామ సచివాలయాన్ని సందర్శిస్తానన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు పాల్గొన్నారు.



బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రమణయ్య

నిధులిచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న ప్రధాని

పామూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో వెనుకబడిన రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని మోదీ అధిక నిధులు ఇచ్చి సహకారం అందిస్తున్నారని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో క్రియాశీలక సభ్యుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా రమణయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ విజయం, సంస్థాగత విస్తరణ, దేశ రాజకీయాల్లో తెచ్చిన మార్పులు, గడిచిన 11 సంవత్సరాల్లో వికసిత భారత్ దిశగా ప్రధాని ప్రయాణం అనే అంశాలను చర్చించారు. జె. చిన సుబ్బయ్య, కేవీ సుబ్బారావు, బి. హజరత్‌కుమార్, చామల శ్రీనివాసులరెడ్డి, కే హరగోపాల్, కే సురేష్, డి వెంకటచరణ్, కొట్టి సురేష్, కేవీ మణికంఠ, పి. అరవింద్, ఎం. మాల్యాద్రి, ఈ. సత్యం, రామకృష్ణ, పి. శ్రీనివాసుల ఉన్నారు.



ఈదరలో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీవో పద్మ

తడి,పొడి చెత్తను సంపద తయారీ కేంద్రాలకు చేర్చాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతి గ్రామ పంచాయతీలో తడి, పొడి చెత్తలను గ్రీన్ అంబాసిడర్లు సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించే విధంగా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఒంగోలు డీఎల్‌పీవో పద్మ సూచించారు. మండలంలోని కెల్లంపల్లి, పెద ఉల్లగల్లు, వేముల, ఈదర గ్రామ పంచాయతీల్లో ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఆయా గ్రామాల్లో మహిళలు గ్రామస్థులకు గ్రామంలో పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధులు దరి చేరవని సూచించారు. మురుగు కాలువలు, రోడ్లకు ఇరువైపులా చెత్త లేకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, జనమాల పిచ్చయ్య, నాగేంద్రం, వంగల పద్మావతి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రాజ రాజేశ్వరి, ఏ. శ్రీనివాసరావు, గురునాథం, షేక్ షమీర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలకే గ్రామీణ బ్యాంకుల విలీనం

పామూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి నూతనంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణబ్యాంక్‌గా రూపాంతరం చెందుతుందని స్థానిక ఏపీజీబీ బ్యాంక్ మేనేజర్ టి. మురళికృష్ణ, తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, గ్రామీణ వికాస్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ లను విలీనం చేసి అమరావతి ప్రధాన కార్యాలయంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భాగస్వామ్యంతో మే 1 నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌గా ఏర్పడనున్నదని తెలిపారు. విలీనం ద్వారా ఖాతాదారులకు ఆధునాతన టెక్నాలజీ ద్వారా అత్యుత్తమ సేవలు అందుతాయని తెలిపారు.

ఏడాది లోపే ట్రిపుల్ ఐటీ భవనం నిర్మిస్తాం

● ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి



స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఏడాదిలోపే ట్రిపుల్ ఐటీ భవనం నిర్మించటమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని బల్లిపల్లి అడ్డరోడ్డు వద్ద ఉన్న ప్రభుత్వ భూముల్లో అనువైన స్థలాన్ని పరిశీలించేందుకు మంగళవారం రాత్రి ఎమ్మెల్యే టీడీపీ నాయకులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014లో టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు కనిగిరి ప్రాంతాన్ని విద్యాపరంగా కూడా అభివృద్ధి చేసేందుకు సంకల్పించారన్నారు. అందుకోసం ట్రిపుల్ ఐటీ ఇంజనీరింగ్ కళాశాలను నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. అప్పట్లో పామూరు మండలంలోని దూబగుంట ప్రాంతంలో 208 ఎకరాల భూమిని గుర్తించి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత ఎన్నికలు రావటంతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ట్రిపుల్ ఐటీ నిర్మాణాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. కనిగిరి ప్రాంతంలో బిల్డింగ్ లేదనే నెపంతో ఒంగోలు తరలించి కనిగిరి అభివృద్ధికి విఘాతం కల్గించారని ఆరోపించారు. దానిని తిరిగి కనిగిరి ప్రాంతంలో ఏర్పాటు చేసుకుంటే ఇక్కడివిద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. అందుకోసం స్థల పరిశీలన చేసి వచ్చే విద్యా సంవత్సరానికి కనిగిరిలో ఇంజనీరింగ్ కళాశాల నిర్వహించటమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, బాలు ఓబులురెడ్డి పాల్గొన్నారు.

పాతూరులో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తా

పాతూరులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బొడ్డురాయి వద్ద బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. బొడ్డురాయి (ఆంజనేయస్వామి) వద్ద ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, నాగ, దొరసాని, చెరుకూరి నరసింహారావు, చింతం శ్రీను, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

దేవస్థాన భూముల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు



దేవస్థాన భూముల్లో నిర్మించిన కట్టడాలను పరిశీలిస్తున్న పానకాలరావు

పామూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : దేవస్థాన భూముల్లో అనుమతులు లేకుండా కట్టడాలు చేపడితే చర్యలు తీసుకొంటామని ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు హెచ్చరించారు. పామూరు పట్టణంలోని నెల్లూరు రోడ్‌లో గల మదన వేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించిన సర్వేనెంబర్లు 365, 322లో గల భూముల్లో చేపట్టి ఉన్న నిర్మాణాలను ఎండోమెంట్ సిబ్బందితో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. కోర్టు పరిధిలో ఉన్న దేవస్థాన స్థలాల్లో, ఖాళీగా ఉన్న స్థలాల్లో ఇక నుంచి నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని, ఇంటి ప్లాన్, విద్యుత్ మీటర్లు మంజూరు చేయకుండా ఆయా శాఖల అధికారులతో మాట్లాడాలని ఈవో నరసింహాబాబును ఆదేశించారు.

ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ కొంత మంది ఆక్రమణదారులు దేవస్థాన భూముల్లో నిర్మాణాలు చేపట్టి ఉన్న పలువురు తమకు ఎన్‌వోసీ కావాలని కోరుతూ ఎండోమెంట్ కమిషనర్‌కు దరఖాస్తులు చేసుకొన్నారని,దీనిపై రికార్డులను పరిశీలించి తగు నివేదికను ఎండోమెంట్ ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ,ఈవో నరసింహాబాబు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేవీ రమణయ్య, దేవస్థాన కమిటీ మాజీ మెంబర్ పసుపులేటి రఘురాం, బండ్ల నారాయణ, కోవిలంపాడు దేవస్థాన సిబ్బంది, తదితరులు ఉన్నారు.

నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

● డైట్ ప్రిన్సిపాల్ సుబ్బారావు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ సుబ్బారావు

కనిగిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు సూచించారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం డివిజన్ పరిధిలోని ఆరు మండలాల హైస్కూల్ హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకత్వ శిక్షణా కార్యక్రమాల్లో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. నైపుణ్యాలను పెంపొందించుకుని వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలలను అభ్యాస సంస్థగా అభివృద్ధి చేయటానికి సమర్థవంతమైన వ్యూహాలను రూపొందించుకోవాలన్నారు. నిరంతర వృత్యంతర అంశాలలో శిక్షణ పొందటంతో పాటు విద్యాశిక్షణ కార్యక్రమాల సెమినార్‌లలో పాల్గొనటం చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఎల్‌డీపీ శిక్షణకు సంబంధించిన ప్రణాళికపై సమీక్షించారు. సమావేశంలో ఆరు మండలాలకు చెందిన ఎంఈవోలు యూవీ నారాయణరెడ్డి, ఎంఈవోల సంఘం జిల్లా నాయకులు దేవిరెడ్డి రామిరెడ్డి, ఆర్ శ్రీనివాసులు, సంజీవి, రాజాల కొండారెడ్డి , హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

బెట్టింగ్ నియంత్రణకు పోలీసుల పటిష్ట చర్యలు

దర్శి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్‌ల నియంత్రణకు దర్శిలో పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. యువత, విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించి చెడుమార్గం వైపు వెళ్తే ఎదుర్కొనే సమస్యలను వివరిస్తున్నారు. దర్శి డీఎస్పీ బీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సీఐ వై రామారావు, ఎస్‌ఐ ఎం. మురళీలు కళాశాలల్లో విద్యార్థులకు నిరంతరం అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. యువత అధికంగా సంచరించే ప్రాంతాల్లో పోలీసులు వెళ్లి వారు ఏం చేస్తున్నారా అనే విషయాలను పరిశీలిస్తున్నారు. వారి సెల్‌ఫోన్లు పరిశీలించి యాప్‌లను తనిఖీలు చేస్తున్నారు. దర్శి ప్రాంతంలో గతంలో క్రికెట్ బెట్టింగుల వలన యువత అనేక మంది నష్టపోయిన విషయం తెలిసిందే. అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి. కొంత మంది యువకులు అప్పులపాలై ఆ అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు కూడా చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్నందున బెట్టింగుల వైపు యువత వెళ్లకుండా నియంత్రించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు

పౌష్టికాహార పక్షోత్సవాలపై ర్యాలీ

దొనకొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 22వ తేదీ వరకు నిర్వహించే 7వ పౌష్టికాహార పక్షోత్సవాలపై బేతేల్‌పురం-1, బేతేల్‌పురం-2 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అంగన్‌వాడీ సిబ్బంది బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణులకు రక్తహీనత గురించి ఏఎన్‌ఎంల ద్వారా పరీక్షలు చేయించారు. తల్లులకు అవగాహన కల్పించారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

తాళ్లూరు :తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని,ప్రతి తల్లి బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు అందించాలని ఐసీడీఎస్ సైపర్‌వైజర్ జి. జ్యోతి తెలిపారు. సోమవరప్పాడు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్‌పక్వాడా కార్యక్రమం నిర్వహించారు.

బుక్కాపురంలో

పామూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే పౌష్టికాహార పక్షోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య, తెలిపారు. మండలంలోని బుక్కాపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార వారోత్సవాల కార్యక్రమం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి. పద్మజ ఆధ్వర్యంలో చేపట్టారు.

పెండింగ్ చలానాలు వెంటనే చెల్లించాలి

పీసీపల్లి, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): వాహనాలపై నమోదై ఉన్న పెండింగ్ చలానాలను వెంటనే చెల్లించాలని పీసీపల్లి ఎస్సై జి.కోటయ్య అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు రోజులుగా మండలంలోని వివిధ గ్రామాలను సందర్శిస్తూ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపడుతున్నారు.ఈ తనిఖీల్లో వాహనాలపై నమోదై పెండింగ్‌లో ఉన్న చలానాలను గుర్తించి యజమానులతో వాటిని కట్టిస్తున్నారు. బుధవారం పీసీపల్లి సెంటరులో నిలిపి ఉన్న వాహనాలను తనిఖీ చేసిన ఆయన అక్కడికక్కడే పెండింగ్ చలానాలను యజమానులతో ప్రభుత్వానికి జమ చేయించారు.అలాగే మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నారు.



పెండింగ్ చలానాలను చెక్ చేస్తున్న పోలీసులు

ఈ సందర్భంగా వాహన యజమానులతో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వాహనచట్ట నిబంధనలను పాటించాలని ఆయన అన్నారు. ఈ వాహన తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు బ్రిడ్జికోర్సుపై ప్రత్యేక తరగతులు



పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలతో విద్యార్థులు

దొనకొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఇంటర్మీడియెట్ విద్యలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు జూనియర్ కాలేజీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్రిడ్జి కోర్సు మీద ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను అందించి పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు వేల రూపాయల ఆర్థికభారాన్ని తగ్గించింది. విద్యార్థులకు ఎటువంటి ఆకలిబాధలు లేకుండా ఉత్సాహంగా చదువుకునేలా కాలేజీలోనే మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తూ గత ఏడాది నుంచి ముందుకు సాగుతోంది. దొనకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రస్తుతం ఇంగ్లీష్, తెలుగు మీడియంలో హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని ప్రిన్స్‌పాల్ కె. ధనుముని తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభించామని, సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుమీద ప్రభుత్వం ఉచితంగా అందించిన పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలను ప్రతి విద్యార్థికి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విద్యాభివృద్ధితో ముందుకు సాగాలని ప్రిన్స్‌పాల్ కోరారు.

నేడు విజయాంజనేయస్వామి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో శ్రీ విజయాంజనేయస్వామి, పక్కన తిరునాళ్లకు ముస్తాబైన ఆలయం

దొనకొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక దొనకొండ అడ్డరోడ్డులో పాపులమ్మ పూర్వఆశ్రమ ఆవరణలో వేంచేసిన శ్రీ విజయాంజనేయస్వామి, సుబ్రమణేశ్వరస్వామి వార్ల 18వ వార్షిక తిరునాళ్ల గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవాలాయన్న ప్రత్యేక విద్యుదీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేడుకలకు విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ధర్మకర్త సిరిగిరెడ్డి బాలిరెడ్డి అన్నీ సౌకర్యాలను సమకూర్చారు.

తిరునాళ్ల సందర్భంగా దేవాలయానికి విచ్చేసిన ప్రజలకు మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్నదానం జరుగుతుందన్నారు. రాత్రి 7 గంటల నుంచి ప్రభలు, పాటకచేరీ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



ఎంపీ మాగుంట నుంచి నియామక పత్రం అందుకుంటున్న భీమని కార్తిక్

గుంటూరు టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా కార్తిక్

తాళ్లూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగంగవరం గ్రామానికి చెందిన భీమని కార్తిక్ టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులుగా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని ఒంగోలు మాగుంట కార్యాలయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి బుధవారం అందించారు. ఈ సందర్భంగా కార్తిక్ మాట్లాడుతూ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా తన నియామకానికి సహకరించిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎంపీ తనయుడు మాగుంట రాఘవరెడ్డి, టీడీపీ దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ యువనాయకుడు లలిత్‌సాగర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



కలెక్టర్ అన్సారియాకు మొక్కను అందజేస్తున్న దిశ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా ఎన్నికైన శీనివాసరావు

దిశ అభివృద్ధి కమిటీ జిల్లా సభ్యుడిగా కొర్రపాటి

ముండ్లమూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ముఖ్య అనుచరుడు దిశ జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యుడిగా ఎంపికైన కొర్రపాటి శ్రీనివాసరావు కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని కలిసి పూల మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎంపీలకు శ్రీనివాసరావు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలపై దృష్టి సారించి అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లి సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

వైద్యశాల డైరెక్టర్‌కు సన్మానం

పామూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పేద రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి మంచి పేరు తీసుకురావాలని ప్రభుత్వ సామాజిక వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ షేక్ ముబినా మౌలాలి డాక్టర్లను కోరారు. స్థానిక ప్రభుత్వ సామాజిక వైద్యశాలను డైరెక్టర్ ముబినా మౌలాలి బుధవారం పరిశీలించారు ఈ సందర్భంగా మౌలాలిని డ్యూటీ డాక్టర్ చెన్నుపాటి భరత్ పూల మాల వేసి శాలువాతో సత్కరించారు.

డైరెక్టర్లకు సన్మానం

పామూరు ప్రభుత్వ సామాజిక వైద్యశాల డైరెక్టర్లుగా నియమించిన ఎన్. సాంబయ్య, ముబినామౌలాలిలను స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం టీడీపీ శ్రేణులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, ఉప్పలపాటి హరిబాబు షేక్ రజ్జబ్‌బాష, పి. తిరుపతయ్య, డోలా శేషాద్రి, షేక్ పత్తు మస్తాన్ ఉన్నారు

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

ముండ్లమూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరు పోలీసు స్టేషన్ ఎస్‌ఐగా కే కమలాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఒంగోలు వీఆర్‌లో ఉంటూ బదిలీపై ముండ్లమూరు పోలీసు స్టేషన్‌కు నియమితులయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ కమలాకర్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎస్‌ఐ కమలాకర్‌కు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం

తాళ్లూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) :విఠలాపురం గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న శ్రీసీతా,లక్ష్మణ, హనుమత్ సమేత శ్రీరామచంద్రమూర్తి విగ్రహ, నాభిశిల ప్రతిష్ఠామహోత్సవం సందర్భంగా బుధవారం రుత్వికులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం సీతా,రామ,లక్ష్మణ ,హనుమత్ విగ్రహాలను ప్రత్యేకంగా అంకరించిన వాహనంలో గ్రామోత్సం నిర్వహించారు.

వీఆర్‌ఏల వేతనాలు పెంచాలి

పామూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో మూడేళ్లుగా పేస్కేల్ జీతాలు చెల్లిస్తున్నారని, ఆ తరహాలో మాదిరిగా తమకూ పేస్కేల్ చెల్లించాలని వీఆర్‌ఏల సంఘం మండల కమిటీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపులో భాగంగా వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందించాలని కోరుతూ బుధవారం డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఇమ్మానియేలు, షేక్ బీబీ, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఉపాధి పనులు

ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధి పనులు చేపట్టి పని ప్రదేశాల్లో కనీస వసతులు సమకూర్చాలని ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు.

యారవ శ్రీనుకు అభినందనలు

పామూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా టీడీపీ నాయకుడు యారవ శ్రీనువాసులు సతీమణి రమాదేవి నియమితులు కావడంతో పలువురు టీడీపీ శ్రేణులు శ్రీనివాసులను కలసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. పామూరులోని యారవ శ్రీను క్యాంపు కార్యాలయంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు పందిటిహరీష్, ముప్పసాని గణేష్, రాఘవ, సోమిశెట్టి నరసింహారావు, వాసు, తదితరులు ఉన్నారు.



- ప్రమాదకరస్థాయిలో యూవీ కిరణాలు
- ఉమ్మడి గుంటూరుపై అతినీలలోహిత కిరణాల పడగ
- ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికంగా
- జాగ్రత్తలు తీసుకోకుంటే ముప్పేనంటున్న వైద్య నిపుణులు

10 యూవీ అంటే ప్రమాద కరమే

వాతావరణంలో అతినీలలోహిత కిరణాలు 2 యూనిట్ల లోపు ఉంటే సాధారణ స్థాయిగా గుర్తిస్తారు. 3 నుంచి 5 లోపు ఉంటే మధ్యస్థంగా, 6-7 మధ్య ఉంటే అధికంగా ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ గుర్తిస్తుంది. ఇక 8 నుంచి 10 వరకు ఉంటే అత్యధిక స్థాయిలో ఉన్నట్లు గుర్తించడంతో పాటు ప్రమాదకరమని రెడ్‌అలర్ట్ ప్రకటిస్తారు.


వణికిస్తున్న యూవీ కిరణాలు

రేడియేషన్... రెడ్‌అలర్ట్

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నుంచి పగలు ఎండలు మండుతున్నాయి. రాత్రిల్లు మంచుతో పాటు చలిగాలులు వీచాయి. ఈ విచిత్రమైన వాతావరణ పరిస్థితులతో పలువురు అనారోగ్యాలకు గురయ్యారు. ఉన్నట్టుండి వాతావరణంలో చోటు చేసుకుంటున్న విపరీత మార్పులపై ప్రజల్లోనూ భాయాందోళన నెలకొంది. ఈ వేసవిలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో అధికస్థాయిలో అతి నీలలోహిత కిరణాలు ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ గుర్తించింది. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య ఈ కిరణాల తీవ్రత అధికంగా ఉంటోందని హెచ్చరికలు జారీ చేసింది. అతినీలలోహిత కిరణాల్లో ఉండే రేడియేషన్ మనుషుల్లో పలు రకాల ఆరోగ్య సమస్యలకు కారణమౌతుంది. ముఖ్యంగా వడదెబ్బ, సన్‌బర్న్స్, కంటి శుక్లాలు, చర్మం ముడతలు పడటం వంటి సమస్యలతో పాటు కొన్నిసార్లు చర్మ కేన్సర్లకు అతి నీలలోహిత కిరణాలు కారణమౌతాయి. యూవీ కిరణాల తీవ్రత అధికంగా ఉన్నప్పుడు జనాలు ఎండలో ఎక్కువ సేపు తిరిగితే సొరియాసిస్, బొల్లి రోగుల్లో ఎండ పడిన శరీర భాగాల్లో వ్యాధి వ్యాపించే అవకాశం ఉంటుంది. కొద్ది రోజులుగా పగటి వాతావరణంలో యూవీ కిరణాల తీవ్రత పెరుగుతోంది. ముఖ్యంగా గత మూడు రోజులుగా ఉమ్మడి గుంటూరు జిల్లా వాతావరణంలో 10 యూవీ రేడియేషన్ యూవీ కిరణాలు వెలువడినట్లు వాతావరణ శాఖ గుర్తించింది.

వీరు జాగ్రత్తగా ఉండాల్సిందే...

తక్కువ తరంగ దైర్ఘ్యం కలిగి ఉండటం వల్ల అతి నీలలోహిత కిరణాలు దృశ్యకాంతి కంటే అధికంగా చర్మలోతుల్లోకి చొచ్చుకొని పోగలవు. శరీర కణాల్లో డీఎన్ఏను దెబ్బతీసే సామర్థ్యం వీటికి ఉంటుంది. ఈ కారణంగా ఈ కిరణాల నుంచి రక్షణ కోసం బహిరంగ ప్రదేశాల్లో తిరిగే వారు, బైకర్లు, ఎండలో పని చేసే వారు, మత్స్యకారులు, పర్యాటకులు, కంటి, చర్మవ్యాధులు ఉన్న వారు, పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లే సమయంలో పొడుగు చేతుల దుస్తులు, టోపీ ధరించడం, కళ్లద్దాలు ధరించడం శ్రేయస్కరమని వైద్యనిపుణులు చెబుతున్నారు. 'ఎండలో తిరిగే వారు సన్ స్క్రీన్ లోషన్ వాడనవసరం లేదు. శరీరంలో ఉండే మెలనిన్ రక్షణగా నిలుస్తుందని..' సీనియర్ డెర్మటాలజిస్ట్ డాక్టర్ డీవీఎస్‌బీ రామ్మూర్తి తెలిపారు. సొరియాసిస్, బొల్లి వంటి చర్మవ్యాధుల ఉన్న వారు ఎండలో ఉండే యూవీ కిరణాల్లో ఎక్కువ సేపు తిరిగితే వారిలో వ్యాధి తీవ్రత మరింత పెరుగుతుందన్నారు.

సన్‌బర్న్ కేసులు వస్తున్నాయి...



వాతావరణంలోని అతి నీలలోహిత కిరణాల తీవ్రత కారణంగా గుంటూరు ప్రభుత్వ సమగ్రా స్పత్రి చర్మవ్యాధుల వైద్య విభాగానికి సన్ బర్న్ రోగులు చికిత్సల కోసం వస్తున్నా రు. ఎండలో తిరిగే వారు సూర్యరశ్మి చర్మంపై పడకుండా తగిన దుస్తులు ధరించాలి. అధికంగా మంచినీరు, ఇతర ద్రవ పదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఎండలో తిరిగిన వారు అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే నీడ పట్టున కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలి.

- డాక్టర్ లక్ష్మి, జీజీహెచ్ డెర్మటాలజిస్ట్


మనవడు దేవాన్ష్‌తో కలిసి పూజ చేస్తున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు

శాస్త్రోక్తంగా సీఎం ఇంటి భూమిపూజ

హోమం చేసిన సీఎం దంపతులు

లోకేశ్, బ్రాహ్మణికి పట్టువస్త్రాలు పెట్టిన రైతులు

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల వెలగపూడిలో తీసుకున్న స్థలంలో ఇంటి నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. అధికారిక హోదాలో ఎలాంటి హడావుడి లేకుండా పరిమిత సంఖ్యలోనే ఆహ్వానితులు, బంధుమిత్రుల సమక్షంలో శంకుస్థాపన జరిగింది. ఉదయం 7 గంటలకు ఉండవల్లిలోని ప్రస్తుత నివాసం నుంచి కుటుంబ సభ్యులంతా వెలగపూడిలోని తమ ఇంటి స్థలం వద్దకు చేరుకున్నారు. ఉదయం 8గంటల 51 నిమిషాలకు చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, తమ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్‌తో కలిసి, పునాదుల్లో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, నిర్మాణాన్ని ప్రారంభించారు. మనవడు దేవాన్ష్‌ను ఒళ్లో కూర్చోబెట్టుకుని సీఎం చంద్రబాబు క్రతువులు నిర్వహించారు.

● అపూర్వ స్వాగతం పలికిన రైతులు

ఇంటి శంకుస్థాపనకు వస్తున్న సీఎం కుటుంబ సభ్యులకు అమరావతి రైతులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. తమను ఆహ్వానిస్తే అందరూ రావాలనుకున్నామని, పరిమిత సంఖ్యతో కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడంతో తాము పరిమితంగానే రావాల్సి వచ్చిందని చాలామంది రైతులు వాపోయారు. అయినప్పటికీ తమ సంతోషాన్ని తెలియజేయడం కోసం అమరావతి మహిళలు రంగవల్లులతో ఆహ్వానం పలికారు. స్వాగత ద్వారం నుంచి హోమగుండం వరకూ ముగ్గులు వేసి, అందంగా రంగులు అద్ది నారావారి కుటుంబానికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా లోకేశ్, బ్రాహ్మణి దంపతులకు రాజధాని రైతులు పట్టు వస్త్రాలు బహూకరించారు. చంద్రబాబు కొనుగోలు చేసిన స్థల యజమాని కంచర్ల సాంబశివరావు ఆయన భార్య, మాజీ సర్పంచ్ శాంతకుమారి, కుమార్తె గీత(చిన్న) ఇద్దరు యువ దంపతులకు పట్టు వస్త్రాలు పెట్టారు.


మంత్రి లోకేశ్, బ్రాహ్మణి దంపతులకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న స్థల యజమాని కుమార్తె గీత





సిమెంట్ సిండికేట్

- బస్తాకు రూ.90 పెరుగుదల
- దూసుకుపోతున్న ఇనుము ధరలు
- టన్నుకు రూ.10 వేలు పెరిగిన ఐరన్
- నిర్మాణదారులు విలవిల.. రంగం కుదేలు
- ధరలపై కొరవడిన ప్రభుత్వ నియంత్రణ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సిమెంటు, ఇనుము ధరలు దూసుకుపోతున్నాయి. ధరల పెరుగుదలతో నిర్మాణదారులు కళ్ల తేలేస్తున్నారు. ఇసుక ధర తగ్గిందన్న సంతోషం ఇనుము.. సిమెంట్ ధరల పెరుగుదలతో ఆవిరైపోయింది. వేసవిలో సహజంగా నిర్మాణాలు ఊపందుకుంటాయి. ఇదే అదనుగా కంపెనీలు ధరలు పెంచి సొమ్ము చేసుకుంటున్నాయి. కంపెనీలు సిండికేట్‌తో సిమెంట్ ధరలను అమాంతం పెంచాయి. మూడు రోజుల వ్యవధిలోనే సిమెంట్ బస్తాకు రూ.80 నుంచి రూ.90 ధర పెరిగింది. ఇనుము నెల రోజుల వ్యవధిలో టన్నుకు రూ.10 వేలు పెరిగింది. ధరల పెరుగుదలపై ప్రభుత్వ నియంత్రణ పూర్తిగా కొరవడింది. దీంతో కంపెనీలు ధరలపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా యని నిర్మాణదారులు ఆరోపిస్తున్నారు. ధరల పెరుగుదల నిర్మాణదా రులపై మోయలేని ఆర్థిక భారం పడుతోంది. సిమెంట్ ధరను పెంచడంతో పాటు సరఫరాను కంపెనీలు తగ్గించేశాయి. వ్యాపారులకు పూర్తిస్థాయిలో సిమెంట్ సరఫరా చేయడం లేదన్న విమర్శలున్నాయి. కృత్రిమ కొరతను సృష్టించేందుకు కంపెనీలు సిద్ధమయ్యాయన్న ఆరోపణలున్నాయి. సిమెంట్ కంపెనీలు సిండికేటై ఒక్కసారిగా బస్తాకు రూ.90 ధర పెంచాయని నిర్మా ణదారులు వాపోతున్నారు. మార్కెట్‌లో విక్రయిస్తున్న అన్ని రకాల సిమెంట్ ధరలను కంపెనీలు పెంచేశాయి. రోజురోజుకు సిమెంట్ ధరలు పెరుగుతున్నా నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని నిర్మాణ రంగ వర్గాలు విమర్శిస్తున్నాయి. సిమెంట్ కంపెనీలకు పాలకులు ఒత్తాసు పలకడం వల్లే ధరలను ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. గత నెలలో ఇనుము టన్ను రూ.55,000 ఉంది. నెల రోజుల వ్యవధిలోనే మార్కెట్‌లో రూ.65 వేలకు చేరింది. రెండు రోజుల క్రితం ఒకేసారి టన్నుకు రూ.4 వేలు పెరిగిందని నిర్మాణ దారులు చెప్పారు. ఇనుము, సిమెంట్ ధరలు ఒక్కసారిగా పెరగడంతో 20 శాతం భారం పడిందని నిర్మాణ దారులు వాపో తున్నారు. ధరల పెరుగుదలతో నిర్మాణాలను పలువురు నిలిపివే స్తున్నారు. దీంతో కార్మికులు ఉపాధిని కోల్పో తున్నా రు. ధరలను నియంత్రించి నిర్మాణ రంగాన్ని ప్రభు త్వం కాపాడాలని నిర్మాణదారులు కోరుతున్నారు.

ఇసుక టన్ను రూ.500

అక్రమార్కుల మధ్య పెరిగిన పోటీతో ఇసుక ధర తగ్గింది. టన్ను ఇసుక రూ.500కు ప్రస్తుతం సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా ఇసుక సరఫరా నిలిచిపోయింది. దీంతో కృష్ణానదిలో ఇసుక అక్రమ మైనింగ్ పెద్దఎత్తున జరుగుతోంది. రోజు వేలాది టన్నుల ఇసుక మార్కెట్‌లోకి అక్రమార్కులు తరలిస్తున్నారు. నాణ్యమైన ఇసుక అందుబాటు ధరలోకి రావడంతో నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఇదే సమయంలో సిమెంట్, ఇనుము ధరలు పెరగడంతో ఈ ప్రభావం నిర్మా ణాలపై ప డుతోంది.

పర్యాటకంగా బీచ్‌ల అభివృద్ధి

జూలైకి సూర్యలంక, రామాపురంలో బోటింగ్‌కి ఏర్పాట్లు

పర్యాటక శాఖ సమీక్షలో కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సూర్యలంక, రామాపురం బీచ్‌లను పర్యాటకంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ జె. వెంకటమురళి తెలిపారు. పర్యాటకశాఖాధికారులు, కన్సల్టెంట్లతో బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బీచ్‌ల వద్ద రిసార్ట్స్ నిర్వాహణపై రూపొందించిన నివేదికలపై ఆయన చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జూలైకి సూర్యలంక, రామాపురం బీచ్‌ల్లో బోటింగ్ షికారు అమల్లోకి తెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. రెండు బీచ్‌లను పర్యావరణానికి ఎలాంటి హాని, కాలుష్యంలేని ప్రాంతాలుగా గుర్తించినట్లు చెప్పారు. ఇప్పటికే ఈ రెండు బీచ్‌ల్లో 20 మంది శాస్త్రవేత్తలు పర్యటించి ఆధ్యయనం చేశారన్నారు. జిల్లాలో జీడిపప్పు ఉత్పత్తి అధికంగా ఉన్నందున విక్రయాలు, ఉత్పత్తి ప్రదర్శనలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. బోటింగ్ షికారుపై మత్స్యకారులకు కల్గరి శిక్షణ ఇవ్వాలన్నారు. చేనేత ఉత్పత్తుల పెంపు, ప్రదర్శనల కొరకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఓడరేవు వద్ద రెవెన్యూ అసోసియేషన్‌కు సంబంధించిన ఎకరా స్థలాన్ని ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామన్నారు. పేరలి డ్రెయిన్ బోటింగ్‌కు అనువైన ప్రాంతంకాగా పర్యాటకుల కొరకు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, పర్యాటకశాఖ సహాయసంచాలకులు డాక్టర్ లజ్వంతినాయుడు, కన్సల్టెంట్ సాహితి దివి, జిల్లా పర్యాటకశాఖాధికారి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

సీఎం హామీల అమలుకు చర్యలు

పర్చూరు నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అధికారులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ పీ-4 కార్యక్రమంలో ఇచ్చిన హామీలపై అధికారులకు పలు సూచనలు చేశారు. నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి, ప్రతి మండలంలో ఒక అంబేద్కర్ భవన నిర్మాణానికి, సబ్‌స్టేషన్ నిర్మాణానికి, గ్రావెల్‌రోడ్ల ఏర్పాట్లపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. చినగంజాం మండలంలో కొత్త గొల్లపాలెం గ్రామ పర్యటనలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలలో వ్యక్తిగత అవసరాలకు సంబంధించిన వాటిని పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో పీ-4 కింద ఎన్నికైన కుటుంబాల అవసరాలపై చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావుని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి జె.రాజాదెబోరా, ముఖ్యప్రణాళికాధికారి శ్రీనివాసరావు, విద్యుత్ ఎస్ఈ ఆంజనేయులు, హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- గుంటూరు, పల్నాడు జిల్లాలు వెనకడుగు
- గుంటూరులో 2, పల్నాడులో 12 మాత్రమే నిర్మాణం
- బాపట్లలో ఇప్పటికే 74 పూర్తి.. మరో 51కి అనుమతి
- రెండు వారాల వ్యవధిలో పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- ఉపాధి హామీ పథకాన్ని విరివిగా వినియోగించాలని సూచన

నీటి తొట్టెలపై.. నిర్లక్ష్యం

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవి వేడి, వడగాడ్పుల దృష్ట్యా పశువులపై తీవ్ర ప్రభావం పడకుండా నీటి తొట్టెలను నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఈ నీటి తొట్టెల నిర్మాణాలపై అధికారుల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది. మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించినా అధికారుల్లో పెద్దగా స్పందన లేదని నీటి తొట్టెల నిర్మాణాలను చూస్తే అర్థమవుతోంది. గుంటూరు జిల్లాలో మొత్తం 30 తాగునీటి తొట్టెలు పశువులకు అవసరం అవుతాయని అంచనా వేశారు. అయితే వీటిలో ఇప్పటి వరకు కేవలం రెండు మాత్రమే నిర్మిం చారు. పల్నాడు జిల్లాలో వాతావరణం ఎక్కువ వేడిగా ఉంటుంది. అంతేకాకుండా అక్కడ పశువుల సంఖ్య కూ డా అధికం. ఈ దృష్ట్యా ఈ జిల్లాలో 248 నీటి తొట్టెలను వేర్వేరు గ్రామాల్లో నిర్మించాలని ఆదేశించగా వాటిల్లో కేవలం 12 మాత్రమే ఇప్పటివరకు ఆ జిల్లా అధికారులు నిర్మాణం పూర్తి చేయించారు. దీంతో 236 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బాపట్ల జిల్లాలో అధికారులు కొంత శ్రద్ధ పెట్టడంతో అక్కడ ఇప్పటికే 74 తొట్టెల నిర్మాణం పూర్తి చేశారు. మరో 51 తొట్టెల నిర్మాణాలకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. వీటిని కూడా ఉపాధి హామీ పథకం ద్వారా తక్షణం పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి తొట్టెలను నింపే బాధ్యతను ఆర్‌డబ్ల్యూఎస్‌కి కేటాయించారు. ఎండ వేడి నుంచి పశువులు, గొర్రెలు, మేకలను సంరక్షించకోవడానికి శుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉంచేందుకు ఈ తొట్టెల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. ప్రతీ పశువుకు రోజుకు సుమారు 30 నుంచి 40 లీటర్ల తాగునీరు అవసరం అవుతుంది. ఆవులకు 30 లీటర్లు, గేదెలకు 40 లీటర్లు, గొర్రెలు, మేకలకు 5 లీటర్లు నీరు అవసరం. ఇందుకోసం 5,200 లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి తొట్టెలను గ్రామాల్లో నిర్మించాలని ప్రభుత్వం సూచించింది.

ఆస్తులతో పాటు ఉపాధి..

రబీ సీజన్‌లో పంటల సాగు దాదాపుగా పూర్తి అయింది. వరి, ఇతర పంటల కోతలు ముగిశాయి. ఈ నేపథ్యంలో కూలీలు పనులు లేక ఇబ్బంది పడుతుంటారు. కొందరైతే ఇతర ప్రాంతాలకు వలస కూడా వెళుతుంటారు. ఈ నేపథ్యంలో నీటి తొట్టెల నిర్మాణ పనులను ఉపాధి హామీ కింద చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. దీనివల్ల అటు స్థిరాస్తులు ఏర్పడటమే కాకుండా ఇటు వ్యవసాయ కూలీలకు ఉపాధి పనిదినాలు అందుబాటులోకి వస్తాయి. ఇటీవలే రోజుకు ఉపాధి కూలిని రూ.300లకు పైగా ప్రభుత్వం పెంచింది. 100 రోజులకు పైగా పనిదినాలు కూడా కల్పించే అవకాశాన్ని కల్పించింది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో పశువుల కోసం నీటి తొట్టెల నిర్మాణంపై అధికారులు దృష్టి పెడితే అటు మూగజీవాలకు ఇటు వ్యవసాయ కూలీలకు మేలు జరుగుతుంది.


పశువుల నీటి తొట్టె

రూ.కోటి భూమి అన్యాక్రాంతం

మార్టూరు చెరువులో ప్లాట్లు.. అమ్మకాలు

మార్టూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రూ.కోటికి పైగా విలువైన మార్టూరు చెరువు పోరంబోకు స్థలం అన్యాక్రాంతమైంది. ఆక్రమిత స్థలంలో ఇప్పటికే ఎర్రమట్టిని పోసి చదును చేసి ప్లాట్లుగా మార్చి హద్దురాళ్లు కూడా వేశారు. అనధికారికంగా సెంట్ రూ.2 లక్షల చొప్పున కొందరికి అమ్మినట్లు తెలిసింది. మార్టూరు నుంచి రాజుగారిపాలెం వెళ్లే రోడ్డులో ఆర్‌జేఎస్‌టీ కాలనీకి సమీపంలో రోడ్డు పక్కన 342-బీ, 343 సర్వే నంబర్లలో చెరువు బోరంబోకు స్థలం ఎకరం 69 సెంట్లు ఉంది. గతంలో దానిపై మార్టూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అగ్రగణ్యులైన కొంతమంది కన్నేశారు. కాని అప్పటి రెవెన్యూ అధికారులు అడ్డుతగలడంతో విరమించుకున్నారు. చెరువు స్థలాన్ని ఎలాగైనా కాజేయాలని ఎదురుచూస్తున్న అక్రమార్కులు ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భావించారు. కొంతమందిని బినామీలుగా పెట్టుకుని తెరవెనుక ప్లాట్ల అమ్మకాలను మొదలు పెట్టారు. అయినా ఇప్పటి వరకు రెవెన్యూ, పంచాయతీ అధికారులు కన్నెత్తి కూడా చూడలేదన్న విమర్శలున్నాయి. మార్టూరు సెంటరుకు కూతవేటు దూరంలో మంచినీటి చెరువుకు, పోలీస్‌స్టేషన్‌కు, ప్రభుత్వ జూనియర్ కాలేజీకి సమీపంలోని చెరువు స్థలాన్ని ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తే బాగుంటుందని ప్రజలు భావిస్తున్నారు. చెరువు స్థలంలో ప్లాట్లకు పంచాయతీ, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి ఇవ్వలేదని ఈవో తన్నీరు శ్రీనివాసరావు తెలిపారు.


రాజుగారిపాలెం రోడ్‌లో చెరువు పోరంబోకు స్థలంలో అమ్మకాలు కోసం వేసిన ఇంటి నివేశన స్థలాల ప్లాట్లు



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న చైర్మన్, కౌన్సిలర్లు

కౌన్సిల్ సమావేశం మమ

- మూడు నిమిషాల్లో ముగిసిన వైనం
- 41 అంశాలకు ఆల్ పాస్
- అలా వచ్చారు.. ఇలా వెళ్లారు

చీరాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై అవిశ్వాసం నేపథ్యంలో ఇటు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ వర్గం కౌన్సిలర్‌లు, అటు టీడీపీ కూటమి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య వర్గం కౌన్సిలర్‌లు కారాలు మిరియాలు నూరుకున్నారు. ఈక్రమంలో బుధవారం నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అసలు ఎవరు ఏయే అంశాలపై మాట్లాడతారో...వాటిపై ఏవిధంగా మిగిలిన వారు స్పందిస్తారోనని అందరిలోనూ ఒకింత సందిగ్ధత నెలకొంది. అయితే బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశం అందరినీ నివ్వెర పోయేలా చేసింది. సభ ప్రారరంభమైన మూడు నిమిషాలకే అజెండాలో ప్రవేశపెట్టిన 41 అంశాలను ఆల్‌పాస్‌గా ప్రకటిస్తూ మమ అంటూ ముగించారు. దీంతో అందరూ అవాక్కయ్యారు. అయితే సమావేశం అనంతరం యథారాజా తథా ప్రజా అన్నట్లుగా వైసీపీ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు వారి కౌన్సిలర్‌లతో కలిసి అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్‌ను కలిసి కమిషనర్‌పై ఫిర్యాదు చేశారు. అయితే ఇది ఎటువైపు మలుపు తిరుగుతుందో వేచి చూడాల్సిందే.

13న పూర్వ విద్యార్థుల సమావేశం

బల్లికురవ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ ఉన్నత పాఠశాలలో 1980లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం ఈ నెల 13వ తేదీన జరుగుతుందని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈసందర్భంగా అప్పట్లో తమకు చదువులు చెప్పిన గురువులను ఆహ్వానించి వారిని ఘనంగా సత్కరిస్తామని వారు తెలిపారు. 1980లో బల్లికురవ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎక్కడ ఉన్నా హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

విద్యుత్ చౌర్యంపై కఠిన చర్యలు



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ అధికారులు

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ ఈఈ జాన్ థామస్ పేర్కొన్నారు. మండల పరిధిలో బుధవారం విద్యుత్ శాఖ, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 34 బృందాలుగా ఏర్పడి 3101 సర్వీసులను తనిఖీలు చేశారు. ఈక్రమంలోనే 110 కేసులు నమోదు చేసి రూ.5.19లక్షల అపరాధ రుసుము విధించారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ బీటీ నాయక్, డీఈఈ హరి ప్రసాదరావు, రమేష్, ఏఈఈ భాస్కరరావు, ఏఈలు పాల్గొన్నారు.

ఆధునిక అభ్యుదయ దృక్పథం పెరగాలి

చినగంజాం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో మన పండగలు, సంప్రదాయాలు, ఆధునిక అభ్యుదయ ప్రజా దృక్పథం పెరగాలని ఊరూరా జన విజ్ఞాన, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఊరూరా జన విజ్ఞానం, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, ప్రజా సంఘాల ఐక్యవేదిక, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో రైల్వేగేటు సెంటర్‌లో ఊరూరా జన విజ్ఞానం మండల శాఖను బుధవారం ఆయ న ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు మార్కాపురం వెంకటరామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ వేలాది సంవత్సరాల చరిత్రలో పండుగల ఉత్సవాలు మన సంస్కృతిలో ముఖ్య భాగమన్నారు. ప్రకృతి ధరిత్రి పండుగలు, జాతీయ రాష్ట్ర దినోత్సవాలు, మతపరమైన పండుగలు మూడు రకాలుగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శీరామచంద్రమూర్తి, కేంద్ర కమిటీ సభ్యుడు దేవళ్ల వెంకయ్య, మండల కమిటీ సభ్యుడు బెల్లంకొండ రమేష్‌బాబు, ముప్వల వెంకటసుబ్బారావు, వెంకటకృష్ణారెడ్డి, మాచవరపు నటరాజ్, పిల్లి శ్రీనివాసరావు, వలివేటి శేఖర్, అట్ల అంజిరెడ్డి, మరుప్రోలు రత్నారెడ్డి పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో 83 మంది సభ్యత్వం నమోదు



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న వెంకటరత్నం

ఇంకొల్లు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ వెంకటరత్నం ఆధ్వర్యంలో ఇండియన్ రెస్‌క్రాస్‌లో 83 మందికి శాశ్వత సభ్యత్వం నమోదు చేసినట్లు వెంకటరత్నం తెలిపారు.ఈ మేరకు వారికి సభ్యత్వ నమోదు ధ్రువీకరణ పత్రాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బీఎస్ నారాయణ దుర్గాబట్ నుంచి పత్రాన్ని అందుకున్నారు. జీవిత సభ్యత్వ నమోదు నగదు మొత్తం రూ.91,300 చైర్మన్‌కు అందజేసారు. కార్యక్రమంలో ఆయన వెంట ఏఎస్‌వో పుష్పలత, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడు టి.ప్రసాద్‌రెడ్డి,జాషూవా నటరాజు పలువురు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన సాగర్ కవాత్

వాడరేవు(చీరాల), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సాగర తీరాన పోలీసుల కవాత్ అబ్బురపరిచింది. ఈ సందర్భంగా డీఎస్పీ ఎండీ మొయిన్, రూరల్ సీఐ శేషగిరిరావు మాట్లాడు తూ తీరంలో అల్లరి మూకల ప్రభావం, అపశ్రుతులు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బుధవారం వాడరేవు నుంచి చినగంజాం వరకు పోలీసులు, మెరైన్ పోలీసులు సాగర్ కవాత్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా మాక్ డ్రిల్ నిర్వహించి జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.గురువారం కూడా కవాత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రమేష్, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.



సాగర తీరాన కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వచ్చే విద్యాసంవత్సరం నాటికి వైఎన్‌వో ప్రభుత్వ పాఠశాలకు అనుమతులు

ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి

కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి కారంచేడు గ్రామంలోని వైఎన్‌వో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అన్ని అనుమతులు ఇవ్వనున్నట్లు గుంటూరు ఆర్‌జేడీ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం కారంచేడులోని పాఠశాల భవనాలను పరిశీలించారు. పాఠశాల జూన్ 12న ప్రారంభమయ్యేలా చూడాలని మాజీ ఎంపీపీ యార్లగడ్డ రాఘవయ్య అధికారులను కోరారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆయన అధికారులకు తెలియజేశారు. దీనిపై స్పందించిన ఆర్‌జేడీ 6 నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో బోధిస్తారని ఆర్‌జేడీ తెలిపారు. పాఠశాలలో విద్యా ర్థులను చేర్పించేలా గ్రామస్థులు సహకారం అందించాలని ఆయన కోరారు. యూపీ పాఠశాలలను ఆదర్శ పాఠశాలగా మార్చనున్నట్లు డీఈవో ఎస్. పురుషోత్తం తెలిపారు. పాఠశాలకు అవసరమైన తరగతి గదులను అప్పగించాలని సర్పంచ్ బాలిగ శివపార్వతి కోరారు. కార్యక్రమంలో చీరాల డిప్యూటీ డీఈవో జి.గంగాధరరావు, ఎంఈవో ఎంపీ సత్యన్నారాయణ, ఎంఈవో-2 మొలబంటి వెంకటేశ్వర్లు, సర్పంచ్ శివపార్వతి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఇటీవల ఉన్నత పాఠశాలకు నోచుకోని కారంచేడు, కోట్ల విలు చేసే భూములు, భవనాలు అప్పగించినా పట్టించుకోని అధికారులు అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై నంపై అధికారులు స్పందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, డీఈవో పురుషోత్తం

పూర్తికాని అదనపుతరగతి గదులు

- నాడు-నేడు కింద వైసీపీ హయాంలో చేపట్టి ఆగిన పనులు
- జూన్ నాటికి పూర్తయ్యేనా..?

మార్టూరు, ఏప్రిల్ 9 : గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన అనాలోచిత పనుల కారణంగా స్కూళ్లల్లో నాడు - నేడు కింద ప్రారంభించిన అదనపుతరగతి గదుల నిర్మాణాలు అర్థాంతరంగా నిలిచిపోయాయి. వాటిని పూర్తి చేసేందుకు నిధులు ఉన్నా గదుల నిర్మాణాలను మాత్రం పూర్తిచేయలేక పోయారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంతవరకు అదనపుతరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ఎలాంటి ప్రణాళికను రూపొందించలేదు. గత వైసీపీ పాలలో స్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నాడు - నేడు ఫేజ్-2 కింద నిధులను విడుదల చేశారు. అందులో భాగంగా మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ హైస్కూల్‌లో 23 అదనపు తరగతి గదులను నిర్మాణం చేసేందుకు సుమారు రూ.6కోట్ల నిధులను మంజూరు చేశారు. వాటిని పూర్తి చేసేందుకు ప్రతి స్కూల్‌కు నాడు - నేడు స్పెషల్ బ్యాంక్ ఖాతాను ఏర్పాటు చేశారు. వాటి ఖాతాలో సంబంధిత స్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు మంజూరైన నిధులను జమ చేశారు. అదే విధంగా అదనపు తరగతి గదుల నిర్మాణాల బాధ్యతను స్కూలు మేనేజిమెంట్ కమిటీకి కేటాయించారు. అయితే అప్పటి వైసీపీ స్కూల్ గదుల నిర్మాణాలకు అవసరమైన సిమెంటు, ఇనుము, ఇసుక తదితర వాటిని పంపిణీ చేయడానికి కొంతమంది కాంట్రాక్టర్లకు టెండర్లు ఇచ్చారు. ఆ కాంట్రాక్టర్లు స్కూల్‌లో నిర్మాణం చేసే గదులకు వాటిని సప్లయ్ చేసేవారు. కానీ అసెంబ్లీ ఎన్నికలకు 6 నెలలు ముందే వాటిని సక్రమంగా కాంట్రాక్టర్లు సరఫరా చేయకపోవడంతో ముఖ్యంగా, సిమెంటు, ఇసుకను సప్లయ్ చేకపోవడంతో స్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. తద్వారా గదుల నిర్మాణాలు కోసం తెచ్చుకున్న సిమెంట్ బస్తాలు కొన్ని స్కూళ్లలో ఉండగా, ఇప్పటికి అవి నాసిరకంగా మారిపోయాయి. ఈ విషయమై వైసీపీ పాలకులు చురుకుగా వ్యవహరించకపోవడంతో ఎన్నికల ముందు నాటికి పూర్తవ్వాల్సిన గదుల నిర్మాణాలు అలానే నిలిచిపోయాయి. నేటికీ ఆ స్కూళ్లకు చెందిన నాడు - నేడు ప్రత్యేక ఖాతాల్లో మండలంలో దాదాపుగా రూ.60లక్షల వరకూ ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తిగా నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణాలను ఏవిధంగా పూర్తి చేయాలో ఇంతవరకు స్పష్టమైన చర్యలు చేపట్టలేదు. కనీసం రాబోయే విద్యాసంవత్సరం జూన్ నాటికి గదుల నిర్మాణాలను పూర్తి చేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.



మార్టూరు సంపత్‌నగర్‌లో ప్రాథమిక పాఠశాలలో నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం



మార్టూరు జడ్పీ హైస్కూల్‌లో అసంపూర్తిగా నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం

రహదారులు అధ్వానం

వాడరేవు(చీరాల), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చీరాల - వాడరేవు రహదారి ఘోరంగా శిథిలావస్థకు చేరింది. పలుచోట్ల పెద్ద ఎత్తున గుంతలు పడి ప్రమాదాలకు రహదారులు కోరలు చాపి ఉన్నాయి. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో చిన్న, హెవీ వెహికల్స్ రాకపోకలు సాగిస్తుంటాయి. అంతేకాకుండా వాడరేవు, రామాపురానికి పర్యాటకుల సంఖ్య అధికమే. పైగా మార్గమంతా రాత్రయితే చీకటి మయం. విద్యుత్ దీపాలు లేనే లేవు. ఈక్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం కచ్చితంగా ఉంది. ఈ రహదారుల్లో ఎంతోమంది రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయారు. మార్గం చీకటిగా ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు అవగాహన లేమితో ప్రమాదాలు బారిన పడుతున్నారు. ఈక్రమంలో అధికారులు రహదారులకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతయినా ఉంది. పేరాల నుంచి వాడరేవు వరకు కూడా చాలానే గుంతలు ఉన్నాయి. రహదారి ప్రారంభం నుంచి హాయ్ రెస్టారెంట్ సమీపం, వాకావారి పాలెం వద్ద, కీర్తి వారి పాలెం వద్ద, వాడరేవుకు కూతవేటు దూరం వంటి ప్రాంతాల్లో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈక్రమంలో అధికారులు ప్రమాద నియంత్రణ చర్యలు చేపట్టాలి.



హాయ్ రెస్టారెంట్ సమీపంలోని వాడరేవు రహదారి



వాకావారిపాలెం వద్ద ప్రమాదకరంగా ఉన్న రోడ్డు



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద తొలగించిన ధ్వజస్తంభాన్ని బయటకు తెస్తున్న ఎక్స్‌కవేటర్

శింగరకొండలో ధ్వజ స్తంభం తొలగింపు

అద్దంకి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద ధ్వజ స్తంభాన్ని బుధవారం తొలగించారు. సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజ స్తంభం తొలగింపు పనులు ప్రారంభించారు. బుధవారం ధ్వజస్తంభాన్ని తొలగించి బయటకు మార్చారు. ధ్వజస్తంభం 4 దశాబ్దాల కిందట ఏర్పాటు చేయగా, ఆ సమయంలో భక్తులు ధ్వజ స్తంభ ప్రతిష్ఠ సమయంలో వేసిన 5 పైసలు, 10 పైసలు తదితర చిల్లర నాణేలు బయట పడ్డాయి. ఈవో తిమ్మానాయుడు, రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారుల పర్యవేక్షణలో ధ్వజ స్తంభం తొలగింపు పనులను పూర్తి చేశారు. మే 19న జరిగే మహాకుంభాభిషేకం నాటికి కొత్త ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరిగేలా పనులు ప్రారంభించారు.



4 దశాబ్దాల నాటి చిల్లర నాణేలు

శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామివార్లకు విశిష్ట పూజలు చేస్తున్న అర్చకులు

ఉప్పుటూరు (పర్చూరు), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉప్పుటూరు గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ చెన్న కేశవస్వామి వార్ల ఆలయంలో బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం బిందెతీర్థం, నిత్యహోమం, బలిహరణ, నిత్యపూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేశారు. ఇందుకోసం కార్యనిర్వాహక కార్యదర్శి దామా నాగేశ్వరరావు సారథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

మార్టూరు ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : త్వరలో ప్రకటించనున్న మెగా డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వై శ్రీనివాసరావు బుధవారం ప్రకటనలో కోరారు. అదేవిధంగా ప్రతి గ్రామ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు ఈ విషయంపై గ్రామాలలోని నిరుద్యోగులకు అవగాహన కల్పించాలని వారిని కోరారు.

డెయిరీకే ఎసరు

- పాలకేంద్రం భూములలో ప్లాట్లు
- పట్టించుకునే వారే లేకపోవడంతో బరితెగిస్తున్న రియల్టర్లు
- రూ.100 కోట్ల విలువైన స్థలాలు
- కైవసానికి కొందరి యత్నం
- ఆ ప్రాంతాన్ని పరిశీలించిన తహసీల్దార్

ఒంగోలుక్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాపు కాసేవారు లేకపోవడంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. కోట్ల విలువ చేసే డెయిరీ భూములను కొల్లగొట్టేందుకు సిద్ధమయ్యారు. పాలకేంద్రం కోసం సేకరించిన భూములలో పాగా వేసి అవన్నీ తమవి అని ప్రైవేటు వ్యక్తులు చెబుతున్నారు. కంచె దాటుకుని వచ్చి ఆయా భూములలో ఉన్న చెట్లను తొలగించడంతోపాటు ప్లాట్లు వేసేందుకు చూస్తున్నారు. అయితే విషయం తెలిసి అధికారులు స్పందించడంతో తాత్కాలికంగా పనులు నిలిచిపోయాయి. వివరాల్లోకి వెళితే.. ఒంగోలులో విజయ డెయిరీ పేరుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఓ వెలుగు వెలిగిన ఒంగోలు పాలకేంద్రం ప్రస్తుతం పట్టించుకునేవారు లేక కునారిల్లుతోంది. కోట్లాది విలువైన ఆస్తులు, భూములు ఉన్నాయి. అయితే వాటిని కాజేసేందుకు అనేకమంది పొంచి కూర్చున్నారు. పాలకేంద్రం కోసం అప్పట్లో 78.10 ఎకరాలు భూమిని సేకరించి డెయిరీని, ఉద్యోగుల క్వార్టర్లు నిర్మించారు. అందులోనే పాలపొడి ఫ్యాక్టరీని స్థాపించారు. కార్యకలాపాల నిర్వహించేందుకు కార్యాలయం, ఉద్యోగుల నివాసగృహాలు, పశుగ్రాసం కోసం కొంత భూమి ఉంది. మరి కొంత భూమిలో జామాయిల్ తోటలు వేశారు. ఇలా జిల్లాలో విజయ డెయిరీ పేరుతో సుమారు 50వేల మంది పాడిరైతులు సభ్యులుగా అర్థశతాబ్దానికిపైగా విలసిల్లింది. వైసీపీ వచ్చిన తర్వాత దానిని ప్రైవేటు సంస్థ అయిన అమూల్‌కు అప్పగించారు. అక్కడ ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులను బలవంతంగా ఉద్యోగ విరమణ చేయించారు. కొద్దిరోజుల తర్వాత నడపలేక డెయిరీని మూత వేయించారు. కర్నూల్ రోడ్డు పక్కనే ఉండటం, నగరానికి అత్యంత దగ్గరగా ఉండటంతో అక్కడ భూముల ధరలు నింగిని అంటుతున్నాయి. మొత్తం 78.10 ఎకరాల భూమి డెయిరీకి ఉంది. అయితే 2011లో డెయిరీ మొత్తం భూమిని సర్వే చేసి హద్దులు వేశారు. అలాగే అప్పటి కమిటీ చుట్టూ కంచే కూడా వేసింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం పట్టించుకునే లేకపోవడంతో ఇదే అదనుగా పాల కేంద్రం భూమలను కబ్జా చేసేందుకు కొందరు సిద్ధమయ్యారు.

పాల కేంద్రం భూముల వివరాలు

ఒంగోలు సహకార డెయిరీ కోసం అప్పట్లో పేర్నమిట్ట సమీపంలో కర్నూల్ రోడ్డు పక్కన 78.10 ఎకరాలు భూమిని సేకరించారు. రోడ్డు పక్కనే ఉన్న ఏడు ఎకరాలలో డెయిరీ నిర్మాణం చేశారు. ఉద్యోగుల నివాసాలు, ఇతర అవసరాల కోసం 12.10 ఎకరాలు కేటాయించారు. మిగిలిన భూమిలో 20 ఎకరాలు జామయిల్ తోట వేశారు. డెయిరీ వెనుక భాగం 19 ఎకరాలు, ముందుభాగం 20 ఎకరాలు ఇతర అవసరాల కోసం మిగులుగా ఉంది.

కంచే దాటి కబ్జాకు యత్నం

నాలుగు రోజుల క్రితం కొందరు వ్యక్తులు డెయిరీ కంచెను దాటి లోపలికి వచ్చి భూముల్లోని చెట్లను కొట్టారు. ట్రాక్టర్లతో రాత్రుళ్లు చదును చేస్తున్నారు. సర్వే నంబరు 140/1లో పాలకేంద్రం కోసం 5.27 ఎకరాలు భూసేకరణ చేసినట్లు రికార్డులు ఉన్నాయి. అయితే ఆ భూమిలో 2.37 ఎకరాల్లో గతంలో ప్లాట్లు వేశారని, 48 ప్లాట్లు వేయగా తాము కొనుగోలు చేసినట్లు సదరు వ్యక్తులు చెబుతున్నట్లు తెలిసింది. వారు తమ పేర్లు బయట పడకుండా ఆ భూమలు తమవే అంటూ వ్యవహారం నడుపుతున్నారు. వారే భూమిని చదును చేసినట్లు అధికారులు గుర్తించారు. అంతేకాదు మరో సర్వే నంబరులో కూడా సుమారు 5 ఎకరాలు చదును చేయడానికి చెట్లు పీకించారు. ఇలా పాలకేంద్రం భూములు కబ్జా చేసేందుకు దర్జాగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కబ్జాదారులు కైవసం చేసుకోవాలనుకునే భూముల విలువ సుమారు రూ.100 కోట్ల వరకు ఉంటుదని అంచనా. అయితే విషయం తెలిసి మంగళవారం సంతనూతలపాడు తహసీల్దార్ ఆదిలక్ష్మి రెవెన్యూ సిబ్బందితో కలిసి వెళ్లి భూములను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను నిలిపివేయించారు. ఆ భూములకు సంబంధించి హక్కుపత్రాలు ఉంటే తనకు వచ్చి చూపాలని ఆదేశించారు. అయితే ఇంతవరకు ఎవరు తహసీల్దార్ ముందుకు రాకపోవడం గమనార్హం.

భూమిని పరిశీలించాం: తహసీల్దార్ ఆదిలక్ష్మి

డెయిరీ భూములలో కొంతమంది తమకు ప్లాట్లు ఉన్నాయని చదును చేస్తున్నారని సంతనూతలపాడు తహసీల్దార్ ఆదిలక్ష్మి తెలిపారు. అయితే సర్వే నంబరు 140/1లో తమకు హక్కులు ఉన్నాయని చెప్పారని, ఇంతవరకు హక్కు పత్రాలు తీసుకు రాలేదని చెప్పారు. పాలకేంద్రం సీఈఓ ఈ విషయం జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. అయితే ప్రస్తుతం అక్కడ చదును చేసే పనులను నిలిపివేశామన్నారు.

పశ్చిమ బైపాస్ రోడ్డు నిర్మాణంపై దృష్టి

ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా పశ్చిమ బైపాస్ రోడ్డు నిర్మాణంపై దృష్టిపెట్టినట్లు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బుధవారం సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలను తగ్గించడంతోపాటు గ్రానైట్ రవాణా చేసే వాహనాలను నగరం వెలుపల నుంచి మళ్లించేలా త్రోవగుంట నుంచి పెళ్ళూరు వరకు పశ్చిమ వైపున బైపాస్ రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలతో పాటు భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకొని ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అందుకోసమే ప్రాథమికంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాదే పనులు ప్రారంభించేలా ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సంబంధిత శాసన సభ్యులతో సంప్రదించి తుది నిర్ణయం తీసుకుంటామని మాగుంట తెలిపారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ మాట్లాడుతూ ఎస్ఎన్‌పాడులో ట్రాఫిక్ రద్దీని, గ్రానైట్ రవాణా చేసే పెద్ద వాహనాలా రాకపోకలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను రూపొందించేటప్పుడు ఆయా అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా నిర్మాణ వ్యయం, సామాజిక, పర్యావరణ, ఇంజనీరింగ్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదనలు రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, జేసీ ఆర్.గోపాలకృష్ణ, మేయర్ గంగాడ సుజాత, అధికారులు చిరంజీవి, వెంకటనాయుడు, దేవానంద్, బాలశంకరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులు

- కంకరపై ప్రయాణం చేయలేక అవస్థలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు
- ఇదీ పంగులూరు, తూర్పు కొప్పెరపాడు మధ్య రహదారి పరిస్థితి



పంగులూరు, తూర్పు కొప్పెరపాడు మధ్య తారు వేయకుండా వదిలేసిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

పంగులూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పంగులూరు, తూర్పు కొప్పెరపాడు గ్రామాల మధ్య ఆర్ అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులు అర్ధంతరంగా నిలిపి వేశారు. ఈ రెండు గ్రామాల మధ్య రోడ్డుకు ఏర్పడిన గుంతలు పూడ్చేందుకు మూడు నెలల కిందట చేపట్టిన మరమ్మతు పనులు అసంపూర్తిగా నిలిచి పోవడంతో ప్రజలు రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. బీటీ, రోడ్డుకు ఏర్పడిన గుంటలు సరి చేసేందుకు ఎక్స్‌కవేటర్‌తో పైభాగం మొత్తం లేపేసి తారు వేసేందుకు కంకర పరిచారు. ఈకంకరపై డస్ట్‌వేసి నీటితో తడిపి చదును చేయకుండా పనులు నిలిపేశారు. పొలం పనుల కోసం నిత్యం రాకపోకలు సాగించే తూర్పు కొప్పెరపాడు, పంగులూరు గ్రామాల రైతులు, వ్యవసాయ కూలీలు మండల కేంద్రానికి పలు పనుల నిమిత్తం వెళ్లే వారి బాధలు వర్ణణాతీతం. నెలల తరబడి పనులు నిలిచి పోవడం, పొడి బారిన కంకరపై వేగంగా నడిచే వాహనాల తాకిడికి రోడ్డును కమ్మేస్తున్న దుమ్ముతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల వేగానికి చెదిరిన కంకర రాళ్లు చెదిరి పడి గాయాలపాలవుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు వాహనాలు పట్టీ కొట్టి ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు అనేకం రోజూ జరుగుతున్నాయి. ప్రజలు తాము పడుతున్న ఇబ్బందులను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు విన్నవించగా, నిలిచిన మరమ్మతు పనులు తక్షణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించి నెలలు గడుస్తున్నా పురోగతి లేని పరిస్థితి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు సాగించలేక ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని నిలిచిన రోడ్డు మరమ్మతు పనులను తక్షణమే పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఈ ప్రాంత ప్రజలు వేడుకుంటున్నారు.

బస్సు ప్రమాద బాధితులకు ఎక్స్‌గ్రేషియా విడుదల

- ఒక్కో బాధిత కుటుంబానికి రూ.15 లక్షలు మంజూరు
- క్షతగాత్రులకు రెండున్నర లక్షలు
- సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఏలూరి ధన్యవాదాలు

పర్చూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పసుమర్రు చిలకలూరిపేట మధ్య గత ఏడాది మేలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం బుధవారం ఎక్స్‌గ్రేషియా విడుల చేసింది. బస్సు ప్రమాద బాధిత కుంటుంబాలను ఆదుకొని అండగా నిలవాలని ఇటీవల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి లేఖను అందజేశారు. ఇటీవల చినగంజాం పర్యటనలో ఈ అంశాన్ని ఎమ్మెల్యే ఏలూరి మరోసారి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన సీఎం బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాధిత కుటుంబాల ఖాతాలో నేరుగా జమ చేస్తున్నట్లు సీఎంవో నుంచి వెల్లడించారు. బస్సు ప్రమాదంలో చినగంజాం మండలం నీలాయపాలెంకు చెందిన కాశీ బ్రహ్మేశ్వరరావు, లక్ష్మి, ఖ్యాతి (శ్రీసాయి), గొనసపూడికి చెందిన దావులూరి శ్రీనివాస్ మృతి చెందారు. మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.15లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.2.50లక్షల చొప్పున విడుదల చేశారు. వారిలో ముప్పరాజు దుర్గాపూజ, ముప్పరాజు వెంకట సుబ్బారావు, దొప్పలపూడి భావన, దావులూరి అంజమ్మకు ఎక్స్‌గ్రేషియా నగదు వారి ఖాతాలో జమకానున్నాయి. బాధిత కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు చూపిన చొరవ పట్ల ఎమ్మెల్యే ఏలూరి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే కొండయ్య



ప్రజా దర్బార్‌లో అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా నివేశన స్థలాలు - 80, పెన్షన్ - 45, రేషన్ కార్డులు - 25 అర్జీలు అందినట్లు చెప్పారు. ప్రాధాన్యతాక్రమంలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కొద్ది రోజుల్లో నియోజకవర్గంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూసీ ఆధ్వర్యంలో జరిగే ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, అర్జీదారులు పాల్గొన్నారు.



నంబూరిపాలెంలో కమ్యూనిటీ హాల్ ముందు పూడిపోయిన సైడ్ డ్రైన్‌లో పూడికతీతను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్ర

మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు

అద్దంకి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సైడ్ డ్రైన్‌లలో మురుగు నీరు నిల్వ ఉండకుండా ప్రవహించేలా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. అద్దంకి పట్టణంలోని నంబూరిపాలెం, ఆర్టీసీ కాలనీ, న్యూ ఎస్‌బీఐ కాలనీ, నాగులపాడు రోడ్డు తదితర ప్రాంతాలలో బుధవారం కమిషనర్ రవీంద్ర పరిశీలించారు. నంబూరి పాలెం లో కమ్యూనిహాల్ ముందు డ్రైన్ పూడిక తీయించారు. న్యూ ఎస్‌బిఐ కాలనీ నుండి నాగులపాడు రోడ్డులో కల్యాణ మండపం వరకు సైడ్ డ్రైన్ నిర్మాణాన్ని పరిశీలించారు. న్యూ ఎస్‌బీఐ కాలనీలో సైడ్ డ్రైన్ పై ఉన్న ఆక్రమణల తొలగించడాన్ని పరిశీలించారు.

పనిదినాలను కూలీలు వినియోగించుకోవాలి



పంగులూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జె.పంగులూరు మండలానికి ఉపాధి హామీ పథకం ద్వారా కేటాయించిన పనిదినాలను కూలీలు వినియోగించుకోవాలని ఏపీవో సంతోషం విజ్ఞప్తి చేశారు. బుధవారం పంగులూరులో విలేకరులతో మట్లాడుతూ మండలానికి ఈ ఆర్థిక సంవత్సరంలో 3,65,058 పనిదినాలు మంజూరైనట్లు తెలిపారు. ఉపాధి కూలీలు పనులను వినియోగించుకోవాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి పథకం పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఉదయం సమయంలో పనికి రాలేని వారు సాయంత్రం 3 గంటల నుంచి ఆరు గంటల వరకు పని చేసుకునే వీలుందన్నారు. ఏప్రిల్, మే, జూన్‌లో పనులు జరుగుతాయని తెలిపారు. పనులకు వచ్చేవారు ఆయా గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్లను కలసి డిమాండ్ ఇవ్వాలని, ఆ విధంగా డిమాండ్ ఇచ్చిన వారు పనిలో పాల్గొనవచ్చని ఏపీవో సంతోషం తెలిపారు.

అమ్మ ఆశ్రమంలో అన్నదానం

మార్టూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అమ్మ ఆశ్రమం 6 వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆశ్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకుడు రావుల బాపయ్య, కోలలపూడి పశువైద్యాధికారి మాధవీలత కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు స్వీట్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు గుంటుపల్లి చందు పాల్గొన్నారు.

పారదర్శకంగా పెన్షనర్‌ల సేవలు



సయ్యద్ నిజాముద్దీన్, ఎస్టీవో

చీరాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఎటువంటి వివాదాలకు చోటివ్వకుండా పెన్షనర్స్ బిల్లుల విషయంలో సేవ్వందించనున్నట్లు ఎస్టీవో సయ్యద్ నిజాముద్దీన్ పేర్కొన్నారు. ఉద్యోగోన్నతిపై బాధ్యతలు స్వీకరించిన ఎస్టీవో మాట్లాడుతూ గతంలో వెయ్యికి పైగా లైఫ్ సర్టిఫికెట్‌లు పెండింగ్ ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య సుమారు 100కి పైగా మాత్రమే ఉన్నట్లు వివరించారు. సేవల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండరాదని సిబ్బందికి నిజాముద్దీన్ సూచించారు.

నిందితుడు పరారీకి యత్నం

- చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్న పోలీసులు
- గతంలో హత్య కేసుతో సంబంధం

చీరాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : దొంగతనం కేసులో పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి పరారీకి యత్నించాడు. దీంతో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పొదిలి సర్కిల్ పరిధిలోని మర్రిపూడికి చెందిన బాలకోటిరెడ్డి బుధవారం రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తి వద్ద ఫోన్ అపహరించాడు. దీంతో వెంటనే విధుల్లో ఉన్న పోలీసులు గ్రహించి అతడిని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. ఈక్రమంలో కొద్దిసేపు పోలీసులు వారి పనుల్లో నిమగ్నమైన సమయంలో పోలీసులు కళ్లు గప్పి పారిపోయేందుకు నిందితుడు స్టేషన్ నుంచి బయటకు పరుగులంకించాడు. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు అతడిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం అపహరించిన సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కౌన్సెలింగ్ నిర్వహించి పంపేశారు. బాలకోటిరెడ్డి గతంలో అతని అక్క ఊరు ముండ్లమూరులో క్రికెట్ ఆడుతూ నెలకొన్న వివాదంలో ఒక వ్యక్తిని ఆవేశంతో బ్యాట్‌తో దాడి చేసిన కేసులో బాలకోటిరెడ్డి నిందితుడు.

లారీ ఢీకొని బిచ్చగాడు మృతి

మేదరమెట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రప్రదేశ్) : నార్కెట్‌పల్లి - మేదరమెట్ల రాష్ట్రీయ రహదారిలో వెళ్తున్న లారీ మేదరమెట్ల పైలాన్ ఫ్లైవోవర్ సెంటర్‌లో బిచ్చగాడిని ఢీకొంది. బుధవారం హైదరాబాద్ నుంచి చెన్నై వైపు వెళ్తున్న లారీ ఫ్లైవోవర్ వద్ద అకస్మాత్తుగా అడ్డం వచ్చి గుర్తుతెలియని బిచ్చగాడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని 108లో ఒంగోలు తరలించారు. అప్పటికే అతను చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఎస్‌ఐ మహ్మద్ రఫి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

అద్దంకి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజు అన్నారు. పట్టణంలోని భవానీ సెంటర్‌లో బుధవారం రాత్రి సీఐ సుబ్బరాజు తనిఖీలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ప్రతి రోజు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేస్తామని తెలిపారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

అద్దంకి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఖాదర్‌బాషా అన్నారు. హెల్మెట్ వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాలపై ద్విచక్రవాహన చోదకులు బుధవారం పట్టణంలోని మేరమెట్ల రోడ్డులో అవగాహన కలిగించారు. ప్రధానంగా ప్రమాదం జరిగిన సమయంలో హెల్మెట్ ధరించడం ద్వారా తలకు గాయాలు కాకుండా బయట పడవచ్చన్నారు. దీంతో ప్రాణాపాయం నుండి బయట పడే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనం నడపాలన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడుపుతూ పట్టుబడితే అపరాధ రుసుం విధించడం జరుగుతుందన్నారు.



హెల్మెట్‌తో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న ఎస్సై ఖాదర్‌బాషా



పుస్తకావిష్కరణలో పాల్గొన్న రచయిత రాజా, ఎన్‌యూ వర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ సాంబశివరావు, పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళి

ద్రోణాదుల గ్రామ చరిత్ర పుస్తకావిష్కరణ

మార్టూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల గ్రామంలోని గోపు లక్ష్మీనారాయణ తులశమ్మ కల్యాణ మండపంలో బుధవారం పెంటేల రాజా రచించిన ద్రోణాదుల గ్రామ చరిత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు విశ్రాంత లెక్చరర్ కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు చేతుల మీదగా, మరి కొంతమంది అతిథుల సమక్షంలో పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ మూడువేల సంవత్సరాల ద్రోణాదుల గ్రామ చరిత్రను రచయిత రాజా 200 పేజీలలో సమకూర్చడం అభినందనీయమన్నారు. మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన శాశన పరిశోధకులు జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ గ్రామంలో వెయ్యి సంవత్సరాలు కిందటే ద్రోణాదులమ్మ లాంటి గ్రామ దేవతలకు, చెన్నకేశవ, శివాలయం,రాయాలయాల నిర్మాణం జరిగినట్లు రచయిత తన పుస్తకంలో రాయడం అభినందనీయమన్నారు. అనంతరం పెంటేల రాజాను అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో నాగబోయిన రంగారావు,అమరా రాజమోహనరావు, పెంటేల జగన్మోహనరావు, ఏపీ హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ దరియావలి, సుబ్బయ్య, రాజశేఖర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

మద్దతు ధరకు పంటలు అమ్ముకోవాలి



మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఎంఏవో

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధరకు రైతులు పంటలను అమ్ముకోవాలని వ్యవసాయాధికారి కాశీవిశ్వనాథ్ అన్నారు. బుధవారం చీరాల, వేటపాలెం, చినగంజాం మం డలాల పరిధిలోని పొలంబడి 2024-25 కార్యక్రమంలో భాగంగా సీడింగ్ అధికారి రాధాకృష్ణ, రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈవో ప్రదీప్ హాజరై విత్తనాల నమూనాలను సేకరించారు. అలాగే ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన భూసార పత్రాలను రైతులకు అందజేశారు. మొక్కజొన్న రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.

కూలీల సంఖ్య పెంచాలి

బల్లికురవ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచేలా సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో కుసుమకుమారి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం జరిగింది. వలసలు పోకుండా కూలీలకు గ్రామాలలోనే పనులు కల్పించాలన్నారు. నీటి తొట్లను వెంటనే నిర్మించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఏపీవో రమాదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో గ్రానైట్ వ్యర్థాలు వేస్తే చర్యలు

- మల్లాయపాలెంలో ప్రభుత్వ భూములను పరిశీలించిన ఆర్డీవో, మైనింగ్ ఏడీ



మల్లాయపాలెంలో గ్రానైట్ క్వారీల వద్ద రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్

బల్లికురవ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాల్లో గ్రానైట్ వ్యర్థాలను వేస్తే చర్యలు తప్పవు అని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు హెచ్చరించారు. బుధవారం మండలంలోని మల్లాయపాలెం గ్రామ పరిధిలో ఉన్న పలు గ్రానైట్ క్వారీలు వేసి డంపింగ్‌లను ఆర్డీవో బాపట్ల మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ పరిశీలించారు. మల్లాయపాలెం గ్రామానికి చెందిన లేమాటి హనుమంతురావు అనే వ్యక్తి కాలవ కట్టను పూడ్చి వ్యర్థాలు వేశారని హైకోర్టు ద్వారా ఫిర్యాదులు చేయగా అధికారులు డంపింగ్ వేసిన స్థలాలను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలను రైతులను ఇబ్బందులు చేస్తే క్వారీల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తిస్థాయి పరిశీలనతో త్వరలో నివేదిక తయారు చేస్తామని వారు తెలిపారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ రవినాయక్, మైనింగ్, రెవెన్యూ సర్వేయర్లు నాగలక్ష్మి, కిషోర్‌బాబు, చంద్ర పాల్గొన్నారు.

ఆర్ణా గ్రానైట్ క్వారీని మరో సారి పరిశీలించిన అధికారులు

మల్లాయపాలెం గ్రామంలో ఉన్న ఆర్ణా గ్రానైట్ క్వారీని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ మరో మారు పరిశీలించారు. దారిని ఆక్రమించారని వచ్చిన ఫిర్యాదుల మేరకు గతంలో ఒక సారి అధికారులు పరిశీలించారు. మరలా రికార్డులను పరిశీలించేందుకు అధికారులు క్వారీని తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రికార్డుల ప్రకారం ఎలా ఉంటే అలా ముందుకు వెళతామని స్పష్టం చేశారు.



రేపు యోగ ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

బల్లికురవ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూకట్లపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగ్గుల కొండ యోగ ప్రసన్నాంజనేయస్వామి వారి వార్షిక తిరునాళ్ల శుక్రవారం జరుగనున్నట్లు ఆలయ ధర్మకర్త తాళ్ల శివశంకర్‌రెడ్డి తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభలు, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశామని ఆలయ నిర్వాహక కమిటీ తెలిపారు. భక్తుల కోసం అన్ని వసతులు కల్పించినట్లు చెప్పారు.

రాతి మండపానికి రూ.లక్ష విరాళం

అద్దంకి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణానికి చినగంజాంకు చెందిన శంకరమంచి హనుమంతరావు దంపతులు బుధవారం రూ.1,00,011 విరాళాన్ని ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. అనంతరం హనుమంతరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఈవోకు విరాళాన్ని అందజేస్తున్న దాత

13న గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

అద్దంకిటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష ఈ నెల 13వ తేది జరుగుతుందని అద్దంకి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గాయత్రి బుధవారం ఒ క ప్రకటన ద్వారా తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు 5వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30 గంటల వరకు ఇంటర్ మీడియట్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ధరకాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత వెబ్ సైట్‌లో హాల్ టిక్కెట్‌లను డౌన్ లోడ్ చేసుకోవాలని, పరీక్ష కేంద్రాలనికి హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైన గుర్తింపు కార్డు ఆధార్ వంటిది వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

ఉచిత చలివేంద్రాన్ని వినియోగించుకోవాలి

ఈవోఆర్డీ సత్యనారాయణ



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

నూతలపాడు (పర్చూరు), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం నూతలపాడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఆవోఆర్డీ కొసనా సత్యనారాయణ కోరారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నయ్య, కార్యదర్శి కృష్ణమోహన్, టీడీపీ నాయకులు విన్నకోట సతీష్, శ్రీహరి, రామ సుబ్బారావు, శేఖర్, గణేష్, వాసు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

28 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



ఆటోలో పట్టుబడిన రేషన్ బియ్యం

ఇంకొల్లు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సంతరావూరు నుంచి అద్దంకి తరలిస్తున్న రేషన్ బియ్యం బస్తాలను పోలీసులు మండల పరిధిలోని గొల్లపాలెం రోడ్డులో పట్టుకున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. సుమారు 50 కిలోలు కలిగిన 28 బస్తాలను లగేజి ఆటోలో తరలిస్తుండగా గుర్తించి సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	36.1	26.9
కావలి	35	26
ఆత్మకూరు	36	25
ఉదయగిరి	37	25
కందుకూరు	36	27





ప్రధాన రైల్వేస్టేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ప్రధాన భవనం



స్టేషన్‌లో ప్లాట్‌ఫారంపై నిర్మాణాలు

నయా స్టేషన్ ఆగయా


- సకల సౌకర్యాలతో ముస్తాబవుతున్న నెల్లూరు రైల్వేస్టేషన్
- పునరాభివృద్ధి పథకం ద్వారా రూ.102 కోట్లతో పనులు
- మరో రెండు నెలల్లో పూర్తిగా అందుబాటులోకి..

నెల్లూరు (వెంకటేశ్వరపురం) ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు దాదాపు పూర్తికావొచ్చాయి. స్టేషన్‌కు తూర్పు, పడమర రెండు వైపులా అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. పునరాభివృద్ధి పథకం ద్వారా సుమారు రూ.102 కోట్లతో జరుగుతున్న ఈ పనులు 80 శాతం పూర్తవగా, రెండు నెలల్లో సంపూర్ణంగా పూర్తి చేయనున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రైల్వేస్టేషన్లలో ప్రధానంగా నెల్లూరు రైల్వేస్టేషన్ ఒకటి. నిత్యం 30వేల మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. స్టేజ్-3లో ఉన్న నెల్లూరు స్టేషన్‌ను అభివృద్ధి చేసేందుకు 2019లో అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రైల్వేమంత్రి పియూష్ గోయల్ పనులకు శంకుస్థాపన చేశారు. అయితే కరోనా ఇతర కారణాల వల్ల ఈ పునరాభివృద్ధి పనులను 2022లో ప్రారంభించారు. ఈపీసీ విధానంలో హైదరాబాద్‌కు చెందిన మెస్సర్స్ ఎస్‌సీఎల్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ సంస్థ ఈ పనులు చేపట్టగా, 2024, మే నెలాఖరుకల్లా పూర్తి చేయాలన్న లక్ష్యం పెట్టుకొన్నారు. అయినా ఇప్పటికీ సాగుతున్నాయి. 2025, జూన్ నెలకల్లా పూర్తిచేయాలన్న లక్ష్యంతో పనులు వేగంగా జరుగుతున్నాయి.



ప్రత్యేకతలు ఇవీ..

నెల్లూరు స్టేషన్‌లో తూర్పు, పడమర వైపు రెండు మార్గాలు ఉన్నాయి. స్టేషన్‌లో నాలుగు ప్లాట్‌ఫారాలు కలుపుతూ అండర్ పాస్‌ను నిర్మించారు. ఇది ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. అదేవిధంగా నాలుగు ప్లాట్‌ఫారాలను కలుపుతూ నిర్మిస్తున్న విశాలమైన ఎయిర్ కాంకోర్స్ పూర్తికావస్తోంది. దీనివల్ల ఎంతోమంది ప్రయాణికులు ఒకేసారి రాకపోకలు సాగించవచ్చు.



రైల్వే ప్రయాణికులకు సరికొత్త ప్రపంచం



అండర్‌పాస్ ఇదే..

దీనికి అనుసంధానంగా నాలుగు లిఫ్టులు, మరో నాలుగు ఎస్కలేటర్లు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా రెండు వైపులా మూడంతస్తుల భవనాలు రెండింటిని నిర్మిస్తున్నారు. వీటిలో వాణిజ్య సముదాయాలు, ప్రయాణికుల విశ్రాంతి గదులు, రైల్వే సిబ్బందికి అనుకూలంగా గదులు, రైల్వే కార్యాలయాలు ఉంటాయి. అలాగే పడమర వైపు రైల్వేకోర్టు, జీఆర్‌పీ కార్యాలయాలు కూడా నిర్మాణంలో ఉన్నాయి. స్టేషన్‌లో అన్ని ప్లాట్‌ఫారాల పొడవును ఆత్మకూరు బస్టాండ్‌వైపు పెంచారు. ప్లాట్‌ఫారాలను మార్బుల్స్‌తో అందంగా తీర్చిదిద్దుతున్నారు. స్టేషన్‌లో ఎల్‌ఈడీ స్ర్కీన్‌లు, డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఇక స్టేషన్‌కు సరిపడినంత నీటి నిల్వల కోసం 6లక్షల లీటర్ల సామర్థ్యంతో గ్రౌండ్‌లెవల్ రిజర్వాయర్ నిర్మించారు. ఇలా అన్ని నిర్మాణాలు పూర్తయ్యాక రైల్వేస్టేషన్ మొత్తం పచ్చదనం నింపేందుకు మొక్కలను కూడా పెంచనున్నారు. మొత్తానికి పునరాభివృద్ధి పనులతో నెల్లూరు రైల్వేస్టేషన్ రూపురేఖలు మారిపోతున్నాయి. ఇప్పటిదాకా ఉన్న స్టేషన్ వేరు.. రానున్న రెండు నెలల తర్వాత స్టేషన్‌వేరు అన్నస్థాయిలో ముస్తాబవుతోంది.

జూనియర్ కళాశాలల

ప్రిన్సిపాళ్ల సమావేశం నేడు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద నడు స్తున్న జూనియర్ కళాశాలల ప్రధాన అధ్యా పకుల సమావేశాన్ని గురువారం నెల్లూరు లోని డీకేడబ్ల్యూ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలల యూడైస్ ప్లస్ డేటా ను పూర్తి చేయడం, మాదక ద్రవ్యాల విని యోగానికి వ్యతిరేకంగా కళాశాలల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయడం తదితర అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవ త్సరంలో ప్రవేశపెడుతున్న వివిధ సంస్కర ణలపై అవగాహన కల్పిస్తామని, ప్రిన్సిపాళ్లు అందరూ ఉదయం 10 గంటలకు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

నేటితో టెన్త్ మూల్యాంకనం పూర్తి

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాం కనం గురువారంతో పూర్తికానుంది. తొలుత ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈనెల బుధ వారంతో మూల్యాంకనాన్ని పూర్తి చేయాల్సి ఉంది. అయితే రంజాన్ పండుగ నేపథ్యంలో సోషల్ పరీక్షను ఒకరోజు ఆలస్యంగా నిర్వ హించడంతో మూల్యాంకనం కూడా ఒకరోజు ఆలస్యమవుతోంది. నగరంలోని పొదలకూ రు రోడ్డు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 3 నుంచి స్పాట్ వాల్యూయేషన్ జరుగుతున్న విషయం విదితమే. జిల్లాకు 1,90,520 జవాబు పత్రాలు రావడంతో మూల్యాంక నానికి రెండు వేల మందిని నియమించారు. ఓఎంఆర్‌లో పార్ట్-3 పత్రాలను బండిల్స్ చేసి ఏరోజుకారోజు విజయవాడలోని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖకు పంపించారు.

సీజన్ వస్తోంది..

పూడికతీత ఎప్పుడో!?



ఇందుకూరుపేట : ఆరో మైలు వద్ద పూడిక, గుర్రపు డెక్కతో నిండిపోయిన గంగపట్నం కాలువ

నెల్లూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రెండో పంట సీజన్ మొదలైనా కాలువల్లో మాత్రం పూడిక తొలగడం లేదు. వారం రోజుల్లో ఐఏబీ నిర్వహించి, వచ్చే నెల 1వ తేదీ నుంచి నీటిని విడుదల చేయాలని ప్రణాళిక రూపొందించుకున్నారు. అయినా ఇంతవరకూ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ ఎం) పనులకు అనుమతులు లభించలేదు. దీంతో ఎప్పుడు పనులు చేస్తారని.. రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

- వచ్చే నెల 1 నుంచి రెండో పంటకు నీరు విడుదల
- ఉమ్మడి జిల్లాలో ఐదు లక్షల ఎకరాల్లో సాగుకు అవకాశం
- మొదలుకాని కాలువల్లో పూడికతీత పనులు
- ఇంతవరకూ ఓఅండ్‌ఎం వర్కులకు రాని అనుమతులు

రెండేళ్ల తర్వాత ఇప్పుడు రెండో పంట సాగు జరుగుతోంది. గతేడాది పుష్కలంగా వర్షాలు కురవడంతో మొదటి పంటకు పోను ఇంకా సోమశిల, కండలేరు జలాశయాల్లో 50 టీఎంసీలకుపైగా నీరు అందుబాటులో ఉంది. ఈ నీటితో రానున్న సీజన్‌లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఐదు లక్షల ఎకరాల్లో సాగుకు నీరిచ్చేందుకు నిర్ణయించారు. ఒక్క సోమశిల కిందనే 3.70 లక్షల ఎకరాలకు సాగునీటి కేటాయింపులు జరిపేలా ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ ప్రతిపాదనలను సాగునీటి సలహా మండలి సమావేశంలో ఆమోదించడమే తరువాయి. మే 1 నుంచి నీటిని విడుదల చేస్తే గానీ సెప్టెంబరులోపు వరికోతలు పూర్తికావు. ఆ తర్వాత వర్షాకాల సీజన్ మొదలవుతుంది. దీంతో రైతాంగం రెండో పంటకు సన్నద్ధమవుతోంది. మొదటి పంట పూర్తి కాగా ఆ సమయంలో నీటి పారుదలతో కాలువలు పూడిక, గుర్రపుడెక్కతో నిండిపోయాయి. నీటి విడుదల మొదలుపెట్టేలోపు ఈ కాలువల్లో పూడిక తొలగించాల్సి ఉంది.

ఇందుకుగానూ ఇరిగేషన్ అధికారులు ఓఅండ్ఎం పనుల కోసం రూ.144 కోట్లతో 1419 వర్కులను ప్రతిపాదిస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపారు. అయితే ఈ ప్రతిపాదనలకు ఇంతవరకూ ఆమోద ముద్ర లభించలేదు. మొదటి పంట సమయంలో కూడా ఓఅండ్ఎం పనులకు రూ.110 కోట్లతో ప్రతిపాదనలు పంపినా చివరకు రూ.38 కోట్లకే అనుమతులు లభించాయి. అప్పుడు కూడా అనుమతులు ఆలస్యం కావడంతో చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. అయితే గత సీజన్‌లో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకోవాల్సిన అధికారులు.. అవేవీ పట్టించుకోవడం లేదు. కాలువల్లో నీరు సాఫీగా పారకపోతే చివరి ఆయకట్టు వరకూ నీరందడం కష్టంగా మారుతుంది. ఇప్పటికిప్పుడు అనుమతులు ఇస్తే గానీ నీరు విడుదల చేసే నాటికి కాలువలను బాగు చేయడం సాధ్యపడదు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా కాలువల్లో పూడికతీతపై సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజును వివరణ కోరగా రెండో పంటకు సంబంధించి ఓఅండ్ఎం పనుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఇంకా అనుమతులు రాలేదని, రాగానే రైతులకు ఇబ్బందులు లేకుండా పనులు మొదలుపెడతామని పేర్కొన్నారు.

కాకాణి

అజ్ఞాతం వీడేనా!?

నెల్లూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి గడిచిన రెండు వారాలుగా అజ్ఞాతంలో ఉన్నారు. క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసులో కాకాణిని నిందితుడిగా చేర్చినప్పటి నుంచి పత్తా లేకుండా పోయారు. విచారణకు రావాలంటూ మూడుసార్లు పోలీసులు నోటీసులు ఇచ్చేందుకు వెళ్లినా ఎక్కడా కాకాణి జాడ కనిపించలేదు. పోలీసుల విచారణకు కూడా హాజరుకాలేదు. అక్రమ మైనింగ్ కేసులో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. అయితే తాజాగా అక్కడ గోవర్ధన్‌రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. దీంతో కాకాణి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. మరి ఇప్పటికైనా ఆయన అజ్ఞాతం వీడి బయటకు వస్తారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు పోలీసులు కూడా కాకాణి కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. కొన్ని బృందాలు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ప్రాంతాల్లోనూ తిరిగినప్పటికీ కాకాణి ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన వ్యవహారశైలి తీవ్ర విమర్శలకు తావిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగిన వ్యక్తి.. నేడు అక్రమాలు బయటకొచ్చే సరికి తప్పించుకొని తిరుగుతున్నాడంటూ చర్చించుకుంటున్నారు. కాగా మరోవైపు జిల్లాలోని వైసీపీ నాయకులు మాత్రం నిత్యం ప్రెస్‌మీట్లు పెడుతూ కాకాణి పారిపోలేదని చెబుతున్నారు. మరి ఆయనెక్కడున్నారో మాత్రం చెప్పడం లేదు. నిత్యం అధికార పార్టీ నేతలపై సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెడుతూ ఉండే కాకాణి.. గడిచిన వారం రోజులుగా ఒక్క మెసేజ్ కూడా పెట్టకపోవడం ఆయన పరారీలో ఉన్నారన్న ప్రచారానికి బలం చేకూరుస్తోంది.





రైల్వే శాఖలో ఆయనో రిటైర్డు ఉద్యోగి. పేరు జొన్నాదుల కోటేశ్వరరావు. నెల్లూరు నగరవాసి. విధుల్లో ఉన్నప్పుడే కాదు.. ఉద్యోగ విరమణ పొందాక కూడా ఆంధ్రజ్యోతి పత్రికను చదవడం ఆయన మాన లేదు. ఒకరకంగా చెప్పాలంటే కోటేశ్వరరావుకు ఆంధ్రజ్యోతి ఓ స్నేహితుడిగా మారిపోయింది. ఏళ్ల తరబడి తనను ఆదరిస్తున్న ఆంధ్రజ్యోతి కూడా తన స్నేహితుడికి మరపురాని బహుమతిని అందించింది. పాఠకుల కోసం ఈ ఏడాది ప్రవేశపెట్టిన 'కార్ అండ్ బైక్ రేస్' లక్కీడిప్‌లో విజేతగా నిలిపి కారును అందజేసింది. విజయవాడలో బుధవారం జరిగిన లక్కీడిప్‌లో కారు గెలుచుకున్నట్టు రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ స్వయంగా ఫోన్ చేసి అభినందించడంతో కోటేశ్వరరావు ఉబ్బితబ్బిబ్బయ్యారు.

- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)

మిత్రమా.. కారు అందుకో!

- 'ఆంధ్రజ్యోతి' చిరకాల పాఠకుడికి ఊహించని బహుమతి
- 'కార్ అండ్ బైక్ రేస్' విజేతగా నెల్లూరువాసి
- కోటేశ్వరరావును వరించిన అదృష్టం
- స్వయంగా ఫోన్ చేసి అభినందించిన మంత్రి అనగాని సత్యప్రసాద్

నెల్లూరులోని సంతపేట, నాలుగుకాళ్ల మండపం సమీపంలో జొన్నాదుల కోటేశ్వరరావు ఉంటున్నారు. ఈయనకు ఇద్దరు కొడుకులు, ఓ కుమార్తె సంతానం. రైల్వేశాఖలో టికెట్ ట్రావెలింగ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ 2006లో ఉద్యోగ విరమణ పొందారు. విధుల్లోనేకాదు.. రిటైర్డు అయినా కోటేశ్వరరావు మాత్రం ఆంధ్రజ్యోతి పత్రికను చదవడం మానలేదు. మార్కెట్‌లో పత్రికను కొనుగోలు చేసి ఇంటికి తీసుకొస్తుంటారు. తన తండ్రి తీసుకువచ్చి చదివి పక్కన పెట్టిన పత్రికలోని లక్కీడిప్ కూపన్లను చిన్న కుమారుడు రవి జాగ్రత్తగా కత్తిరించి వాటిని ఆంధ్రజ్యోతి కార్యాలయంలోని బాక్సులో వేసేవారు. ఎన్నో సంవత్సరాలుగా క్రమం తప్పకుండా కూపన్లను వేసి లక్కీడిప్ కోసం ఎదురుచూసేవారు. చివరకు రాష్ట్రంలో లక్షలాది మందిలో కార్ విజేతగా కోటేశ్వరరావు నిలిచారు.

సంతోషంగా కారులో తిరుగుతా

నాకు లక్కీడిప్‌లో కారు వస్తుందని కలలో కూడా అనుకోలేదు. నా కుమారుడు ప్రతి సంవత్సరం కూపన్లు కట్ చేసి ఆంధ్రజ్యోతి జిల్లా కార్యాలయానికి వెళ్లి బాక్సులో వేసి వచ్చేవాడు. ఈ క్రమంలోనే బుధవారం ఫోన్ చేసి కారు గెలుచుకున్నట్లు చెప్పగానే ఆశ్చర్యపోయాను. నాకు సైకిల్ తొక్కడం మాత్రమే వచ్చు. ఈ మధ్య ఆరోగ్యం సహకరించక పోవడంతో సైకిల్ తొక్కలేక పక్కన పెట్టేశాను. ఇప్పుడు నాకు దేవుడు ఆంధ్రజ్యోతి రూపంలో కారును ఇస్తున్నాడు. నా బిడ్డలు, మనమళ్లు, మనమరాళ్లతో కలిసి కారు ముందు సీటులో కూర్చొని నెల్లూరు అంతా తిరుగుతా. నా స్నేహితులతో కలిసి కారులో కూర్చొని ఆంధ్రజ్యోతిని చదువుతూ పత్రికలోని వార్తలు గురించి చర్చించుకుంటూ ఇది ఆంధ్రజ్యోతి నాకు ఇచ్చిన కారు అని అందరికీ చెప్పుకుంటా.

- కోటేశ్వరరావు, కారు విజేత, నెల్లూరు

ఎనలేని అభిమానం

కోటేశ్వరరావు ఉద్యోగం చేస్తున్నప్పుడే సమయం దొరికనప్పుడు ఆంధ్రజ్యోతి పత్రికను ఎంతో ఇష్టంగా చదివేవారు. పదవీ విరమణ పొందాక కూడా ఉదయం నిద్రలేచిన వెంటనే వాకింగ్‌కు వెళ్లి సంతపేట సెంటర్‌లో ఆంధ్రజ్యోతి పత్రికను కొనుగోలు చేసి ఇంటికి తీసుకువచ్చేవారు. పత్రికను పూర్తిగా చదివేవారు. అందులో వచ్చిన అంశాలను కూడా కుటుంబసభ్యులతో పంచుకునేవారు. స్నేహితులు ఇంటికి వచ్చిన సమయంలో ఏబీఎన్‌లో వార్తలు పెట్టుకొని వాటి గురించి చర్చించుకునేవారు. ప్రధానంగా ఆదివారం ఆంధ్రజ్యోతిలో వేమూరి రాధాకృష్ణ ప్రత్యేకంగా రాసే కొత్త పలుకులను కోటేశ్వరరావు ఆసక్తిగా చదువుతూ ఎంతోమందికి చెబుతూ ఉండేవారు. ఇలా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్‌లతో కోటేశ్వరరావుకు తెలియని బంధం ముడివేసుకుంది. ఇదిలా ఉండగా పెద్ద కుమారుడు గుండెపోటుతో మృతి చెందడం, భార్య చంద్రావతమ్మ అనారోగ్యంతో సంవత్సరం క్రితం మృతి చెందడంతో కోటేశ్వరరావు మరింతగా దిగాలు చెందారు. ఆ సమయంలోనే ఆంధ్రజ్యోతి పత్రికను చదువుతూ ఒంటరితనం నుంచి బయటకు రావడం ప్రారంభించారు.





చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	100
స్కిన్ చికెన్	184
స్కిన్‌లెస్	204

కోడిగుడ్ల ధర (100): 440

పాస్టర్ కుటుంబానికి న్యాయం చేయాలి

కలిగిరి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలంటూ మండలంలోని పాస్టర్లు బుధవారం కలిగిరమ్మ గుడి సర్కిల్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ మృతి వెనుక నిజానిజాలను వెలుగుతీసి వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలంటూ స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్, ముస్లిం మైనార్టీ నాయకులు తమ మద్దతు ప్రకటించారు.



న్యూస్ బాక్స్

రేపు డివిజన్‌స్థాయి టాలెంట్ టెస్టు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బడేవారిపాలెం ఎంపీపీ స్పెషల్ స్కూల్‌లో నేకునాంపురం అంబేడ్కర్ కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11న ఉదయం 10 గంటలకు టాలెంట్ టెస్టు నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్ఎం వలేటి మాలకొండయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ప్రభుత్వ పాఠశాలల్లో 4వ తరగతి చదివి గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు, సీఎంఆర్ షీట్‌పై పరీక్షలు రాసే విధానంపై అవగాహన కల్పించేందుకు ఈ టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నామని తెలిపారు. టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు మాలకొండయ్య తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కావలి నుంచి లింగసముద్రానికి మరో బస్సు

లింగసముద్రం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కావలి నుంచి ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు లింగసముద్రం గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజరు రావూరి శ్రీనివాసులు చెప్పారు. బుధవారం సాయంత్రం నుంచే ఈ బస్సును లింగసముద్రంకు నడుపుతున్నట్లు చెప్పారు. ఇంతకు ముందు కావలి డిపో నుంచి సాయంత్రం 4.30 గంటలకు లింగసముద్రంకు బస్సు వెళ్లిపోయిన తరువాత రాత్రి 8.15 గంటల మధ్యలో లింగసముద్రంకు బస్సు లేదన్నారు. అయితే ప్రజల వినతిని దృష్టిలో ఉంచుకొని కావలి నుంచి కొండాపురం మండలంలోని కొత్తపేట వరకు ఉన్న బస్సు సర్వీసును లింగసముద్రంకు పొడిగించినట్టు ఆయన తెలిపారు. దీనివల్ల ఆ గ్రామ ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని, ఈ బస్సు సౌకర్యాన్ని ప్రజల వినియోగించుకోవాలని, ఆర్టీసీని ఆదరించాలని కోరారు.

ఆగిన రీసర్వే!

- హడావిడిగా అవగాహన కార్యక్రమాలు
- సిబ్బంది లేరంటూ బుకాయింపు
- నీరు గారుతున్న సింగపేట రైతుల ఆశలు
- పరిష్కారానికి నోచని భూ సమస్యలు



సింగపేటలో రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

అల్లూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : నాలుగేళ్లుగా ఎప్పుడెప్పుడు రీసర్వే ప్రక్రియ ప్రారంభమవుతుందా అని ఎదురు చూసిన సింగపేట, అల్లూరు, అల్లూరుపేట రెవెన్యూ పరిధిల్లోని రైతులకు ఆగిన రీసర్వేతో నిరాశ ఎదురైంది. అత్యధిక విస్తీర్ణం కలిగిన ఈ గ్రామాల్లో చివరి దశలో రీసర్వే చేపట్టేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. మిగిలిన పంచాయతీల్లో రీసర్వే ప్రక్రియను ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఆ గ్రామాల్లో తలెత్తిన సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించలేకపోతున్నారు. రీసర్వే ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి సాదాబైనామా ప్రక్రియను అధికారులు నిర్వహించడం లేదు. దీనిపై ఎవరైనా రైతు అడిగితే రీసర్వే ప్రక్రియలో పూర్తి చేస్తామంటూ కాలయాపన చేస్తున్నారు. కానీ వారికి నచ్చిన వ్యక్తులకు మాత్రం సాదాబైనామా ప్రక్రియను చేపట్టి కొంతమంది అధికారులు జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇవన్నీ భరించలేక రైతులు నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్న క్రమంలో ఈనెల 4న సింగపేట పరిధిలో రీసర్వే ప్రక్రియను ప్రారంభించేందుకు హుటాహుటిన ప్రకటనలు, అవగాహన ర్యాలీలు, గ్రామసభలు నిర్వహించారు. దీంతో సంబరపడిన రైతులకు అధికారులు దానిని వాయిదా వేసి నిరాశను మిగిల్చారు. ఈ క్రమంలో భూసమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన చెందుతున్నారు.

● సిబ్బంది లేరంటూ బుకాయింపు

రీసర్వే ప్రక్రియకు ముందుగానే సిబ్బంది సమస్య ఉందని తెలిసినపుడు ప్రకటనలు ఎందుకంటూ స్థానిక రైతాంగం మండి పడుతోంది. గ్రామసభలు నిర్వహించి రైతులను మభ్యపెట్టడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. తమ భూములకు సంబంధించిన వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు రైతులు శతవిధాలా ప్రయత్నిస్తున్నప్పటికీ అధికారులు రీసర్వే సమయంలో చేస్తామని చెప్పడంతో నాలుగేళ్లుగా ఎదురు చూపులతోనే సరిపోయింది. మళ్లీ వాయిదా వేయడంతో రైతులు కోపానికి అధికారులు బలివుతున్నారు.

● నీరుగారిన రైతుల ఆశలు

రీసర్వే ప్రక్రియలో ఎన్నో సమస్యలు ఎదురై రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసున్నా అవి పరిష్కారం కావడం లేదు. ఇదిలాఉండగా తమ భూములకు శాశ్వత రికార్డు ఏర్పడుతుందని భావించిన సింగపేట, అల్లూరు, అలూరు పేట రెవెన్యూ పరిధిల్లోని రైతుల ఆశలు నీరుగారాయి. ఏకకాలంలో మొత్తం వేలాది ఎకరాలకు రీసర్వే పూర్తి చేయాలని అభిప్రాయపడుతున్న అధికారులు ఇది సరైన పద్ధతి కాదని కొద్ది విస్తీర్ణంతో మొదలుపెడితే సిబ్బంది సంపూర్ణ స్థాయిలో చేరుకునేసరికి కొంతమేరకైనా ప్రక్రియ పూర్తవుతోంది కదా అని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా అధికారులు రీసర్వే ప్రక్రియను అనుకున్న సమయానికి అనుకున్నట్టే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

రూ.300 కూలీ లభించేలా పని చేయించాలి : ఏపీడీ



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీడీ బాబూరావు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీలకు రోజూ రూ.300 వేతనం లభించేలా పని చేయించాలని ఏపీడీ బాబూరావు తెలిపారు. మండలంలోని జమీన్‌ఉప్పలపాడులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ కూలీలు ఉదయం 6 నుంచి 10 గంటల లోపు ఉపాధి పనులు ముగించుకొని తిరిగి ఇళ్లకు వెళ్లాలని తెలిపారు. చేసిన పనిని బట్టే వేతనం లభిస్తుందని తెలిపారు. పనుల వద్ద కూలీలకు వసతులు కల్పించాలని తెలిపారు. మరో వారం రోజుల్లో కూలీల ఖాతాల్లో పెండింగ్ వేతనాలు జమ కానున్నట్లు తెలిపారు.

మహిళల చైతన్యంతోనే కుటుంబ వికాసం

● కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కుటుంబంలోని మహిళలు చైతన్యవంతులైనప్పుడే కుటుంబాలు ఆర్థికంగా వికసిస్తాయని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. కావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగి కుటుంబాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. కుట్టు శిక్షణ నేర్చుకుని కుట్టు మిషన్ ద్వారా ఇంట్లోనే ఉంటూ నెలకు రూ.15 వేల పైన సంపాదించుకోవచ్చన్నారు. కావలి వస్త్ర వ్యాపారానికి ప్రసిద్ధి చెందిందని, కుట్టు ద్వారా నిత్యం ఉపాధి లభిస్తోందన్నారు. దుస్తులు కుట్టడం కూడా ఒక కళ అని, దానిని చిన్న చూపు చూడవద్దన్నారు. మూడు నెలలు కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం వారికి కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, కోఆర్డినేటర్ పద్మ, ఎంఈవో గోవిందయ్య, టీడీపీ పట్టణ ప్రధానకార్యదర్శి జ్యోతి బాబూరావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు అర్షియా బేగం, నాయకులు నాయుడు రాంప్రసాద్, నారాయణ, శివ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

అగ్నిప్రమాద బాధిత చిన్నారులు త్వరగా కోలుకోవాలి

● ఆలయాల్లో జనసేన నాయకుల ప్రత్యేక పూజలు, హోమాలు

ఉలవపాడు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లోని పాఠశాలలో ఈనెల 8వ తేదీన జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన చిన్నారులు త్వరగా కోలుకోవాలని మండల జనసేన పార్టీ నాయకులు బుధవారం స్థానిక నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ సింగపూర్‌లో అగ్నిప్రమాదం సంభవించిన పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తు ప్రమాదానికి గురైన విషయం తెలుసుకొని జనసైనికులు ఆందోళనకు గురయ్యామన్నారు. మార్క్‌శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ స్వామివారికి ప్రత్యేక హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూలగిరి శ్రీనివాస్, వక్కలగడ్డ మణికంఠ(అయ్యప్ప), చిలకా ప్రసాద్, లష్కర్ నాగేశ్వరరావు, తూనిగుంట గుప్తా, దన్యాసి శివ తదితరులు పాల్గొన్నారు.



నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న జనసేన నాయకులు

ప్రతాప్‌రెడ్డి అవినీతిని ఆధారాలతో బయటపెడతాం

● మహాజన సైన్యం అధ్యక్షుడు చేవూరు సురేంద్ర

కావలి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆయన అనుచరులు సోషల్ మీడియాలో చేస్తున్న అవాస్తవ ప్రచారాలను మానుకోకపోతే ఆయన అవినీతి భాగోతాలను ఆధారాలతో సహా బయటపెడుతామని మహాజన సైన్యం అధ్యక్షుడు చేవూరు సురేంద్ర హెచ్చరించారు. పట్టణంలోని జర్నలిస్ట్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియలో మాట్లాడటం సరికాదన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రామిరెడ్డి పాల్పడిన అవినీతి అక్రమాలన్నింటికి తమ వద్ద ఆధారాలతో సహా బయటపెట్టాల్సి వస్తోందన్నారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి కావలి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తుంటే అభివృద్ధిని అడ్డుకోవాలని చూడటం సరికాదన్నారు. పనిచేసే ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు అసత్య పోస్టులు పెట్టి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేయటం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో మహాజనసైన్యం నాయకులు కత్తి లక్ష్మణ్, చేవూరు జగత్‌జీవన్‌రామ్, చేవూరు మదన్‌కుమార్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహాజనసైన్యం అధ్యక్షుడు చేవూరు సురేంద్ర, తదితరులు

రాష్ట్ర షిరిడీ సాయి ధర్మ పరిరక్షణ సేవా సొసైటీ

గౌరవ అధ్యక్షుడిగా మానుగుంట

కందుకూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర షిరిడీ సాయి ధర్మ పరిరక్షణ సేవా సొసైటీ గౌరవ అధ్యక్షుడిగా విధులు నిర్వహిం చుటకు మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. దీనికి ఆయన అంగీకరించడంతో బుధవారం కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ సాయి తత్వ ప్రచారం, సేవా కార్యక్రమాలకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గౌరవ సలహాదారుడిగా విధులు నిర్వహించేందుకు మాజీ మంత్రి ముక్కు కాశీరెడ్డి అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ కార్యదర్శి గోపాలుని హరిహరరావు, సహాయ కార్యదర్శి దేవకి సుబ్రహ్మణ్యం, అలహరి చంచలరావు, శ్రీరామ్‌మూర్తి, నరసింహారావు, ముచ్చర్ల ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డికి అంగీకారపత్రం అందచేస్తున్న షిరిడీ సాయి కమిటీ సభ్యులు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మాలకొండ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సునీత

వలేటివారిపాలెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని మాలకొండ, పోకూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం 7వ జాతీయ పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు వజ్రమ్మ, సుజాత, శ్రీనివాసులు, కార్యకర్తలు పార్వతి, సరస్వతి, ఆశీర్వాదం, సుజాత, సుభాన్‌బీ, సుశీల, శ్యామల పాల్గొన్నారు.

గ్యాస్ ధర తగ్గించాలని సీపీఎం నిరసన



మహిళలతో కలిసి ఖాళీ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న సీపీఎం శ్రేణులు

కావలిటౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ సిలిండర్లతో బుధవారం వైకుంఠపురం పెంకుల ఫ్యాక్టరీ రోడ్డు వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒక గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచి పేదలపై భారం మోపారన్నారు. కేంద్రంలో మూడవ సారి అధికారంలో వచ్చిన మోదీ సర్కార్ నిత్యావసరాల ధరలు నియంత్రించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. మోదీ మాయ మాటలు, ఎన్నికల వాగ్దానాలు నమ్మి ప్రజలు అధికారం కట్టబెట్టారని, హామీలు అమలు చేయకపోగా విపరీత పోకడలు అవలంబించడం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలు అమలు చేయాలని, పెంచిన గ్యాస్ నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు కృష్ణమోహన్, కృష్ణయ్య, రమణయ్య, బంగారయ్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం



బ్రిడ్జి నిర్మాణానికి కొలతలు తీస్తున్న అధికారులు

కలిగిరి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని భట్టువారిపాలెం గ్రామంలో రూ.1.45 కోట్లతో చేపట్టనున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు బుధవారం అధికారులు కొలతలు తీశారు. ఈ సందర్భంగా సర్పంచు సూరేపల్లి మాధవ మాట్లాడుతూ భట్టువారిపాలెం గ్రామ సమీపంలో వర్షాకాలంలో వాగు నుంచి వచ్చిన నీరు ఉధృతంగా ప్రవహించడం వలన నాలుగైదురోజులపాటు స్థానికులు గ్రామం నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య తీవ్రతను గుర్తించిన ఆయన వెంటన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారన్నారు. ఈ మేరకు ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ డిపార్ట్‌మెంట్ డీఈ విశ్వేశ్వరరావు, ఏఈ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో కొలతలు తీసి పనులకు శ్రీకారం చుట్టారు.

భ్రూణ హత్యల నివారణ సామాజిక బాధ్యత

● ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

కావలిటౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): భ్రూణ హత్యల నివారణ సామాజిక బాధ్యతని కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై అవగాహన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సమాజంలో ఆడ, మగ శిశువుల మధ్య వివక్ష చూపకూడదన్నారు. బేటీ పడావో బేటీ బచావో అనేది కేవలం నినాదం మాత్రమే కాదని, అందరూ విధిగా పాటించాల్సిన బాధ్యతన్నారు. డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత మాట్లాడుతూ లింగ నిర్ధార పరీక్షలు చేయడం చేయించడం చట్టరీత్యా నేరమని, భ్రూణ హత్యల నివారణకు ప్రభుత్వం కట్టుదిట్టంగా ముందుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవోలు పద్మజ, సౌజన్య, సలహామండలి సభ్యులు మాలకొండారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రాజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఉలవపాడు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : ఉలవపాడులోని ఉపాధి హామీ కార్యాలయం వద్ద గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో అబ్దుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 12 పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం చేపట్టిన నివేదికను వెల్లడిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

అంబేడ్కర్ జయంతి స్మృతుల్లో ముస్లింలు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముస్లిం పెద్దలు, నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): భారతరత్న, రాజ్యాంగ రూపకర్త, అనగారిణ వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి స్మృతుల్లో భాగంగా ముస్లీం మైనారిటీ పెద్దలు, నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఏపీడీ అసోసియేషన్, జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ, దమ్మచక్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 4 ఏళ్లుగా అంబేడ్కర్ జయంతికి ముందు ఆయన స్మృతులు కార్యక్రమం జరుతోంది. దీనిలో భాగంగా ఈనెల 1 నుంచి 13వ తేది వరకు అంబేడ్కర్‌కు నివాళులర్పించే కార్యక్రమంలో భాగంగా బుధవారం 9వ రోజు స్థానిక ముస్లింలు ఆయనకు ఘన నివాళులర్పించారు. ఎస్‌కే రహీం, ఖాజా, ఉస్మాన్, యస్దాని, మొగల్‌బీగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకలయ్య కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఎరుకలయ్య కుటుంబ సభ్యులతో దామా శివబాబు

కొండాపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాయిపేట పంచాయతీ కొమ్ముపాలెంకు చెందిన కొంకుముడుసు ఎరుకలయ్య కుటుంబానికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రూ.15 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ నగదును బుధవారం టీడీపీ నాయకుడు దామా శివబాబు బాధిత కుటుంబానికి అందజేసి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకొని ఉన్నాడని, అతనికి పార్టీ కల్పించే ప్రమాద బీమా రూ.5 లక్షలు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం

● వైభవంగా పుష్పయాగం

కావలిటౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లోని పట్టాభిరామస్వామి ఆలయంలో ఉదయం సీతారాముల కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. రాత్రి శ్రీరాముల పట్టాభిషేక మహోత్సవం జరిగింది. ఉభయకర్తలుగా టీడీపీ నాయకులు సన్నిబోయిన నారాయణ వ్యవహరించారు. ఆలయ కమిటి అధ్యక్షుడు షరాబు సుబ్రమణ్యం, కోశాదికారి అమరా వేదగిరి, కమల్, కర్నాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఉత్తరంపేట పట్టాభిరామస్వామి ఆలయం, జనతాపేట సీతారామస్వామి రామాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాతసేవ, విఘ్నేశ్వర పూజ, విశేష పూజలు జరిగాయి. రాత్రి సీతారాములకు పుష్పయాగం కనుల పండువగా జరిగింది.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చేతిపంపు వద్ద నీటి కోసం అవస్థ

లింగసముద్రం మండలం మొగిలిచెర్ల ఆదిఆంధ్ర కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని మంచినీటి చేతిపంపు తక్కువ ఎత్తులో ఉంది. దీంతో విద్యార్థులు, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది క్రితం చేతిపంపు వద్ద ప్లాట్‌ఫ్లాం నిర్మించారు. దీంతో బోరింగ్ కింద నీరు వచ్చే పైపు పల్లంలోకి వెళ్లింది. దీంతో పైపు కింద బిందె పట్టి నీరు పటుకోవాలంటే వంట నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే విద్యార్థులు మంచినీటికి అవస్థలు పడుతున్నారు. తక్షణం దీనిని ఎత్తు పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోఎవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు టీడీపీ నాయకుడు అంగుళూరి చినకొండయ్య, కాలనీవాసులు కోరుతున్నారు. - లింగసముద్రం,(ఆంధ్రజ్యోతి)



పాఠశాలలో తక్కువ ఎత్తులో ఉన్న చేతిపంపు



విశేష అలంకరణలో సీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్ర మూర్తి

శబరి రామయ్య బ్రహ్మోత్సవాలు



మాతృకా పూజ చేస్తున్న భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమ య్యాయి. అర్చక బృందం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ పూజలు నిర్వహించారు. నందికేశ్వరా కూచిపూడి కళాక్షేత్రం చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం 8గంటలకు ధ్వజారోహణ, హోమం, ఉదయం 10 గంటలకు అర్చన, హారతి, సాయంత్రం హోమం, బలిహరణం, రాత్రి శేష పాన్పు అలంకరణలో నగరో త్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని ఆలయం చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

రేపు జ్యోతిరావు పూలే జయంతి

నెల్లూరు (హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించడానికి అన్నీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి వెంకట లక్ష్మ్మ తెలిపారు. ఆ వేడుకలకు సంబంధించి బుధవారం నగరంలోని ఆమె చాంబర్‌లో సన్నాహక సమావేశం జరిగింది. బీసీ కుల సంఘాల నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. పూలే 199వ జయంతి వేడుకలను ఉదయం 10.30 గంటలకు ఘనంగా జరపడానికి నాయకులు అంగీకరించారు.

పెండింగ్ బిల్లుల వివరాలివ్వండి: కలెక్టర్ ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డ్వామా, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి పెండింగ్ బిల్లుల వివరాలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి ఆయన అధికారులతో సమావేశమయ్యారు. 2017-18, 2018-19 సంవత్సరాల్లో డ్వామా ఆధ్వర్యంలో చేపట్టిన ఉపాధి హామీ పనులు, నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కాంక్రీటు పనులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు, బిల్లుల ఆప్‌లోడ్‌లో సాంకేతిక సమస్యలు మొదలైన అంశాలపై చర్చించారు. ఆయా పనులు, బిల్లుల పూర్తి వివరాలు అందించాలని సూచించారు. జిల్లాలో రూ.38కోట్లు నీటి తీరువా పన్నులు బకాయి ఉన్నాయని, సాగునీటి కాలువల పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీ చైర్మన్లు రైతులకు అవగాహన కల్పించి పన్నులు చెల్లించేలా సహకరించాలని కోరారు. ఆ నగదును జిల్లాలోని సాగునీటి కాలువల అభివృద్ధి, నిర్వహణ పనులకు వినియోగిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్, సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ వెంకట రమణారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్, డ్వామా పీడీ గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి

రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచండి

• డీఏవో సత్యవాణి

నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీరు సమృద్ధిగా ఉందని, ఎడగారు సీజన్‌లో పంటల సాగు కోసం రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఆదేశించారు. నెల్లూరులోని జిల్లా వనరుల కేంద్రంలో బుధవారం విత్తన తయారీదారులు, హోల్‌సేల్ వ్యాపారులు, డీలర్స్, ఎరువుల కంపెనీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. కేఎన్ఎం రకాలతో పాటు నెల్లూరు జిలకర, ధాన్యరాశి, శ్వేత, సుగంధ, జింక్ వరి రకాలు రైతులు సాగు చేసే అవకాశం ఉందని చెప్పారు. పంటల సాగుకు అవసరమైన ఎరువులను సైతం నిల్వ ఉంచి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏడీఏలు నర్సోజీరావు, శేషగిరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఆర్‌జేడీ ఆకస్మిక తనిఖీ

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వెంకటేశ్వరపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం రీజనల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్ ప్రియా ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాలలో జరుగుతున్న డిప్లమో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం కళాశాల అభివృద్ధి పనులపై ఆరాతీసి చేపట్టవలసిన కార్యక్రమాలపై ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రామారావుతో చర్చించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

42 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

• ఎండీయూ ఆపరేటర్‌పై 6ఏ కేసు నమోదు

పొదలకూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరాయపాలెంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించి, అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని సూరాయపాలెంలో ఇంటింటికి రేషన్ బియ్యాన్ని ఇచ్చే వాహన ఆపరేటర్ (ఎండీయూ ఆపరేటర్) కోళ్లకాడి పెంచలప్రసాద్ ఇంట్లో ప్లాస్టిక్ సంచుల్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వచేసి ఉన్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యం పక్కదారి పడుతున్నాయనే సమాచారంతో దాడులు జరిపారు. ఈ దాడుల్లో 42 ప్లాస్టిక్ సంచుల్లో 50 కేజీల చొప్పున ఉన్న 2100 కేజీల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి ఎండీయూ ఆపరేటర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కే.నరసింహారావు, విజిలెన్స్ తహసీల్దారు జీఎస్ కృష్ణప్రసాద్, ఏఈఈబీ వెంకటరెడ్డి, పొదలకూరు సివిల్ సప్లయిస్ డీటీ ఇండ్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి

వెంకటాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సరస్వతీనగర్ వద్ద జాతీయ రహదారి దాటుతున్న జింకను బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడ మృతి చెందింది. వివరాల్లోకి వెళితే... తాగునీటి కోసం సరస్వతీనగర్ గ్రామంలోకి వచ్చేందుకు జింక రహదారి దాటుతుండగా వాహనం ఢీకొంది. ఈ విషయాన్ని స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు వచ్చి జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

రాయితీ పరికరాలతో రైతులకు తోడ్పాటు

• డీఏవో సత్యవాణి

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : రైతులకు వ్యవసాయ పనిముట్లను రాయితీ ధరలకు అందించడంతో ఆర్థిక తోడ్పాటు లభిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి అన్నారు. బుధవారం మండలంలోని ఆమంచర్లలో రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలను అందించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ సీజన్‌కు ఈ రాయితీ పరికరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు శ్రీనివాసులు, శేషగిరిరావు, ఏవో నాగమోహన్, టీడీపీ నాయకులు వేణు నాయుడు, శివకుమార్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నగదు డిపాజిట్ చేస్తే అధిక లాభాలు వస్తాయంటూ ఓ యువతిని నమ్మించి రూ.2.58 లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.... నెల్లూరు నగరానికి చెందిన సాయిజ్యోత్స్న ఇన్‌స్ట్రాగ్రామ్ అకౌంట్‌కు గత నెల 20వ తేదీన సేవింగ్స్, ఆన్‌లైన్ మార్కెటింగ్ పేరిట లింక్ వచ్చింది. దానిని ఆమె క్లిక్ చేయగానే ఆమె వాట్సప్ నెంబరుకు నితేష్ అనే వ్యక్తి మెసేజ్ చేశారు. తాను డాటాబాక్స్ బిజినెస్ డాట్‌కమ్ కంపెనీకి చెందిన ప్రతినిధినని, ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు సూచనలు సలహాలు ఇస్తూ అధిక లాభాలు వచ్చేలా చేస్తానని అందులో పేర్కొన్నారు. అనంతరం నితేష్ టెలిగ్రామ్ యాప్‌లో ఆమెను యాడ్‌చేసి మెసేజ్ చేశారు. కంపెనీలో అకౌంట్ ఓపెన్ చేశారు. ఆ సమయంలో యువతి బ్యాంకు వివరాలు సేకరించారు. అనంతరం ఆమెను నమ్మించేందుకు కంపెనీ పాడెక్ట్ ఫీడ్‌బ్యాక్ చేయించి రూ.14,375 నగదు ఆమె బ్యాంకు ఖాతాలో జమచేశారు. దీంతో ఆమెకు నితేష్‌పై నమ్మకం పెరిగింది. ఇదే అదునుగా భావించిన నిందితుడు కంపెనీలలో పెద్ద మొత్తంలో డబ్బులు డిపాజిట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని చెప్పడంతో జ్యోత్స్న మూడు దఫాలుగా రూ.2,58,096 నగదు డిపాజిట్ చేశారు, అనంతరం ఆమె తన అకౌంట్‌ను పరిశీలించగా పెద్దమొత్తంలో నగదు ఉన్నట్లు చూపించింది. ఆ నగదు డ్రా చేసేందుకు ప్రయత్నించగా పెండింగ్‌లో ఉన్నట్లు చూపించింది. దీంతో ఆమె కంపెనీ కష్టమర్ సపోర్ట్ ప్రతినిధులతో చాట్ చేయగా కమిషన్ కింద రూ.4 లక్షలు డిపాజిట్ చేస్తే అకౌంట్‌లోని మొత్తం నగదు డ్రా చేసుకోవచ్చన్ని సూచించారు. దీంతో అనుమానం వచ్చిన బాధితురాలు ఈ నెల 1వ తేదీ ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫైలేరియా నియంత్రణకు ప్రత్యేక కృషి

• డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత



ఫైలేరియా బాధితులకు కిట్లు అందిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, వైద్యాధికారులు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఫైలేరియా వ్యాధి నియంత్రణకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత వెల్లడించారు. బుధవారం నెల్లూరు లోని కోటమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఫైలేరియా (బోద) వ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ చేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ క్యూలెక్స్ దోమ వల్ల ఫైలేరియా వస్తుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని దోమల నియంత్రణకు ప్రతీ ఒక్కరు సహకారం అందించాలని కోరారు. శరీరంలో వ్యాధిసోకిన ప్రాంతా లను ఈ కిట్లతో శుభ్రం చేసుకోవాలని సూచిం చారు. జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ హుస్సేనమ్మ మాట్లాడుతూ తగిన చికిత్స తీసుకుంటే ఫైలేరియాను నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జునైద్ సిద్దిక్, మలేరియా విభాగం సహాయ అధికారి నాగార్జున రావు, కో ఆర్డినేటర్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే దళితులకు న్యాయం

• ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే దళితులకు న్యాయం జరుగుతుందని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం నెల్లూరుకు వచ్చిన ఆయన జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో షెడ్యూల్ కులాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందని చెప్పారు. ఈ ఏడాదికి రూ.51.81 కోట్లతో 1240 మందికి లబ్ధి చేకూరే విధంగా పలు యూనిట్లు మంజూరు చేసిందన్నారు. బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాల కోసం ఈ నెల 14 నుంచి మే 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మే 11 నుంచి 20 వరకు లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, 21 నుంచి 27 వరకు ఎంపికైన వారి జాబితాను బ్యాంకులకు ఎంపీడీవోలు పంపుతారని చెప్పారు. జూన్ 13 నుంచి 20 వరకు పాలనా ఉత్తర్వులు అందజేసి, జూన్ 21 నుంచి ఆగస్టు 9 లోగా యూనిట్లు గ్రౌండ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, సుందరరామిరెడ్డి, గునుకుల కిషోర్, పీ చంద్రశేఖర్, మార్కెట్ సురేష్, జమీర్, తదితరులు పాల్గొన్నారు. కాగా, మాల మహానాడు నగర అధ్యక్షుడు కమతం అశోక్ ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ భవనం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని విజయ్‌కుమార్ ప్రారంభించారు. మూడు నెలలు చలివేంద్రాన్ని కొనసాగిస్తామని అశోక్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, నాయకులు కొత్తకోట కిరణ్, గణేష్, వడ్లమూడి రమేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



విరాళంగా అందిన కంప్యూటర్లను చూపుతున్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు

రూ.9.15 లక్షల విలువైన కంప్యూటర్ల వితరణ

కందుకూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : కందుకూరులోని టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విర్కో ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.9,15,000 విలువైన 15 హెచ్‌పీ డెస్క్‌టాప్ కంప్యూటర్లు బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కల్పన విషయాల్లో ప్రగతిని సాధించడానికి విర్కో ఫౌండేషన్ చైర్మన్ నారాయణరెడ్డి విశేష కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సంస్థ చైర్మన్ మిత్రులు కొండేపి శ్రీరామచంద్రరావు, విశ్రాంత హెచ్ఎం ఇప్పగుంట మల్లికార్జునరావు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో ప్రీ స్కూల్, హైస్కూల్ భవనాలను నిర్మించడం, శానిటేషన్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం, 10వ తరగతి, కాలేజీ విద్యాభ్యాసంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఏడాదికి రూ.15,000 అందిస్తున్నారన్నారు. కేన్సర్ బారిన పడిన 287 మంది పేదింటి పిల్లలకు కీమోథెరపీ అందించారు. 1566 మంది కిడ్నీ సంబంధిత రోగులకు డయాలసిస్ చేయించినట్లు తెలిపారు. దీనిలో భాగంగానే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు డెస్క్‌టాప్ కంప్యూటర్లు అందచేసినట్లు పేర్కొన్నారు. కళాశాలకు భారీ వితరణ అందించిన విర్కో ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బడిబయట పిల్లలు బడిలోనే ఉండాలి

• డీఈవో బాలాజీరావు



డ్రాపవుట్స్‌ను బడిలో చేర్పిస్తున్న డీఈఓ బాలాజీరావు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : బడిబయట పిల్లలందరూ ఇకపై బడిలో ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఆర్ బాలాజీరావు ఆదేశించారు. నెల్లూరులోని మహాత్మాగాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో డ్రాపవుట్ విద్యార్థులను బుధవారం ఆయన స్వయంగా కలిసి బడిలో చేర్పించి మాట్లాడారు. బడిఈడు పిల్లలు బడిలో చదువుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలు బడిబయట పిల్లల వివరాలు సేకరించి వారిని బడిలో చేర్పించేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు జారీ చేశామని తెలిపారు. అనంతరం షేక్ ఆస్మా, షేక్ అబిదా కౌసర్‌ను ఆయన పాఠశాలలో చేర్పించి రిజిస్టర్‌లో పేర్లు నమోదు చేయించారు. ఈ కార్యక్ర మంలో రూరల్ ఎంఈవో మురళీధర్, ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాజా రహంతుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నార్తురాజుపాళెం లేఅవుట్‌లో నిగ్గుతేలిన అవినీతి

• సబ్ రిజిస్ట్రార్ల చేతివాటాన్ని గుర్తించిన ప్రభుత్వం

• నలుగురిపై చర్యలకు ఆదేశం



కోవూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

కోవూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కన నార్తురాజు పాళెం గ్రామ పొలిమేరలో ఏర్పాటుచేసిన మారుతీ లేఅవుట్ రిజిస్ట్రేషన్లలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన రిజిస్ట్రేషన్ ఫీజు తగినంత చెల్లించలేదు. దీంతో నలుగురు సబ్‌రిజిస్ట్రార్లపై ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని తాజాగా రిజిస్ట్రేషన్‌శాఖను ఆదేశించింది. వివరాల్లోకి వెళ్తే.. కొడవలూరు మండలం నార్తురాజు పాళెం గ్రామ పరిధిలోని ఆరో వార్డులో ఏర్పాటు చేసిన మారుతీ లేఅవుట్‌కు సమీపంలోని డోర్ నెంబరు 6-102లో చదరపు అడుగు ధర రూ.600. ఆ డోర్‌నంబరు పక్కనే ఉన్న ప్లాట్లను నలుగురు సబ్‌రిజిస్ట్రార్లు చదరపు అడుగు ధర రూ.250, రూ.125లకే నిర్ణయించి రిజిస్ట్రేషన్లు చేశారు. 2004లో కోవూరులో సబ్‌రిజిస్ట్రార్‌గా పని చేసిన లలితమ్మ చదరపు గజం ధర రూ.125గా నిర్ణయించి 170 డాక్యుమెంట్లను చేశారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి రూ.14,91,000 గండిపడింది. సయ్యద్ సిరాజ్ చదరపు గజం ధర రూ.125గా నిర్ణయించి ఏడు డాక్యుమెంట్లను రిజిస్టర్ చేశారు. దీంతో రాష్ట్ర ఖజానాకు రూ.64,400 గండి పడింది. 2004 మార్చి 24న ఇన్‌చార్జి సబ్‌రిజిసస్ట్రార్‌గా పనిచేసిన టీఎల్ కాంతారావు చదరపు గజం రూ.250గా నిర్ణయించి మూడు డాక్యుమెంట్లను చేశారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి రూ.5,77,926ల గండిపడింది. 2004లో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ సయ్యద్ మహబూబ్‌బాష చదరపు గజం రూ.250గా నిర్ణయిచి ఏడు డాక్యుమెంట్లను చేయడంతో రూ.14,73,993 ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోయింది. ప్రభుత్వానికి చెందాల్సిన రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించకుండా అవకతవకలకు పాల్పడిన నలుగురు సబ్‌రిస్ట్రార్లపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

• 20 ఏళ్ల తరువాత ఆదేశం

రిజిస్ట్రేషన్ ఫీజు విషయమై ఆ శాఖకు చెందిన ఉద్యోగులే ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. నెల్లూరుకి చెందిన అడ్వకేట్ పెంచలరెడ్డి ఫిర్యాదు చేసేందుకు ఆ నలుగురిలో ఒకరే కారణమని చెబుతున్నారు. మనస్తాపానికి గురైన ఓ సబ్‌రిజిస్ట్రార్ ఫీజు మతలబు గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారని తెలిసింది. రిజిస్ట్రేషన్‌శాఖాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళినా, ఫలితం లేకపోవడంతో నేరుగా ఆయన ప్రభుత్వానికే విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై దృష్టి సారించిన ప్రభుత్వం రెండు దశాబ్దాల తరువాత చర్యలకు ఆదేశించింది. నలుగురు రిజిస్ట్రార్లలో ఇప్పటికే ఇద్దరు పదవీ విరమణ చేశారు. మరో ఇద్దరు పదవీ విరమణకు సమీపంలో ఉన్నారు. క్రమశిక్షణ చర్యలు ఎలా ఉంటాయనే విషయమై ఎలాంటి సమచారం లేదని రిజిస్ట్రేషన్ శాఖాధి కారులు తెలిపారు. వారి జీతాల నుంచి లేదా పింఛన్ల నుంచి నగదు రికవరీ చేస్తారని పలువురు భావిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ బిల్లుతో పెన్షనర్లకు ఇబ్బందులు: మాజీ ఎమ్మెల్సీ విఠపు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ ఆర్థిక బిల్లు పెన్షన్-2025 వల్ల పెన్షనర్స్ పరిస్థితి దారుణంగా మారే ప్రమాదం ఉందని మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం గౌరవాధ్యక్షుడు విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆందోళన వ్యక్తం చేవారు. బుధవారం సాయంత్రం భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్స్ భవన్‌లో సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు ఎస్ఎం గౌస్ మాట్లాడుతూ 2023-24, 2024-25 సంవత్సరాలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆదాయ పన్ను వివరాలను సభ్యులందరికీ వివరించారు. పెన్షనర్స్‌కు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో ఆర్ శ్రీహరి, ఎస్‌కే ఖాజా రసూల్, వెంకట స్వామి, ఎస్‌కే ఖాసిం, కోశాధికారి మూర్తి, హజరత్తయ్య పాల్గొన్నారు.

మెప్మా సంఘాల జీవనోపాధుల మెరుగుకు కృషి



మాట్లాడుతున్న మెప్మా పీడీ రాధమ్మ


'ఈ-శ్రమ్'లో మెప్మా పీడీ రాధమ్మ

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యో తి) : పొదుపు సంఘాల మహి ళల జీవనో పాధుల మెరుగుకు కృషి చేస్తు న్నామని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రాధమ్మ చెప్పారు. నెల్లూరులోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఈ-శ్రమ్ కార్యక్రమంపై బుధవారం అవగా హన సదస్సు జరిగింది. ఆమె మాట్లాడుతూ మెప్మా ఎన్నో వినూత్న కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేస్తోందన్నారు. సీఎస్సీ సెంటర్ డీపీఎం సురేష్ మాట్లా డుతూ సీఎస్‌సీ సెంటర్ నిర్వహణకు సలహాలు, సూచనలు ఇచ్చారు. మెప్మాలో నిర్వహిస్తున్న అన్నీ కార్యక్రమాలు, పొదుపు సంఘాల లావాదేవీలు, ఆడిట్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎంఎంలు కవిత, జరీనా, టీఈ కాంతయ్య, అంకయ్య, సీవోలు, ఆర్‌పీలు, టీఎల్ఎఫ్ అధ్యక్షులు లక్ష్మీ, మాధవి, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో లెక్చరర్ల పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఇందుకూరుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లిపాడు ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో 2025-26 సంవత్సరానికి డిప్యుటేషన్‌పై లెక్చరర్లుగా పనిచేయుటకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డైట్‌లో 27 (22 సాధారణ అధ్యాపకులు, 5 ఉర్దూ) లెక్చరర్ల పోస్టులకు ఉమ్మడి నెల్లూరుజిల్లాలో పనిచేస్తున్నవారు అర్హులని తెలిపారు. అయితే వారికి 58 ఏళ్ల వయసు మించరాదని, ఐదేళ్ల అనుభవం, సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులు వచ్చి ఉండాలని తెలిపారు. ఎంఈవోలు, హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్‌లు ఈనెల 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 16, 17వతేదీల్లో అభ్యర్థులకు రాత పరీక్ష ఉంటుందని, 19న జిల్లా కమిటీ ద్వారా ఎంపిక చేస్తామని ఆ ప్రకటనలో వివరించారు.

శ్మశాన స్థలం కోసం ఆందోళన



మృతదేహంతో ఆందోళన చేస్తున్న మహిళలు

కోవూరు, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): శ్మశాన స్థలం కోసం బుధవారం స్థానిక నందలగుంట సమీపంలోని గిరిజనులు ఆందోళన చేపట్టారు. నందలగుంట నుంచి కొత్తగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనున్న స్థలాన్ని చాలాకాలం నుంచి తాము శ్మశానంగా వాడుతున్నామని, ఇటీవల మృతదేహాలను పూడ్చనీయడం లేదని గిరిజనులు వాపోయారు. ఈ క్రమంలో బుధవారం అద్దూరు పెంచలయ్య అనారోగ్యంతో మృతిచెందగా, వివాదాస్పద స్థలంలో పూడ్చేందుకు కొందరు వ్యక్తులు అడ్డుకున్నారు. గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు కేసీ పెంచలయ్య నాయకత్వంలో పెద్దసంఖ్యలో ఘటనాస్థలానికి చేరుకున్నారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. సీఐ సుధాకరరెడ్డి, ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతపరచారు. తహసీల్దారు నిర్మలానంద బాబ మాట్లాడుతూ ఈ వివాదాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని, ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చేంత వరకు వివాదాలకు దూరంగా ఉండాలని కోరారు. దీంతో వారు శాంతించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ

నెల్లూరు(జడ్పీ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని గ్రామీణ నీటిపారుదల శాఖ ఎస్ఈ వెంకట రమణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే రూ.2.14కోట్లతో అవసరమైన గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో 17.93లక్షల మందికి వివిధ పథకాల ద్వారా తాగునీటిని అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో భూగర్భజల మట్టం గరిష్ఠంగా 18మీటర్లుగా ఉందని తెలిపారు. కందుకూరు నియోజకవర్గంలోని లింగసముద్రం, గుడ్లూరు మండలాలు, కోవూరు నియోజకవర్గంలో కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాలు, ఉదయగిరిలో సీతారామపురం మండలం, సర్వేపల్లి నియోజకవర్గంలో పొదలకూరు మండలం, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రూరల్ మండలంలో భూగర్భ జలాల కొరత ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. బస్టాండ్‌లు, పంచాయతీలు, ఇతర రద్దీ ప్రాంతాల్లో తాగునీరు అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. పశువులకు నీటి ఇబ్బంది ఏర్పడకుండా నరేగా నిధులతో 109 నీటి తొట్టెలను నిర్మించామని వివరించారు. మరో 764 తొట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు.